www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బంగాళాఖాతంలో 12
అల్పపీడనం
ఒడిశా, బెంగాల్, జార్ఖండ్ వైపు పయనం
నైరుతి తర్వాత మొదటి అల్పపీడనం ఇదే
ఉత్తర కోస్తా మినహా ఏపీపై ప్రభావం తక్కువ
29 తర్వాత మరో అల్పపీడనం!
శ్రీశైలం జలాశయానికి భారీగా వరద

శుక్రవారం | 27-6-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 72 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మఋతువు, ఆషాఢమాసం, శుక్ల పక్షం తిథి: విదియ ఉ.11:20 తదుపరి తదియ, నక్షత్రం: పునర్వసు ఉ.7:22 తదుపరి పుష్యమి, వర్జ్యం: మ.3:06-4:39, దుర్ముహూర్తం: ఉ.8:23-9:15, మ.12:44-1:36, అమృతఘడియలు: రా.12:24-1:57, రాహుకాలం: ఉ.10:30-12:00, సూర్యోదయం: 5:47, సూర్యాస్తమయం: 6:49 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గుంటూరులో విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న సీఎం చంద్రబాబు

గంజాయి, డ్రగ్స్‌పై ఇక యుద్ధమే!

రాజకీయ ముసుగులో ముఠాలకు సహకరిస్తే ఎలా అదుపు చేయాలో నాకు తెలుసు: సీఎం

హైదరాబాద్ అంటే హైటెక్ సిటీ ఎలా గుర్తుకొస్తుందో ఇప్పుడు అమరావతి అంటే క్వాంటమ్, జీనోం, ఏఐ గుర్తుకొస్తాయి. విజన్-2047లో భాగంగా తెలుగుజాతిని ప్రపంచంలో నంబర్ 1గా తీర్చిదిద్దడమే నా లక్ష్యం. -చంద్రబాబు

- మారండి.. లేదంటే రాష్ట్రం వదిలిపోండి
- ఎవరైనా అడ్డొస్తే తొక్కుకుంటూ పోతా
- జగన్ జమానాలో గంజాయిలో ఏపీ నం.1
- నాడు 11 వేల ఎకరాల్లో సాగు.. నేడు జీరో
- గూగుల్, శాటిలైట్, డ్రోన్స్‌తో కన్నేశాం
- ప్రజా చైతన్యంతోనే గంజాయి, డ్రగ్స్ కట్టడి
- వాటిని నియంత్రించకుంటే జాతి నిర్వీర్యం
- గుంటూరు సభలో చంద్రబాబు స్పష్టీకరణ
- టోల్ ఫ్రీ నంబరు 1972కు శ్రీకారం
- వాట్సాప్ నంబరు 8977781972 కూడా

గుంటూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తున్న గంజాయి, డ్రగ్స్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు యుద్ధం ప్రకటించారు. రాష్ట్రానికి, సమాజానికి అత్యంత ప్రమాదకరంగా పరిణమించిన వీటిని అడ్డుకునేందుకు కఠినంగా వ్యవహరిస్తామని, ఎవరైనా అడ్డొస్తే తొక్కుకుంటూ పోతామని హెచ్చరించారు. రాజకీయ ముసుగులో

మిగతా 13వ పేజీలో...

లిక్కర్ నిందితులకు నార్కో టెస్ట్?

అన్నీ తెలిసీ నోరు విప్పని బాసులు



- వారితో నిజాలు చెప్పించేందుకే నార్కో పరీక్షలు చేసే ఆలోచన
- కోర్టులో పిటిషన్ వేయనున్న సిట్
- కోర్టు అనుమతిస్తే ఐదుగురికి నిర్వహణ
- రాజ్ కసిరెడ్డి, ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, గోవిందప్ప, చెవిరెడ్డికి లై డిటెక్టర్ పరీక్ష చేసే అవకాశం

అమరావతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నేరం చేసిన వ్యక్తిని కనిపెట్టడం ఒక ఎత్తయితే, ఆ నేరాన్ని రుజువుచేసి బాధ్యుడికి శిక్ష వేయించడం దర్యాప్తు అధికారులకు పెద్ద సవాలే! ఇందులో మొదటి పని ఎలాగోలా చేయగలిగే పోలీసులు.. రెండో విషయంలో మాత్రం నిందితులతో నిజాన్ని చెప్పించలేక, వారు చెప్పే అబద్ధాలు అంగీకరించలేక ఒత్తిడికి గురవుతుంటారు. అయితే తెలివైన నిందితుల నుంచి అంతే తెలివిగా నిజాలు రప్పించేందుకు నార్కో పరీక్షలు, పాలిగ్రాఫ్, బ్రెయిన్ మ్యాపింగ్ వంటి పద్ధతులు ఉన్నాయి. లిక్కర్ కేసు వెలికి తీస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఇప్పుడు ఈ పద్ధతులు అనుసరించే యోచనలో ఉన్నట్టు తెలిసింది. మద్యం దోపిడీకి జగన్ హయాంలో రచించిన ప్రణాళిక నుంచి దాని అమలు, ముడుపుల వసూళ్లు.. వాటాల పంపిణీ.. వాహనాల్లో తరలింపు.. ప్రతిదీ ఆధారాలతో సహా సేకరించింది. నిందితులు, లబ్ధిదారులు, సాక్షులను విచారించి కేసును దాదాపు కొలిక్కి తెచ్చారు. అంతిమ లబ్ధిదారు ఎవరో రాష్ట్రమంతటికీ తెలిసినా ఈ దందాలో ప్రతి అంశమూ న్యాయస్థానంలో నిలిచేలా ఉండాలి. సిట్ అధికారులు ఏ-1 రాజ్ కసిరెడ్డిని ఎంత ప్రశ్నించినా అడ్డగోలు సమాధానాలు తప్ప నిజాలు చెప్పలేదు. వారం రోజులకు పైగా కస్టడీకి తీసుకుని వందల ప్రశ్నలు సంధించినా అసలు గుట్టు వెల్లడించలేదు. 'ఇవిగో నీ పాత్రపై ఆధారాలు...' అంటూ దర్యాప్తు అధికారులు ముందు పెట్టి ప్రశ్నిస్తే మౌనం వహించారు. పదే పదే ప్రశ్నించడంతో.. 'మీరు నన్ను జైలుకు మాత్రమే పంపగలరు. అసలు వ్యక్తి పేరు వెల్లడిస్తే నన్ను పైకి పంపుతారు' అంటూ భయాన్ని వ్యక్తం చేశారు. రాజ్ కసిరెడ్డితో పాటు

మిగతా 14వ పేజీలో...

వైసీపీ హయాంలో రైతులకు వ్యవసాయ పరికరాలు అందించడానికి అనుసరించిన విధానంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఒక వస్తువు సరఫరా బాధ్యతను ఒక కంపెనీకి మాత్రమే అప్పట్లో అప్పజెప్పారు. రైతులకు కంపెనీని ఎంచుకునే అవకాశం ఇవ్వలేదు. దీంతో నాసిరకం పరికరాలు సరఫరా అయ్యాయి. వీటి నాణ్యతపై కుప్పలుతెప్పలుగా ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో పరికరాలపై రైతులు చెల్లించాల్సిన 20 శాతం వాటా ఆగ్రోస్‌లోనే ఉండిపోయింది. ఫిర్యాదులకు భయపడి కనీసం 20 శాతం వాటా సొమ్మును తీసుకోవడానికి కూడా ఆ కంపెనీలు రావడం లేదు. కట్ చేస్తే...కూటమి ప్రభుత్వంలో మళ్లీ అదే తప్పు ఏపీ ఆగ్రోస్ చేస్తోంది.

'లిక్కర్' బాసులకే ఆగ్రోస్ టెండర్లు!



- మద్యం స్కామ్‌లో ఇప్పటికే ఎస్పీవై రెడ్డి అల్లుడి అరెస్టు
- తాజాగా వారి కంపెనీలే ఎల్1 అయ్యేలా చర్యలు
- రైతులకు సాగు పరికరాలు అందించడానికి ఏప్రిల్‌లో పిలిచిన టెండర్లు రద్దు చేసిన ఏపీ ఆగ్రోస్
- 15 ఏళ్ల అనుభవం.. రాష్ట్రంలోనే తయారీ ప్లాంట్..
- ఆ కంపెనీలే అర్హత సాధించేలా రూల్స్ మార్పు
- వాటి ఆధారంగా ఈ నెల 5న మళ్లీ టెండర్లు
- చక్రం తిప్పుతున్న ఓ సీనియర్ అధికారి!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రైతులకు వ్యవసాయ పరికరాలు అందించే టెండర్ల కాంట్రాక్టును రూ.వేల కోట్ల లిక్కర్ స్కామ్‌లో నిందితులుగా ఉన్న ఎస్పీవై రెడ్డి సంస్థలకు కట్టబెట్టేందుకు ఏపీ ఆగ్రోస్ తహతహలాడుతోంది. స్కామ్ సొమ్ము బేవరేజెస్ కార్పొరేషన్ నుంచి ఎస్పీవై ఆగ్రోస్ ఇండస్ట్రీస్ ద్వారా పలు షెల్ కంపెనీలకు చేరినట్టు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తులో తేలింది. ఎస్పీవై రెడ్డి అల్లుడు సజ్జల శ్రీధర్ రెడ్డిని ఈ వ్యవహారంలో ఇప్పటికే అరెస్టు చేసింది. ప్రస్తుతం ఆయన జైలులో ఉన్నారు. ఇప్పుడు వారికే చెందిన సుజల పైప్స్, నంది పైప్స్ కంపెనీలకు టెండరు కట్టబెట్టాలన్న ఉద్దేశంతోనే ఏపీ ఆగ్రోస్‌లో టెండర్ నిబంధనలు పూర్తిగా

మిగతా 13వ పేజీలో...



14

విశాఖకు వస్తున్నాం

- ప్రకటించిన సాఫ్ట్‌వేర్ సంస్థ కాగ్నిజెంట్
- కాపులుప్పాడలో 22 ఎకరాల్లో అత్యాధునిక క్యాంపస్ నిర్మాణం
- 2026 తొలినాళ్ల కల్లా కార్యకలాపాలు
- 2029 నాటికి తొలిదశ పూర్తి
- 8 వేల మందికి కొత్తగా ఉద్యోగాలు
- ఎక్స్ వేదికగా వెల్లడించిన సంస్థ
- సన్‌రైజ్ రాష్ట్రానికి స్వాగతం: లోకేశ్


12

ఫోన్ ట్యాపింగ్‌పై
నేడు 'ఆంధ్రజ్యోతి' ఎండీ వాంగ్మూలం
విచారణకు రావాలని టీ-సిట్ నోటీసు



రాజధానిలో టవర్లకు రైట్ రైట్..
14

- ఎల్-1 బిడ్డర్లకు ఎల్‌వోఏల అందజేత
- 3,673 కోట్లతో పనులు అప్పగింత
- మౌలిక వసతులకు రూ.1,052 కోట్లు


రాజమహేంద్రవరం పుష్కర ఘాట్‌ను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి షెకావత్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు కందుల దుర్గేశ్, నిమ్మల రామానాయుడు తదితరులు

గోదారి కుర్రాళ్ల బైకుల్లా అభివృద్ధి పరుగు!

- శక్తిమంతమైన నాయకుల వల్లే ఇది సాధ్యం
- ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నేతృత్వంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వంలో అభివృద్ధి వేగం
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 13
- అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకు శంకుస్థాపన.. సైన్స్ మ్యూజియం ప్రారంభం

రాజమహేంద్రవరం అనగానే గుర్తొచ్చేది గోదావరి తీరం. తీరం వెంబడి నాగరికత, భాష అన్నీ అభివృద్ధి చెందుతాయి. అలాంటి ఈ గోదావరి నేల మీద ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ జన్మించారు. మహాభారతాన్ని తెలుగులోకి అనువదించిన నన్నయ్య నడయాడారు. ఎంతోమంది కళాకారులు, సామాజిక వేత్తలకు జన్మనిచ్చిన నేల ఇది. - పవన్ కల్యాణ్

ఐఎస్ఎస్‌లోకి శుభాన్షు

ఆ ఘనత సాధించిన తొలి భారతీయుడిగా చరిత్ర

- అంతరిక్ష కేంద్రంతో గ్రేస్ అనుసంధానం
- కొత్తగా వచ్చిన నలుగురికి స్వాగతం పలికిన ఏడుగురు వ్యోమగాములు
- త్రివర్ణ పతాకంతోపాటు మీ ప్రేమ కూడా నాతో ఉంది
- అంతరిక్షం నుంచి భూమి అద్భుతం
- భారరహిత స్థితిలో అంతా కొత్తగానే
- శిశువులా నేర్చుకుంటున్నా
- వీడియో లింక్ ద్వారా శుభాన్షు శుక్లా


అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో సహచర వ్యోమగాములతో శుభాన్షు శుక్లా (వృత్తంలో)

న్యూఢిల్లీ, జూన్ 26: భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా, మరో ముగ్గురు వ్యోమగాములు గురువారం సాయంత్రం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి(ఐఎస్ఎస్)ప్రవేశించారు. వారికి ఐఎస్ఎస్‌లోని ఏడుగురు వ్యోమగాములు సాదరంగా స్వాగతం పలికారు. అంతరిక్షం నుంచి భూమిని చూసే అరుదైన అవకాశం తనకు లభించటంపై శుభాన్షు హర్షం వ్యక్తం చేశారు. తాను ఊహించుకున్న దానికన్నా గొప్పగా ఉందన్నారు. బుధవారం మధ్యాహ్నం 12.01 గంటలకు అమెరికాలోని కెనడీ అంతరిక్ష కేంద్రం నుంచి బయల్దేరిన గ్రేస్.. 28 గంటల అనంతరం గురువారం సాయంత్రం 4.01 గంటలకు ఐఎస్ఎస్‌ను చేరుకుంది. ఆ తర్వాత ఐఎస్ఎస్‌తో 12 జతల హుక్స్ ద్వారా అనుసంధానమయ్యే ప్రక్రియ మొదలైంది. ఐఎస్ఎస్‌కు గ్రేస్‌కు మధ్య సమాచార, విద్యుత్ లింకులు

మిగతా 2వ పేజీలో...

రాజ్యాంగమే 'సుప్రీం'

- బుల్డోజర్ న్యాయం పనిచేయదు
- సీజేఐ జస్టిస్ గవాయ్ వ్యాఖ్యలు



అమరావతి (మహారాష్ట్ర), జూన్ 26: రాజ్యాంగమే సర్వోన్నతమని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. ప్రజాస్వామ్యంలోని మూడు విభాగాలైన న్యాయ, కార్యనిర్వాహక, శాసన వ్యవస్థలు దాని కిందే పనిచేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. తన జన్మస్థానమైన అమరావతిలో బుధవారం జరిగిన సన్మానసభలో ఆయన ప్రసంగించారు. రాజ్యాంగమే సర్వోన్నతం అంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన 'మౌలిక స్వరూపం' తీర్పును ప్రస్తావించారు. రాజ్యాంగాన్ని సవరించే అధికారం మాత్రమే పార్లమెంటుకు ఉందని, పూర్తిగా మార్చివేసే అధికారంలేదని ఆ తీర్పు ద్వారా స్పష్టం చేసిందని పేర్కొన్నారు. పార్లమెంటే సుప్రీం అని కొందరు అంటున్నారని, కానీ తన ఉద్దేశంలో రాజ్యాంగమే సుప్రీం అని అన్నారు. నివాస హక్కు సుప్రీం అని, దానిని బుల్డోజర్లతో అడ్డుకోలేరని తెలిపారు.

భాష ఈ దేశపు ఆత్మ

- హిందీకి ఏ భాషతోనూ శత్రుత్వం లేదు: అమిత్‌షా

న్యూఢిల్లీ, జూన్ 26: భాష కేవలం వ్యక్తీకరణ మాధ్యమంకాదని, అది ఈ దేశపు ఆత్మ అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వ్యాఖ్యానించారు. భారతీయ భాషలతో హిందీకి మిత్రత్వం ఉన్నదని, అన్ని భాష లూ మిళితమైతేనే దేశ ఆత్మగౌరవాన్ని నిలపడంలో గొప్ప పాత్ర పోషించగలవన్నారు. ఢిల్లీలో అధికార భాషా విభాగం ఏర్పడి యాభై ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో గురువారం అమిత్‌షా పాల్గొన్నారు. భాషల సాయం లేకుండా చరిత్ర, సంస్కృతి ప్రాచుర్యం పొందలేవన్నారు. భారతీయ భాషల ఉన్నతి, అధికార భాష అభివృద్ధికి రానున్నకాలంలో ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టనున్నట్టు అమిత్‌షా తెలిపారు. కేంద్రం, రాష్ట్రాల్లో పాలనా వ్యవహారాలన్నీ భారతీయ భాషల్లోనే సాగుతున్నాయన్నారు. భాషల మధ్య వైషమ్యంలేదని, విదేశీ భాషలు సహా ఏ భాషకూ హిందీ శత్రువుకాదని పేర్కొన్నారు.

ఆకాశంలోనే విమాన ఇంజన్‌లో మంటలు

- 159 మంది సురక్షితం.. అమెరికాలో ఘటన

లాస్ వేగాస్, జూన్ 26: ఆకాశంలో ఉండగా ఓ అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానం ఇంజన్‌లో మంటలు వ్యాపించడంతో దాన్ని అత్యవసరంగా కిందికి దించివేయాల్సి వచ్చింది. లాస్ వేగాస్‌లోని హ్యారీ రీడ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బుధవారం ఉదయం 8.15 గంటలకు ఆ విమానం 153 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది మొత్తం 159 మందితో బయలుదేరింది. కాసేపటికే కుడి ఇంజన్‌లో సమస్యలు తలెత్తి మంటలు వ్యాపించినట్టు గుర్తించి దాన్ని వెనక్కి మళ్లించి ఐదు నిమిషాల్లోనే అత్యవసరంగా కిందికి దించారు. ప్రయాణికులు ఎవరికెలాంటి నష్టం జరగలేదు.

ఎస్‌సీవో ప్రకటనపై సంతకానికి రాజ్‌నాథ్ నో

- పహల్గాం ఉగ్రదాడి ప్రస్తావన లేకపోవడంతో నిరాకరణ

క్వింగ్దావో, జూన్ 26: షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సంయుక్త ప్రకటనపై సంతకం చేయడానికి భారత్ గురువారం నిరాకరించింది. అందులో పహల్గాం ఉగ్రదాడి ప్రస్తావన లేకపోవడంతో పాటు సీమాంతర ఉగ్రవాదంపై భారత్ కఠిన వైఖరిని స్పష్టంగా పేర్కొనకపోవడంతో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ దానిపై సంతకం చేయలేదు. ఈ నేపథ్యంలో ఎస్‌సీవో రక్షణ మంత్రుల సమావేశం ఉమ్మడి ప్రకటన లేకుండానే ముగిసింది. అంతకుముందు చైనాలోని కింగ్దావోలో నిర్వహించిన ఎస్‌ఈవో సమావేశంలో రాజ్‌నాథ్ ప్రసంగిస్తూ పాక్ వైఖరిని పరోక్షంగా దుయ్యబట్టారు. కొన్ని దేశాలు సరిహద్దు ఉగ్రవాదాన్ని విధాన సాధనంగా ఉపయోగించుకుంటూ, ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్నాయని ఆరోపించారు.

టూవీలర్లకు టోల్ చార్జీల యోచన లేదు: గడ్కరీ

న్యూఢిల్లీ, జూన్ 26: దేశంలోని జాతీయ రహదారులపై ద్విచక్ర వాహనాలకు టోల్ టాక్స్ విధించే ప్రతిపాదనేమీలేదని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. టూవీలర్ వాహనాలకు టోల్ మినహాయింపు కొనసాగుతుందన్నారు.

సెప్టెంబరులో ప్రపంచ అయ్యప్ప భక్తులతో సభ

పతనంతిట్ట, జూన్ 26: శబరిమల చరిత్రలోనే తొలిసారి ప్రపంచవ్యాప్తంగా ఉన్న అయ్యప్ప భక్తులతో పంపాబేస్ వద్ద సెప్టెంబరులో సభను ఏర్పాటు చేయనున్నట్లు కేరళ మంత్రి వీఎన్ వాసవన్ ప్రకటించారు. ఓనం వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, రాబోయే మండల, మకరవిళక్కు సీజన్ సందర్భంగా అయ్యప్ప భక్తులకు కావాల్సిన ఏర్పాట్లపై సమీక్షిస్తామన్నారు. గురువారం ఆయన శబరిమలపై ఉన్నతాధికారులతో సమీక్ష తర్వాత మీడియాతో మాట్లాడుతూ సీఎం పినరయి విజయన్‌తోపాటు ప్రముఖులు ఈ సభలో పాల్గొంటారని వివరించారు.


సోషల్ మీడియా ఖాతాలపై అమెరికా డేగ కన్ను!

- గత ఐదేళ్లలో వినియోగించిన ఖాతాల ఐడీల వివరాలివ్వాలి
- లేదంటే వీసా దరఖాస్తు తిరస్కరణ.. అమెరికా ఎంబసీ ప్రకటన

న్యూఢిల్లీ, జూన్ 26: వీసా దరఖాస్తుదారులకు అమెరికా కీలక సూచనలు చేసింది. ఇకనుంచి తమ దేశ వీసాకు దరఖాస్తు చేసే వారందరూ గత ఐదేళ్లలో వినియోగించిన అన్ని సోషల్ మీడియా ఖాతా ల యూజర్ నేమ్‌లు లేదా హ్యాండిల్స్ వివరాలను డీఎస్-160 ఫామ్‌లో వెల్లడించాలని స్పష్టం చేసింది. ఈ నిబంధనను విస్మరిస్తే.. అప్లికేషన్ తిరస్కరణకు గురయ్యే అవకాశంతో పాటు భవిష్యత్తులో వీసా పొందేందుకు అనర్హులవుతారని హెచ్చరించింది. తమ జాతీయ భద్రత దృష్ట్యా ఈ నిర్ణయాలు తీసుకుంటున్నట్లు పేర్కొంది. ఈ మేరకు భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం గురువారం 'ఎక్స్'లో వెల్లడించింది. దరఖాస్తులో సమర్పించిన వివరాలు సరైనవేనని అభ్యర్థులు సంతకం చేసి, సమర్పించేముందు ధ్రువీకరించాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ వివరాలను వీసా స్క్రీనింగ్, సోషల్ మీడియా ఖాతాల పరిశీలనలో ఉపయోగించుకుంటామని తెలిపింది.

శభాష్ జాహ్నవి

- అంతరిక్షానికి వెళ్లనున్న తెలుగమ్మాయికి షెకావత్, పవన్, లోకేశ్ అభినందన





అమరావతి, రాజమహేంద్రవరం రూరల్, పాలకొల్లు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో పుట్టి.. అంతరిక్షంలో అడుగుపెట్టే అద్భుత అవకాశాన్ని దక్కించుకుంది మన తెలుగమ్మాయి దంగేటి జాహ్నవి (23). అమెరికాకు చెందిన ప్రైవేటు అంతరిక్ష పరిశోధన సంస్థ టైటాన్ స్పేస్ ఇండస్ట్రీస్ (టీఎస్‌ఐ) చేపట్టిన టైటాన్ స్పేస్ మిషన్ కోసం వ్యోమగామి అభ్యర్థి (ఏఎస్‌సీఏఎన్)గా ఎంపికైన జాహ్నవిని.. కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్‌తోపాటు ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అభినందించారు. గురువారం రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరులో సైన్స్ సెంటర్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన కేంద్ర మంత్రి గజేంద్రసింగ్, డిప్యూటీ సీఎం పవన్‌కు మంత్రి దుర్గేశ్ జాహ్నవిని పరిచయం చేశారు. నాసా నిర్వహించే ఇంటర్నేషనల్ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న తొలి భారతీయురాలిగా, యువ వ్యోమగామిగా గుర్తింపు పొంది దేశానికి కీర్తి తీసుకొచ్చావని వారు ఆమెను అభినందించారు. త్వరలోనే అమరావతిలోని తన కార్యాలయంలో కలుద్దామని ఈ సందర్భంగా పవన్ ఆమెకు హామీ ఇచ్చారు. కాగా, జాహ్నవి మంత్రి లోకేశ్‌ను కూడా ఆయన నివాసంలో కలిశారని పశ్చిమ గోదావరి జిల్లాలోని ఉల్లంపర్రు మాంటిస్సోరి విద్యా సంస్థల డైరెక్టర్ ఎంఎస్ వాసు తెలిపారు. ఈ సందర్భంగా లోకేశ్ ఆమెను అభినందించారని, భవిష్యత్‌లో ప్రభుత్వపరంగా అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. జాహ్నవి 10వ తరగతి వరకూ ఉల్లంపర్రు మాంటిస్సోరి స్కూల్లో చదివింది.

దోమ సైజులో గూఢచారి డ్రోన్..!

- చేతి గోరు కంటే చిన్నగా తయారీ
- సైనిక అవసరాల కోసం చైనా అద్భుత సృష్టి



న్యూఢిల్లీ, జూన్ 26: ఈ రోజుల్లో డ్రోన్ల వినియోగం బాగా పెరిగిపోయింది. ముఖ్యంగా సైనిక కార్యకలాపాల కోసం అనేక దేశాలు డ్రోన్లను విరివిగా వాడుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో డ్రాగన్ దేశం చైనా సరికొత్త విప్లవానికి తెరతీస్తూ.. దోమ సైజులో ఉండే అతిచిన్న గూఢచారి డ్రోన్‌ను ఆవిష్కరించింది. చైనా నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ డిఫెన్స్ టెక్నాలజీ (ఎన్‌యూడీటీ) అభివృద్ధి చేసిన ఈ సూక్ష్మ డ్రోన్‌ను.. సైనిక కార్యకలాపాలు, రహస్య మిషన్లు, నిఘా అవసరాలకు ఉపయోగించనున్నారు. 0.6 సెంటీమీటర్లతో చిన్న కీటకం సైజులో ఉండే దీన్ని ఇటీవల చైనా అధికారిక మిలటరీ చానెల్ సీసీటీవీ 7లో ప్రదర్శించారు. నల్లటి కర్ర లాంటి శరీరం, ఆకుల ఆకారంలో ఉండే రెక్కలు, తీగల్లాంటి కాళ్లతో ఇది చూడటానికి దోమలా ఉంటుంది. ఇది సూక్ష్మ జీవిలా కనిపించినా.. దీని వెనుక నిఘా, రహస్య ఆపరేషన్ల కోసం అభివృద్ధి చేసిన అత్యాధునిక సైనిక ఇంజనీరింగ్ ఉంది. ఇది పెద్ద సైన్యాన్ని సైతం స్తంభింపచేయగలదు.

రాడార్లు గుర్తించకుండా ఎగరగలదు

రహస్య మిషన్ల కోసం రూపొందించిన ఈ డ్రోన్.. సహజ వాతావరణంలో కలిసిపోతుంది. సంప్రదాయ భద్రతా వ్యవస్థలైన రాడార్లు వీటిని గుర్తించడం కష్టం. చైనా శాస్త్రవేత్తలు దాని బాడీలో కమ్యూనికేషన్ గేర్, సెన్సర్లు, పవర్ యూనిట్లు, కంట్రోల్ ఎలక్ట్రానిక్స్‌ను ఏర్పాటుచేశారు. ఈ డ్రోన్‌ను స్మార్ట్ ఫోన్ ద్వారా నియంత్రించవచ్చు. ఈ సూక్ష్మ డ్రోన్‌పై భద్రతా రంగ నిపుణులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. పాస్‌వర్డ్‌లు, సున్నితమైన డేటా తస్కరణకు నేరస్థులు ఇలాంటి డ్రోన్లను వినియోగించవచ్చని రక్షణ రంగ నిపుణుడు తిమోతి హీత్ ఆందోళన వ్యక్తం చేశారు.

లోకం తీరు



అమ్మో... విమాన ప్రయాణం!

ఎయిర్‌ఇండియా ప్రమాదం తర్వాత ప్రజల్లో పెరిగిన 'ఏవియో ఫోబియా'.. విమానం ఎక్కాలంటేనే గుబులు

- టికెట్ బుక్ చేసుకునే ముందే పూర్తిస్థాయిలో వివరాల ఆరా
- బోయింగ్ డ్రీమ్ లైనర్ పేరు వింటేనే ప్రయాణికుల్లో ఒక రకమైన భయం
- ఎయిర్ ఇండియాపై సన్నగిల్లిన నమ్మకం.. బుకింగ్స్‌పై ప్రభావం
- ఎమర్జెన్సీ డోర్ల వద్ద సీట్లకు డిమాండ్



ఒకప్పుడు విమాన ప్రయాణం అంటే కలల ప్రపంచంలో విహారమే. దానినో హోదాగా, గర్వంగా భావించేవారు. తర్వాత పరిస్థితి మారింది. అహ్మదాబాద్ విమాన ప్రమాదం విమాన ప్రయాణాన్ని ఓ భయంగా మార్చేసింది. ఇలాంటి భయంతో నెలకొనే ఒత్తిడి, గుండెలో గుబులు, అసహనం కలిగే స్థితిని మానసిక నిపుణులు ఏవియో ఫోబియాగా పిలుస్తారు. చాలా మంది ఈ ఫోబియాతో విమాన ప్రయాణాలకు దూరంగా ఉంటారు. గతంలో ప్రయాణికులు ఏ విమానాల్లో ప్రయాణిస్తున్నామనేది పెద్దగా పట్టించుకోలేదని, ఇప్పుడు ఆలోచన విధానం మారిందని ముంబైకి చెందిన ఓ ట్రావెల్ ఏజెన్సీ తెలిపింది. టికెట్ బుక్ చేసుకునే ముందే విమాన రకం, మోడల్, విమానయాన కంపెనీ వంటి అంశాలను పరిశీలిస్తున్నారని పేర్కొంది. బోయింగ్, డ్రీమ్ లైనర్ అనే పేర్లు వినడానికి కూడా ప్రయాణికులు ఇష్టపడటం లేదని వెల్లడించింది.

ప్రయాణికుల్లో భయం

274 మంది ప్రాణాలను బలిగొన్న బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమాన ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో, టీవీ చానెళ్లలో విస్తృతంగా వైరల్ అయ్యాయి. ఇప్పటికే ఏవియో ఫోబియా ఉన్న వారిలో భయాన్ని రెట్టింపు చేయడమే కాదు.. కొత్తగా ఫోబియాకు లోనయ్యే వారి సంఖ్యను కూడా పెంచాయి. భారతీయ ప్రయాణికుల్లో భయాందోళనలకు ఈ ప్రమాద దృశ్యాలు ఒక ముఖ్య కారణమని మానసిక నిపుణులు తెలిపారు. ఈ సంఘటన జరిగిన ఒక్కరోజు తర్వాత భారత్‌లో 'ఫ్లయింగ్ ఫియర్' అనే పదంపై గూగుల్‌లో శోధన పెరిగిందని గూగుల్ ట్రెండ్స్ డేటా చూపిస్తోంది.

ఎయిర్ ఇండియాపై ప్రభావం

అహ్మదాబాద్ ప్రమాదం విమానయాన రంగాన్ని గణనీయంగా ప్రభావం చేసింది. ముఖ్యంగా ఎయిర్‌ఇండియాపై ప్రజల నమ్మకం తగ్గినట్టు స్పష్టంగా తెలుస్తోందని ముంబైలోని మరో ట్రావెల్ ఏజెన్సీ తెలిపింది. చాలా మంది ప్రయాణికులు ఎయిర్ ఇండియాలో ప్రయాణించడానికి భయపడుతున్నారని, ప్రత్యామ్నాయ విమానయాన సంస్థలను కోరుకుంటున్నారని పేర్కొంది. వారి డేటా ప్రకారం 'ఎయిర్ ఇండియా విమానాల బుకింగ్‌లు 15 నుంచి 20 శాతం తగ్గాయి. అదే సమయంలో ప్రయాణాల రద్దు 30 నుంచి 40 శాతం మేర పెరిగాయి' అని తెలిపింది. ఇది ఎయిర్‌ఇండియాకు ఆర్థికంగా, బ్రాండ్ ఇమేజ్‌పరంగా నష్టాన్ని కలిగించిందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఏవియో ఫోబియా ఎలా ఎదుర్కోవాలి ?

మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నివేదిక ప్రకారం.. 2024లో ప్రపంచవ్యాప్తంగా 40.6 కోట్ల విమాన సర్వీసులు విజయవంతంగా గమ్యస్థానాన్ని చేరుకోగా, కేవలం 7 ప్రమాదాలే నమోదయ్యాయి. వాస్తవాలు ఎలా ఉన్నా, ఒక్క ఘోర ఘటన ఏవియో ఫోబియా భయాన్ని పెంచింది. దీనిని ఎదుర్కోవడానికి మానసిక నిపుణులు కొన్ని ముఖ్య సూచనలు చేశారు. సానుకూల ఆలోచనలతో మనస్సును మళ్లించడం, సంగీతం వినడం లాంటివి ఉపశమనం కలిగిస్తాయని చెప్పారు. చిన్న ప్రయాణాలతో ప్రారంభించి క్రమంగా పెద్ద ప్రయాణాల వైపు అడుగులు వేయాలని సూచిస్తున్నారు. కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ ఎక్స్‌పోజర్ థెరపీ(విమాన దృశ్యాలు, సౌండ్స్, ప్రయాణ వీడియోలను చూపిస్తారు), యాంగ్జైటీ మేనేజ్‌మెంట్ మెడికేషన్ ద్వారా ఏవియో ఫోబియాను ఎదుర్కోవచ్చని చెబుతున్నారు.

(సెంట్రల్ డెస్క్)

11ఏ సీటుకు డిమాండ్

ఇంత పెద్ద విమాన ప్రమాదంలో ఒకే ఒక్క వ్యక్తి ప్రాణాలతో బతికి బయటపడ్డాడు. ఇప్పుడు అతను బతకడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అతను కూర్చున్న సీటు నంబరు 11ఏ .అప్పటి నుంచి ఆ సీటు కోసం అభ్యర్థనలు పెరిగాయని భారతీయ ట్రావెల్ ఏజెంట్లు నివేదించారు. కొంత మంది ప్రయాణికులు అదనంగా డబ్బు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నారట. యూకేకు చెందిన రమేష్ ఎమర్జెన్సీ డోర్ పక్కన కూర్చోవడం వల్లే తప్పించుకున్నాడని మెజారిటీ ప్రజలు నమ్ముతున్నారు.

న్యూయార్క్ మేయర్ పోటీలో జోహ్రాన్ మమ్దానీ

- డెమొక్రాట్ పార్టీ అభ్యర్థిగా ఎంపిక

న్యూయార్క్, జూన్ 26: అమెరికాలోని కీలకమైన నగరం న్యూయార్క్ మేయర్ పదవికి భారత సంతతి మూలాలున్న జోహ్రాన్ మమ్దానీ పోటీపడుతున్నారు. డెమోక్రాట్ పార్టీ తరఫున మేయర్ అభ్యర్థిగా ఆయన ఎంపికయ్యారు. 33 ఏళ్ల వయసున్న జోహ్రాన్ తల్లి అమెరికాలో స్థిరపడిన భారతీయురాలు, సినీ నిర్మాత మీరా నాయర్. సలాం బాంబే, మాన్సూన్ వెడ్డింగ్ వంటి సినిమాలతో సంచలనం సృష్టించిన ఆమె పద్మశ్రీ అవార్డు గ్రహీత కూడా. ఆయన తండ్రి మహమూద్ మమ్దానీ గుజరాతీ మూలాలున్న ఉగాండా జాతీయుడు. ఆఫ్రికా ఖండంలో వలస పాలన, రాజకీయ హింసపై ఎన్నో రచనలు చేశారు. ప్రముఖ యూనివర్సిటీల్లో ప్రొఫెసర్‌గా పనిచేశారు. 'గుడ్ ముస్లిం.. బ్యాడ్ ముస్లిం' పుస్తకం రాశారు. జోహ్రాన్ 1991 అక్టోబర్ 18న ఉగాండాలోని కంపాలాలో జన్మించారు. ఆయనకు ఏడేళ్ల వయసున్నపుడు వారి కుటుంబం న్యూయార్క్‌కు వలస వచ్చింది. అక్కడే చదువు పూర్తి చేసిన జోహ్రాన్.. క్రమంగా రాజకీయాల్లో అడుగుపెట్టారు. 2021లో క్వీన్స్ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికయ్యారు. తాజాగా న్యూయార్క్ నగర మేయర్ ఎన్నికలో డెమొక్రాట్ అభ్యర్థిగా ఎంపికయ్యారు. ఆయన గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సర్వేలు తేల్చాయి. ఈ క్రమంలో జోహ్రాన్ మమ్దానీపై అమెరికా అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "జోహ్రాన్ కమ్యూనిస్టు పిచ్చివాడు. ఇంతకుముందు రాడికల్ వామపక్షవాదులను చూశాం. కానీ ఇతను మరీ దారుణంగా ఉన్నాడు. అతడి గొంతు ఘోరంగా ఉంది. అంత తెలివైనవాడు కూడా కాదు" అని విమర్శించారు. డెమోక్రాట్ల తరఫున మేయర్ అభ్యర్థిత్వానికి పోటీపడిన సమయంలో జోహ్రాన్ కూడా ట్రంప్‌పై గట్టిగానే విమర్శలు గుప్పించారు.

ఐఎస్‌ఎస్‌లోకి శుభాన్షు

(మొదటిపేజీ తరువాయి)



అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో వ్యోమగాములు

విజయవంతంగా ఏర్పాటయ్యాయి. దీనికి రెండు గంటల సమయం పట్టింది. గ్రేస్‌లోని వ్యోమగాములు నలుగురు ఐఎస్‌ఎస్‌లోకి వెళ్లారు. తద్వారా ఐఎస్‌ఎస్‌లోకి వెళ్లిన తొలి భారతీయుడిగా శుభాన్షు శుక్లా చరిత్ర సృష్టించారు. శుభాన్షుకు మిషన్ కమాండర్ పెగ్గీ విట్సన్ 634వ బ్యాడ్జి ఇచ్చారు. రోదసిలో ప్రయాణించిన 634వ వ్యోమగామి అని ఈ బ్యాడ్జి అర్థం. 'భారత అంతరిక్ష పరిశోధనల్లో ఇదొక కొత్త అధ్యాయం. మీతో మాట్లాడుతూ ఉంటా. నాతో త్రివర్ణ పతాకం ఉంది. మీ అందరి ప్రేమనూ నేను వెంట తీసుకొచ్చా. రాబోయే 14 రోజులూ శాస్త్ర పరిశోధనల పరంగా చాలా ఆసక్తికరంగా ఉండనున్నాయి' అని శుభాన్షు పేర్కొన్నారు. అమెరికాకు చెందిన స్పేస్ ఎక్స్ అనే ప్రైవేటు సంస్థ చేపట్టిన ఈ ప్రయోగానికి శుభాన్షు.. మిషన్ పైలట్‌గా వ్యవహరిస్తున్నారు. సీనియర్ వ్యోమగామి పెగ్గీ విట్సన్ మిషన్ కమాండర్‌గా ఉన్నారు. కాగా, ఐఎస్‌ఎస్‌లో ఇప్పటికే ఏడుగురు వ్యోమగాములున్నారు. తాజాగా, వారికి మరో నలుగురు అదనంగా చేరారు.

ఒక శిశువులా నేర్చుకుంటున్నా: శుభాన్షు శుక్లా

భూమ్మీద నుంచి ఐఎస్‌ఎస్‌కు వెళ్తున్న క్రమంలో గ్రేస్ వ్యోమనౌకలో ఉన్న వీడియో లింక్ ద్వారా శుభాన్షు శుక్లా మాట్లాడుతూ, గురుత్వాకర్షణ శక్తి లేని పరిస్థితుల్లో జీవించటం నేర్చుకుంటున్నానని, ఇదంతా ఒక శిశువులా అనిపిస్తోందన్నారు. అందరికీ హలో.. నమస్కారం అంటూ శుభాన్షు తన మాటలు ప్రారంభించారు. ప్రయోగానికి ముందు 30 రోజుల పాటు క్వారంటైన్‌లో ఉన్న సంగతిని ప్రస్తావిస్తూ.. 'లాంచ్‌ప్యాడ్ మీద గ్రేస్‌లో కూర్చోగానే ఎప్పుడెప్పుడు బయల్దేరుదామా అనే భావనే నా మనసు నిండా ఆవరించింది. ప్రయాణం ప్రారంభమవగానే సీటులో నెట్టివేయబడినట్టు అనిపించింది. అంతా నిశ్శబ్దం. శూన్యంలో తేలుతూ ఉన్నాం. తొలుత ఏమీ ప్రత్యేకంగా అనిపించలేదు. కానీ, కొంతసేపటి తర్వాత మాత్రం అద్భుతంగా అనిపించసాగింది' అని తెలిపారు. 'ఈ కొత్త అనుభవానికి అలవాటు పడటం మొదలైంది.. కొత్తగా అడుగులు వేయటం, నడవటం, తినటం, చదవటం, నన్ను నేను నియంత్రించుకోవటం వంటివన్నీ ఒక శిశువులా నేర్చుకోవటం ఎంతో సంతోషాన్నిచ్చాయి. ఇదంతా కొత్త వాతావరణం, కొత్త సవాల్. నా సహచర వ్యోమగాములతో కలిసి నేర్చుకుంటున్నా. పొరపాట్లు చేయటం మంచిదే.. కానీ, వాటిని ఇతరులు చేస్తుంటే చూడటం వినోదాన్ని ఇస్తుంది' అంటూ ప్రయాణంలో విశేషాల్ని, సరదాల్ని శుభాన్షు శుక్లా వివరించారు.

ఇది సమష్టి విజయం

ఈ ప్రయాణం తన వ్యక్తిగత ఘనత కాదని, దీంట్లో భాగస్వాములైన వారందరి సమష్టి విజయమని, వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానని శుభాన్షు వినమ్రంగా పేర్కొన్నారు. తన కుటుంబసభ్యులు, స్నేహితుల సహకారం కూడా గొప్పదని, వారు లేకుంటే తాను ఇక్కడి దాకా వచ్చేవాడినే కాదన్నారు. గురుత్వాకర్షణ రాహిత్య స్థితిని తెలుసుకోవటం కోసం (జీరో జీ ఇండికేటర్) తమతోపాటు తీసుకొచ్చిన హంస బొమ్మను ప్రస్తావిస్తూ.. 'భారతీయ సంస్కృతిలో హంసకు గొప్ప ప్రాధాన్యం ఉందని, జ్ఞానానికి ప్రతీకగా భావిస్తారని గుర్తు చేశారు. అవసరమైన దానిపైనే దృష్టి పెట్టి, అనవసరమైన వాటిని వదిలిపెట్టటం హంస లక్షణమని, ప్రస్తుత చంచల ప్రపంచంలో ఇది చాలా ముఖ్యమైనదన్నారు. ప్రయాణంలో తాను చాలాసేపు ప్రశాంతంగా పడుకున్నానని తన సహచరులు చెప్పినట్లు శుక్లా వెల్లడించారు. ఐఎస్‌ఎస్‌లో శుక్లా బృందం 14 రోజులపాటు ఉండనుంది. సైన్స్‌కు సంబంధించిన పలు ప్రయోగాలను ఈ బృందం చేయనుంది.

ట్రంప్ ఆణిముత్యాలు

- వరుసగా విభిన్న వ్యాఖ్యలు చేసిన అమెరికా అధ్యక్షుడు



న్యూఢిల్లీ, జూన్ 26: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాచాలత్వమే వేరు. ఎవరు కాదన్నా, ఎవరు అవునన్నా ఆయన చెప్పాలనుకున్నది చెబుతారు. కాదని ఖండించినా చెబుతూనే ఉంటారు. వివిధ దేశాల ప్రధాన మంత్రులు, అధ్యక్షుల స్థాయి వాళ్లపై అప్పుడే ప్రశంసలు కురిపిస్తుంటారు, ఉన్నట్టుండి వ్యతిరేక వ్యాఖ్యలూ చేస్తుంటారు. అలా బుధవారం (అమెరికా కాలమానం ప్రకారం) ఒక్కరోజులోనే ట్రంప్ చేసిన కొన్ని వ్యాఖ్యలివి..

ఇరాన్ క్షిపణులు అద్భుతం!

"ఇజ్రాయెల్‌కు చాలా గట్టి దెబ్బ తగిలింది. ముఖ్యంగా చివరి రెండు రోజుల్లో దెబ్బతిన్నది. ఆ (ఇరాన్) బాలిస్టిక్ క్షిపణులు చాలా భవనాలను ధ్వంసం చేశాయి. అవి అద్భుతంగా పనిచేశాయి".. ఇరాన్ దాడుల్లో ఇజ్రాయెల్‌కు నష్టం ఎక్కువే జరిగిందంటూ..

అవినీతిపై విచారణ వద్దు

"ఇరాన్‌ను అణచివేసి ఇజ్రాయెల్ చరిత్రలోనే గొప్ప ఘట్టానికి నేతృత్వం వహించిన ప్రధాని నెతన్యాహును అవినీతి ఆరోపణలపై విచారించడం దారుణం. ఈ విషయం నన్ను షాక్‌కు గురిచేసింది. దేశానికి ఎంతో చేసిన గొప్ప హీరో అయిన ఆయనపై వెంటనే అవినీతి విచారణను నిలిపివేయాలి. లేదా క్షమాభిక్ష పెట్టాలి.." ఈ నెల 30న నెతన్యాహు అవినీతి కేసులపై విచారణ జరగనున్న నేపథ్యంలో..

భారత్-పాక్ యుద్ధంపై పాత పాట..

"భారత్, పాక్‌లతో మాట్లాడాను. చూడండి మీరు ఇలా యుద్ధం చేసుకుంటుంటే పరిస్థితి చెడుగా మారుతుందని, అలాగైతే అమెరికా ఎలాంటి వాణిజ్యం చేయబోదని చెప్పాను. దాంతో లేదు లేదు.. మాకు వాణిజ్య ఒప్పందం కావాలని వాళ్లు చెప్పారు. మేం అణు యుద్ధాన్ని నివారించాం".. భారత్-పాక్ యుద్ధాన్ని తానే ఆపానంటూ..

ముస్లిం డెమోక్రాట్‌పై వాచాలత్వం..

"అనుకున్నంతా అయింది. డెమోక్రాట్లు గీత దాటారు. జోహ్రాన్ మమ్దానీ ఓ కమ్యూనిస్టు పిచ్చివాడు. న్యూయార్క్ నగర మేయర్ అయ్యే దిశగా వెళుతున్నాడు. ఇంతకుముందు రాడికల్ వామపక్షవాదులను చూశాం. కానీ ఇతను మరీ దారుణంగా ఉన్నాడు. అతడి గొంతు ఘోరంగా ఉంది. అంత తెలివైనవాడిలా కూడా కనిపించడం లేదు".. న్యూయార్క్ మేయర్ పదవి కోసం డెమోక్రాట్ల ప్రైమరీలు గెలిచిన నాయకుడిని తూలనాడుతూ.. (జోహ్రాన్ మమ్దానీ తల్లి మన కేరళకు చెందిన నాయర్, తండ్రి ఉగాండా ముస్లిం)

పుతిన్ చెబితే వినే రకం కాదు..


"రష్యా, ఉక్రెయిన్ యుద్ధం మిగతా వాటిలా కాదు. చాలా క్లిష్టమైనది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చెబితే వినే రకం కాదు. ఆయనను తప్పుదోవ పట్టించారు. ఈ యుద్ధం ఆయనకు తలనొప్పిగా మారింది. దీన్నుంచి బయటపడాలని అనుకుంటున్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతోనూ నాకు సమస్యలు ఉన్నాయి".. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని కూడా ఆపుతారా అన్న మీడియా ప్రశ్నకు సమాధానంగా..

మొస్సాద్ ఏజెంట్లు చూసివచ్చారు..

"ఇరాన్ ఫర్డో అణుశుద్ధి కేంద్రం పూర్తిగా ధ్వంసమైంది. అమెరికా బాంబులు వేసిన తర్వాత ఇజ్రాయెల్ మొస్సాద్ ఏజెంట్లు అక్కడికి వెళ్లి పరిశీలించారు. మొత్తం తుడిచిపెట్టుకుపోయిందని వారు చెప్పారు".. ఇరాన్ అణుశుద్ధి కేంద్రాలు పూర్తిగా ధ్వంసం కాలేదన్న నిఘా వర్గాల వార్తలను తప్పుపడుతూ...

అమెరికాపై మాదే విజయం

- మా దాడులు అమెరికాకు చెంపదెబ్బల్లాంటివి
- ఇరాన్ సుప్రీంలీడర్ అయతుల్లా ఖమేనీ వెల్లడి



అయతుల్లా ఖమేనీ

టెహ్రాన్/వాషింగ్టన్/న్యూఢిల్లీ, జూన్ 26: అమెరికాపై తాము విజయం సాధించామని ఇరాన్ సుప్రీంలీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అన్నారు. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరాక ఆయన తొలిసారి ఈ యుద్ధంపై స్పందించారు. 10 నిమిషాల నిడివిగల వీడియోను విడుదల చేశారు. దాన్ని ఇరాన్ అధికారిక వార్తా చానల్ ప్రసారం చేసింది. ఆ వీడియోలో ఖమేనీ పలుమార్లు అమెరికా, ఇజ్రాయెల్‌ను హెచ్చరించారు. "12 రోజుల యుద్ధంలో ఇజ్రాయెల్‌పై మేమే విజయం సాధించాం. పశ్చిమాసియాలో అమెరికా కు చెందిన అతిపెద్ద బేస్‌పై దాడులు చేశాం. ఇవి అమెరికాకు చెంపదెబ్బ లాంటివే..! మరోమారు అమెరికా దుస్సాహసం చేస్తే.. మా క్షిపణులు అమెరికాను తాకుతాయనే సంకేతాన్నిచ్చాం" అని వ్యాఖ్యానించారు.

ఇరాన్‌కు తీవ్ర నష్టం: సీఐఏ

అమెరికా దాడులతో ఇరాన్ అణు కేంద్రాలకు తీవ్రంగా పరిగణించగలిగే స్థాయిలో నష్టం వాటిల్లిందని అగ్రరాజ్య కేంద్ర దర్యాప్తు సంస్థ(సీఐఏ) డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ వెల్లడించారు. కాగా.. ఇరాన్ అణు కార్యక్రమం పూర్తిస్థాయిలో దెబ్బతిన్నదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పునరుద్ఘాటించారు. నాటో సదస్సులో ఆయన మాట్లాడుతూ.. "మా దాడులు పూర్తవ్వగానే.. మొస్సాద్ ఏజెంట్లు అణు కేంద్రాల వద్ద పరిశీలించారు. ఆయా కేంద్రాలు పూర్తిగా ధ్వంసమైనట్లు నిర్ధారించారు" అని చెప్పారు. కాగా, పన్నెండు రోజుల పాటు జరిగిన యుద్ధంలో ఇరాన్‌లో 1,054 మంది మరణించారని, 4,476 మంది క్షతగాత్రులయ్యారని మానవ హక్కుల సంఘాలు పేర్కొన్నాయి. అయితే.. ఇరాన్ ప్రభుత్వం మాత్రం 606 మంది మృతిచెందారని, 5,332 మంది క్షతగాత్రులయ్యారని ప్రకటించింది.



హార్సిలీహిల్స్‌లో పర్యటిస్తున్న బాబా రాందేవ్

హార్సిలీ హిల్స్‌లో అంతర్జాతీయ వెల్‌నెస్ సెంటర్ నిర్మిస్తాం

- విజయనగరం, అల్లూరి జిల్లాల్లో పతంజలి పెట్టుబడులు
- చంద్రబాబు మంచి పరిపాలనాదక్షుడు: రాందేవ్ బాబా

బి.కొత్తకోట/కొత్తవలస/అరకులోయ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్‌లో అంతర్జాతీయ స్థాయి వైజ్ఞానిక, సాంస్కృతిక (స్పిరిచువల్ అండ్ కల్చరల్) వెల్‌నెస్ సెంటర్ నిర్మిస్తామని పతంజలి వ్యవస్థాపకులు, ప్రఖ్యాత యోగా గురువు బాబా రాందేవ్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు లోయ, విజయనగరం జిల్లా కొత్తవలస మండలం చినరావుపల్లి గ్రామంలో పతంజలి సంస్థద్వారా వివిధ రకాల కంపెనీలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. గురువారం తన బృందంతో కలిసి ఆయన హార్సిలీహిల్స్, అరకులోయ, చినరావుపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా బాబా రాందేవ్ మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజనరీ లీడర్ అని కొనియాడారు. రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయి యోగా వెల్‌నెస్‌సెంటర్లను స్థాపించాలన్న ఆయన పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్‌లో వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుకు అనువైన హిల్‌స్టేషన్ల పరిశీలన నిమిత్తం వచ్చామని తెలిపారు. అదే విధంగా అరకు లాంటి కాలుష్య రహిత ప్రాంతంలో పతంజలి ద్వారా హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు అందుబాటులోకి తేవాలన్న ఆలోచన ఉందన్నారు. చినరావుపల్లి గ్రామంలో పతంజలి సంస్థకు కేటాయించిన 172 ఎకరాల భూములను ఆయన పరిశీలించారు.



క్యూఆర్ కోడ్‌తో రేషన్ అక్రమాలకు చెక్!

- ప్రతి దుకాణం వద్ద క్యూఆర్ కోడ్ పోస్టర్లు
- ఏమైనా అవకతవకలుంటే.. మొబైల్‌తో స్కాన్ చేసి క్షణాల్లో ఫిర్యాదు చేయవచ్చు
- సరుకుల నాణ్యతపై అభిప్రాయాలు చెప్పొచ్చు
- పరిష్కారం చూపనున్న అధికారులు

అమరావతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పౌరసరఫరాల శాఖలో సంస్కరణలకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం.. రేషన్ సరుకుల పంపిణీలో అవకతవకలపై సులువుగా ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. గత నెలలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 వేల రేషన్ షాపుల ద్వారా కార్డుదారులకు నిత్యావసర సరుకుల పంపిణీని పునఃప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రజా పంపిణీ వ్యవస్థను క్షేత్రస్థాయిలో మరింత పటిష్ఠం చేసేలా, సరుకుల పంపిణీ సక్రమంగా జరిగేలా ప్రతి రేషన్ షాపు వద్ద క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఏర్పాటు చేసింది. దీని ద్వారా సరుకుల పంపిణీపై కార్డుదారులకు ఏమైనా అభ్యంతరాలుంటే ఫిర్యాదు చేసేందుకు అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. షాపు వద్ద ఉన్న ఆ క్యూఆర్ కోడ్‌ను తమ మొబైల్ ఫోన్‌తో స్కాన్ చేసి క్షణాల్లోనే ఫిర్యాదు చేయవచ్చు. కోడ్‌ను స్కాన్ చేయగానే.. ఈ నెల రేషన్ సరుకులు తీసుకున్నారా? సరుకుల నాణ్యతపై సంతృప్తిగా ఉన్నారా? రేషన్ డీలరు సరైన తూకంతోనే సరుకులు ఇచ్చారా? అధిక ధరలు వసూలు చేశారా? డీలరు మీతో మర్యాదగానే వ్యవహరించారా? వంటి ప్రశ్నలతో వెబ్‌ఫారమ్ ఓపెన్ అవుతుంది. అందులోని ప్రశ్నలకు అవును లేదా కాదు అని సమాధానాలు ఇస్తే చాలు.. కార్డుదారుల ఫిర్యాదులు లేదా అభిప్రాయాలు నేరుగా సంబంధిత ఉన్నతాధికారులకు చేరతాయి. తద్వారా వారు ఆ ఫిర్యాదులు పరిష్కరిస్తారు.



'పౌర' సేవల మెరుగు కోసమే: నాదెండ్ల

"ప్రజల భాగస్వామ్యంతో 'పౌర' సేవల్ని మరింత మెరుగుపరిచే లక్ష్యంతో ఈ విధానాన్ని అమలు చేస్తున్నాం. గత ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా 'ఇంటింటికీ రేషన్' పేరుతో పంపిణీ చేసిన దానికన్నా.. గత నెలలో రేషన్ షాపుల ద్వారా సరుకుల పంపిణీని పునఃప్రారంభించిన తర్వాత మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు 5 రోజుల ముందుగానే వారి ఇంటికెళ్లి సరుకులు అందించే విధానం ప్రారంభమైంది. మిగిలిన కార్డుదారులకు రేషన్ సరుకుల పంపిణీ జూలై 1 నుంచి 15 వరకు కొనసాగుతుంది. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ఎప్పుడైనా సరుకులు తీసుకోవచ్చు. అక్రమాలకు తావు లేకుండా ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకే ప్రతి రేషన్ షాపు దగ్గర క్యూఆర్ కోడ్‌తో కూడిన పోస్టర్లు ఏర్పాటు చేయించాం. కార్డుదారులు తమ అభిప్రాయాలు, ఫిర్యాదులు, స్పందన తెలియజేస్తూ ఈ వ్యవస్థలో భాగస్వాములవ్వాలి" అని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు.

పొగాకు ఉత్పత్తి లక్ష్యం కుదింపు

- 2025-26 పంటకాలానికి 142 మిలియన్ కేజీలు నిర్ధారణ

గుంటూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పొగాకు ఉత్పత్తి లక్ష్యాన్ని టొబాకో బోర్డు కుదించింది. 2025-26 పంటకాలానికి 142 మిలియన్ కేజీల ఉత్పత్తిని నిర్ధారించింది. గురువారం గుంటూరులోని పొగాకు బోర్డు కార్యాలయంలో జరిగిన 165వ సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు చర్చించి ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. టొబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఈడీ బీ విశ్వశ్రీ, బెంగళూరు ఆక్షన్స్ డైరెక్టర్ శ్రీనివాస్, వైస్‌చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య, బోర్డు సభ్యులు జీసీ విక్రమ్‌రాజ్, గుత్తా వాసుబాబు హాజరయ్యారు. ప్రధానంగా ప్రస్తుత సంవత్సరంలో పొగాకు రైతుకు తలెత్తిన నష్టాలు, విదేశాల నుంచి వ స్తున్న ఎగుమతి ఆర్డర్లు గురించి చర్చించామని చైర్మన్ యశ్వంత్‌కుమార్ తెలిపారు.

'విద్యాహక్కు'కు తూట్లు!

- 1,682 ఆర్టీఈ సీట్లు తిరస్కరణ
- ప్రైవేటు పాఠశాలలకు నోటీసులు
- విద్యార్థులకు రెండో విడతలో సీట్లు
- అడ్మిషన్లు తిరస్కరిస్తే గుర్తింపు రద్దు
- స్కూళ్లకు సమగ్రశిక్ష ఎస్పీడీ హెచ్చరిక

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టాన్ని కొన్ని ప్రైవేటు పాఠశాలలు అపహాస్యం చేస్తున్నాయి. పేద విద్యార్థులకు సీట్లు ఎందుకివ్వాలని అడ్డం తిరుగుతున్నాయి. విద్యాహక్కు చట్టం కింద ఇటీవల పాఠశాల విద్యాశాఖ తొలి విడతలో 23,118 మందికి ఒకటో తరగతిలో సీట్లు కేటాయించింది. నిబంధనల ప్రకారం సీటు పొంది, ధ్రువీకరణ పత్రాలు సమర్పించినా 1,682 మంది అడ్మిషన్లను కొన్ని పాఠశాలలు ఉద్దేశపూర్వకంగా తిరస్కరించాయి. దీనిపై పాఠశాల విద్యాశాఖ సీరియస్ అయింది. విద్యాహక్కు చట్టం సీట్లను తిరస్కరించిన పాఠశాలలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. సీట్లు ఎందుకు తిరస్కరించారో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఇకపై సీట్లు తిరస్కరిస్తే ఆ పాఠశాలల గుర్తింపు రద్దుచేస్తామని సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు హెచ్చరించారు. చట్టప్రకారం సీట్లు కేటాయిస్తే తిరస్కరించడంపై కఠిన చర్యలు తీసుకోవాలని తాజాగా పాఠశాల విద్య జిల్లాల అధికారులను ఆదేశించారు. అనకాపల్లిలో 45 మంది, తూర్పుగోదావరిలో 38, కాకినాడలో 730, కర్నూలులో 769, నంద్యాలలో ఒకరు, ఎన్టీఆర్‌లో ఐదుగురు, శ్రీసత్యసాయిలో ఇద్దరు, తిరుపతిలో ఐదుగురు, విశాఖపట్నంలో ఏడుగురు, విజయనగరంలో ఇద్దరు, పశ్చిమగోదావరిలో 78 మంది విద్యార్థుల అడ్మిషన్లను పాఠశాలలు తిరస్కరించాయి. వీటిపై కఠిన చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ భావిస్తోంది.

చట్టమంటే లెక్కలేదా?

2011లో అమల్లోకి వచ్చిన విద్యాహక్కు చట్టం ప్రకారం అన్ని ప్రైవేటు పాఠశాలలు 25శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించాలి. ఆ ఫీజులను ప్రభుత్వం చెల్లిస్తుంది. అయితే ప్రైవేటు బడులు అడిగినంత కాకుండా ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులనే చెల్లిస్తారు. రాష్ట్రంలో గత మూడేళ్ల నుంచి ఈ చట్టం సీట్ల కేటాయింపు అమల్లోకి వచ్చింది. అప్పటినుంచీ ప్రైవేటు పాఠశాలలు ఈ కోటాలో సీట్లు కేటాయించకుండా తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. చిన్న, మధ్య తరహా బడులు సక్రమంగానే అడ్మిషన్లు ఇస్తున్నా, భారీగా ఫీజులు వసూలు చేసే కొన్ని పాఠశాలలకు ఈ విధానం మింగుడు పడటం లేదు. రెండు ప్రధానమైన కార్పొరేట్ మేనేజ్‌మెంట్లతో ఎక్కువగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని డీఈవోలు చెబుతున్నారు.

ఖరారు కాని ఫీజులు

విద్యాహక్కు చట్టం ఫీజులను గత వైసీపీ ప్రభుత్వం చాలా తక్కువగా నిర్ణయించింది. కూటమి ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక సదుపాయాల ఆధారంగా రేటింగ్ ఇచ్చి గరిష్ఠంగా రూ.13వేలు ఫీజు ఇవ్వాలని ప్రతిపాదించింది. కానీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అందుకు అంగీకరించడం లేదు. రూ.20 వేలకు పైగా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి. దీంతో ఫీజులు ఎంత అనేది ఇంకా ఖరారు కాలేదు.

రెండో విడతలో 8,583 మందికి సీట్లు

ఈ సంవత్సరం ఆర్టీఈ సీట్ల కోసం 37,427 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 29,481 మందిని అర్హులుగా గుర్తించారు. మొదటి విడత లాటరీలో 23,811 మందికి సీట్లు కేటాయించారు. వారిలో 15,541 మంది ఆయా పాఠశాలల్లో అడ్మిషన్లు పొందారు. 161 మంది సహేతుకమైన కారణాలతో అడ్మిషన్లు పొందలేకపోయారు. కొందరు తల్లిదండ్రులు సీటు వచ్చినా తమ పిల్లల్ని చేర్చలేదు. ఇక పాఠశాలలు తిరస్కరించడంతో 1,682 మంది సీట్లు పొందలేకపోయారు. వారందరికీ రెండో విడతలో సీట్లు కేటాయించారు. వీరితో కలిపి రెండో విడత లాటరీలో 8,583 మందికి సీట్లు లభించాయి. వారిలో ఇప్పటివరకూ 7.33 శాతం మంది సీట్లు పొందారు.

రోబోటిక్స్‌లో సత్తా చాటిన ఆదిత్య 'లక్ష్య' విద్యార్థులు



సాధించిన పతకాలతో లక్ష్య విద్యార్థులు

కాకినాడ రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రోబోరోర్జ్ మలేషియా 2025 వెఫా రోబోటిక్ పోటీల్లో కాకినాడ జిల్లాకు చెందిన లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ 8, 9, 10 తరగతుల విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచారు. ఈ పోటీలను ఈ ఏడాది ఆసియా పసిఫిక్ విశ్వవిద్యాలయంలో నిర్వహించగా ప్రాథమిక, మాధ్యమిక, సీనియర్ విభాగాల్లో సెకండరీలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన ఏకైక జట్టు లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ జట్టు అని డైరెక్టర్ డాక్టర్ ఎస్.సుగుణారెడ్డి తెలిపారు. సెకండరీలో మొత్తం 15 జట్లు పాల్గొన్నాయి. 8 జట్లు పోటీలకు ఎంపిక కాగా వాటిలో లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ నుంచి రెండు జట్లు ప్రాతినిధ్యం వహించాయి. స్మోర్ఫీ ఇమాజినరీ, స్మోర్ఫీ పైలట్, స్మోర్ఫీ స్క్వేర్ అటానమస్ వంటి మూడు సవాళ్లలో జట్లు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాయి. స్మోర్ఫీ ఇమాజినరీలో టీమ్ లక్ష్య-1 ప్రథమ, టీమ్ లక్ష్య-2 తృతీయ స్థానంలో నిలిచాయి. స్మోర్ఫీ పైలట్‌లో టీమ్ లక్ష్య-2 రజతం, టీమ్ లక్ష్య-1 కాంస్య పతకం పొందాయి. స్మోర్ఫీ స్క్వేర్ అటానమస్‌లో టీమ్ లక్ష్య-2 స్వర్ణం, టీమ్ లక్ష్య-1 రజతం సాధించి మొత్తం ఈవెంట్లో ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నాయి. లక్ష్య-1 జట్టులోని విద్యార్థులు రిహాన్‌సనా, లలిత్‌కుమార్‌వర్మ, జి.సాజిత్, ఎ.ఆనంద్, ఎ.వినీత్, లక్ష్య జట్టు-2 జట్టులోని విద్యార్థులు డి.మనోహరరెడ్డి, దుర్గాఆదిత్యశశాంక్, ముకుంద, నాగసాయిఅభినవ్, ఎస్.అర్జున్‌ను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ సుగుణారెడ్డి అభినందించారు.

ఏపీయూడబ్ల్యూజే నూతన కార్యవర్గం

- అధ్యక్షునిగా ఐ.వి.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా జయరాజ్

ఒంగోలు కల్చరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(ఏపీయూడబ్ల్యూజే) నూతన రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక గురువారం సాయంత్రం జరిగింది. ఒంగోలులో జరుగుతున్న యూనియన్ మహాసభల ముగింపు సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షునిగా ఐ.వి.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా అమరావతికి చెందిన కంచల జయరాజ్‌ను ఎన్నుకున్నారు. అదే విధంగా నలుగురు ఉపాధ్యక్షులు కె.స్వాతిప్రసాద్ (కాకినాడ జిల్లా), కె.మాణిక్యరావు (ఏలూరు జిల్లా), చావా రవి (కృష్ణా అర్బన్), జి.కొండప్ప (కర్నూ లు జిల్లా)ను ఎన్నుకున్నారు. కోశాధికారిగా నెల్లూరు జిల్లాకు చెందిన వల్లూరు వెంకటేశ్వర్లు, కార్యదర్శులుగా సీహెచ్‌బీఎల్. స్వామి (అనకాపల్లి), విద్యాధరణి మురళి(పల్నాడు), ఏ.సురేష్ (ప్రకాశం), ఎంపీఆర్ రాజు (తిరుపతి)లను ఎన్నుకున్నారు. అదే విధంగా పలు జిల్లాల నుంచి 15 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.



టీటీడీ చైర్మన్‌కు చెక్ అందజేస్తున్న తోట చంద్రశేఖర్

టీటీడీకి గూగుల్ వైస్ ప్రెసిడెంట్ రూ.కోటి విరాళం

తిరుమల, జూన్ 26(ఆంధ్రజ్యోతి): గూగుల్ వైస్ ప్రెసిడెంట్ తోట చంద్రశేఖర్ టీటీడీకి రూ.కోటి విరాళంగా అందజేశారు. గురువారం తిరుమలలో టీటీడీ ధర్మకర్తల మండలి చైర్మన్ బీఆర్ నాయుడుకు విరాళం చెక్‌ను అందజేసి ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు వినియోగించాలని కోరారు. టీటీడీలోని పలు విభాగాల్లో ఐటీ సేవలను ఎలా మెరుగుపరచాలి, ఏఐ ద్వారా మరింత త్వరగా దర్శనం కల్పించడం ఎలా అనే అంశాలపై చంద్రశేఖర్‌తో, టీటీడీ చైర్మన్ చర్చించారు.

దక్షిణ మధ్య రైల్వే

మమ్మల్ని @ SCRailwayIndia అనుసరించండి
ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడగలరు

బహిరంగ ఇ-టెండరు ప్రకటన

భారత రాష్ట్రపతి తరఫున దిగువ సంతకందారు దిగువ తెలిపిన పని కొరకు 21.07.2025న 15.30 గం. వరకు ఇ-టెండర్లు కోరుచున్నారు.

1. టెండరు ప్రకటన నం. & తేది: SCR-BZA-SNT-E05-OT-25-26, తేది: 26.06.2025 పని పేరు: విజయవాడ డివిజన్ సిగ్నల్ మరియు టెలికం శాఖ: SCR, BZA డివిజన్‌లోని విజయవాడ టెస్ట్ రూమ్‌లో డాటా లాగర్ సర్వీసుల అప్‌గ్రేడేషన్‌కు సంబంధించి S&T పనులు మరియు విజయవాడ డివిజన్‌లోని SSE/ సిగ్నల్ ఆఫీసులకు నెట్‌వర్కింగ్ సదుపాయాలు మరియు ఫర్నిచర్ ఏర్పాటు. టెండరు విలువ: రూ.3,97,66,935.42 బయానా: రూ.3,48,800.00 ఆన్‌లైన్ లేదా బిడ్ సెక్యూరిటీ ద్వారా మాత్రమే CTB: రూ. లేదు పూర్తిచేయు కాలం: 180 రోజులు
2. టెండరు ప్రకటన నం. & తేది: SCR-BZA-SNT-E06-OT-25-26, తేది: 26.06.2025 పని పేరు: విజయవాడ డివిజన్ సిగ్నల్ మరియు టెలికం శాఖ: విజయవాడ డివిజన్‌లో డాటాలాగర్ సిస్టంపై సేఫ్టీ పాయింట్ అలారం/ పాయింట్ రివర్సల్ అలారం సిస్టం ఏర్పాటుకు సంబంధించి S&T పనులు. టెండరు విలువ: రూ.23,51,740.00 బయానా: రూ.47,000.00 ఆన్‌లైన్ లేదా బిడ్ సెక్యూరిటీ ద్వారా మాత్రమే CTB: రూ. లేదు పూర్తిచేయు కాలం: 180 రోజులు

ముగింపు తేది మరియు సమయం: సమయం: 15.30 గం. తేది: 21.07.2025

ఏదేని టెండరు కొరకు ఏవేని మార్పులు/ సవరణలను గమనించడానికి టెండరు ముగింపు తేదీకి ముందు www.ireps.gov.in వెబ్‌సైట్‌ను దర్శించాలని కాబోవు టెండరుదారులకు సూచించడమైనది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (S&T), విజయవాడ

బహిరంగ టెండరు ప్రకటన నం.B-E29-TRD-TNDR-13-2025-26 తేది: 25.06.2025

దిగువ తెలిపిన పనుల కొరకు దిగువ సంతకందారుచే IREPSలో టెండర్లు కోరబడుచున్నవి.

1. టెండరు నం: B/E29-TRD-TNDR-13-2025-26 పని పేరు: BZA డివిజన్‌లో OHE/PSI ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కొరకు రిలయబిలిటీ ఇంప్రూవ్‌మెంట్. సుమారు విలువ: రూ.2,13,50,929.40 పూర్తిచేయు కాలం: 12 నెలలు బిడ్ సెక్యూరిటీ (EMD): రూ.2,56,800 ముగింపు తేది: 18.07.2025న 15.00 గం.
1. టెండరు ఫారం ధర: (రూ.) లేదు

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ TRD/ విజయవాడ

బహిరంగ టెండరు ప్రకటన నం.B-E29-TRD-TNDR-14-2025-26 తేది: 25.06.2025

దిగువ తెలిపిన పనుల కొరకు దిగువ సంతకందారుచే IREPSలో టెండర్లు కోరబడుచున్నవి.

1. టెండరు నం: B/E29-TRD-TNDR-14-2025-26 పని పేరు: TrD/ BZA డివిజన్‌లోని OHE మాస్టులు / స్ట్రక్చర్లు / పోర్టల్స్‌పై వానరాలు ఎక్కడం నిలురించేందుకు మంకీ ప్రోన్ ఏరియాలలో యాంటీ మంకీ క్లైంబింగ్ డివైస్‌లు ఏర్పాటు. సుమారు విలువ: రూ.1,02,70,250.00 పూర్తిచేయు కాలం: 09 నెలలు బిడ్ సెక్యూరిటీ (EMD): రూ.2,01,400 ముగింపు తేది: 22.07.2025న 15.00 గం.
1. టెండరు ఫారం ధర: (రూ.) లేదు

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ TRD/ విజయవాడ

A0954

తదుపరి టెండరు నిబంధనలు/ వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు దర్శించండి వెబ్‌సైట్: https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in

---

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ
టెండరు ప్రకటన

No.4684/B5/2025 టెండరు ఐడి నం: 824682

విజయవాడ కొరకు నగర వ్యాప్తంగా అడ్వాన్స్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ఎనలిటిక్ సొల్యూషన్ ఏర్పాటు చేయడానికి టెండర్లు కోరబడుచున్నవి. వివరాలు https://tender.apeprocurement.gov.in మరియు vijayawadapolice.ap.gov.in నుండి 27.06.2025 మ.3 గం. నుండి 11.07.2025 మ.12 గం. వరకు లభిస్తాయి. ప్రీ-బిడ్ మీటింగ్ 01.07.2025న ఉ. 11 గం.కు ఈ కార్యాలయంలో జరుగుతుంది. సంప్రదించు నం: 9440796487

సం/- పోలీస్ కమిషనర్, NTR పోలీస్ కమిషనరేట్, విజయవాడ
DIPR RO No.16835/CL/ADVT/1/1/2021-22, తేది: 26.06.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు నోటీసు

నెం. 194 to 197/TO/O&M & JJM/2025-26 తేది:25.06.2025

గ్రా.నీ.స. & పా. సర్కిల్ ఏలూరు పరిధిలో JJM నిధుల నుండి మంజూరైన 4 పనులకు అంచనా విలువ: రూ.370.33 లక్షలతో చేపట్టుటకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండర్లు స్వీకరణ తేది: (నిట్ నెం.194 నుండి 196) 27.06.2025 నుండి (నిట్ నెం.197) 01.07.2025 నుండి. ఇతర వివరాలను www.tender.apeprocurement.gov.in లో పొందవచ్చును. ఫోన్ నెం.9848858010

సం/- పర్యవేక్షక ఇంజనీరు, గ్రా.నీ.స. & పారిశుధ్య సర్కిల్, ఏలూరు
DIPR R.O. No.16828/CL/ADVT/1/1/2021-22, Dt: 26.06.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
జలవనరుల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

నెం.07SE/2025-26, తేది: 26.06.2025

పర్యవేక్షక ఇంజనీరు వారి కార్యాలయము, ఇరిగేషన్ సర్కిల్, విజయవాడ వారి పరిధిలో గల **అంచనా విలువ:** రూ.200.00 లక్షలతో మంజూరు కాబడిన 1 పనికి ఆన్‌లైన్ టండర్లు కోరబడుచున్నవి. టెండర్ షెడ్యూల్ లభించు తేది:27.06.2025. ఉ.11 గం.ల నుండి 04.07.2025. సా.4 గం.ల వరకు. ఇతర వివరాలను www.apeprocurement.gov.inలో పొందగలరు. ఫోన్ నెం.08662575276

సం/- పర్యవేక్షక ఇంజనీరు, ఇరిగేషన్ సర్కిల్, విజయవాడ
DIPR R.O No.16826/CL/ADVT/1/1/2021-22, Dt: 26.06.2025

GOVERNMENT OF ANDHRA PRADESH
TRIBAL WELFARE DEPARTMENT
A.P. TRIBAL WELFARE RESIDENTIAL EDUCATIONAL INSTITUTIONS
D.No.12-467-9, Moksha Sai Plaza, Service Road, Tadepalli, Guntur District-522501

Short Tender Notice No.12039/2/2025-PLNG-APTWREIS, Dated: 27.06.2025

APTWREI Society (Gurukulam), Tadepalli is inviting e-tenders from the eligible firms for supply of NCERT Text Books to the boarders of (28) EMRS institutions in the State of Andhra Pradesh through e-Tendering. Bidders who wish to participate in this bids will have to register on **www.apeprocurement.gov.in.** The tender documents is available from 27.06.2025, the last date for receipt of bids is 01..07.2025.

Sd/- Secretary, APTWREIS (Gurukvlam), Amaravati
DIPR RO No.4223PP/CL/ADVT/1/1/2021-22, Date:26.06.2025

OFFICE OF THE DIRECTOR OF FACTORIES, GOVERNMENT OF ANDHRA PRADESH, VIJAYAWADA.

Lr.No. LAE05-14023/7/2025-D SEC - DOF-E-Procurement/25-26 Dated: 26.06.2025

Expression of Interest (EOI) from interested FIRMS/AGENCIES for supply and commissioning of Industrial Emergency Preparedness and response system software The Director of Factories, A.P., Vijayawada invitesExpression of Interest (EOI) **"For supply and commissioning of software on Industrial Emergency Preparedness and response system.** For further details please visit the E-procurement Site www.tender.apeprocurement.gov.in from 27-06-2025 or Office of the Director of Factories, D.No.16-72/1, 4th floor, Adjacent to Andhra Hospital, Gollapudi, NTR District - 521225.

Sd/- DIRECTOR OF FACTORIES
Office of the Director of Factories, D.No.16-72/1, 4th floor, Adjacent to Andhra Hospital, Gollapudi, NTR District - 521225.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)
Lenin Center, Governorpet, Vijayawada - 520 002 (A.P.)

E PROCUREMENT SHORT TENDER NOTICE

APCRDA invites tenders for the following works.

S.No	NIT Number	Name of the Work
1	08/MAU61-USI0HB (OTH)/89/2025-HB/ 2nd call, Dated: 23.06.2025	"Enhancing the Capacity of Ventilation Fans at Main Building of Honb'le High Court of Andhra Pradesh, Nelapadu, Amaravati"- **Estimate Cost: Rs.8,00,000/-.**
2	09/ MAU61-USI0HB (OTH)/38/2025-CETT/2nd call, Dated: 23.06.2025	"Providing Geysers in the Washrooms Attached To the Chambers of Court Halls No. 2 & 07 in the High Court main building, High court Nelapadu"- **Estimate Cost: Rs.1,05,000/-**

The bids can be downloaded on AP e-procurement portal from **26.06.2025 to 04.07.2025 up to 14.00 Hrs**. Due date for submission of Bids **04.07.2025 up to 15.00 Hrs,** Technical bid opening **04.07.2025 @ 16.00 Hrs.** For further details please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**

Sd/- Commissioner, APCRDA, Vijayawada

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు ప్రకటన

నెం. 01/2025-26 తేది:23.06.2025

కార్యపాలక ఇంజనీరు, పి.ఆర్.ఐ. డివిజన్, ఒంగోలు పరిధిలో ZPGF నిధుల నుండి మంజూరు చేయబడిన 9 పనులకు అంచనా విలువ: రూ.123.00 లక్షలకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండర్లు లభ్యమగు తేది: 01.07.2025, మ.3 గం. నుండి లభ్యమగును. ఇతర వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ http://www.eprocurement.gov.in లో పొందగలరు. సం/- కార్యపాలక ఇంజనీరు, పి.ఆర్.ఐ. డివిజన్, ఒంగోలు
DIPR R.O. No.16817/CL/ADVT/1/1/2021-22, Dt: 26.06.2025

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఈసీపై ఈగిల్ పోరు!

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను చెల్లనివిగా ప్రకటించాలంటూ దాఖలైన ఒక పిటిషన్‌ను బోంబే హైకోర్టు గురువారం కొట్టివేసింది. గత ఏడాది నవంబరు 20వతేదీ సాయంత్రం ఆరుగంటల తరువాత 76లక్షల బోగస్ ఓట్లు పోలయ్యాయన్న పిటిషనర్ వాదనను న్యాయస్థానం అంగీకరించలేదు. జాబితాలో అవకతవకలు జరిగాయన్న, పోలింగ్ కేంద్రాల్లో దొంగ ఓట్లువేశారన్న ఆరోపణలను రుజువు చేసే కచ్చితమైన, ప్రత్యక్ష రికార్డులేమీ లేనందున న్యాయస్థానం సదరు పిటిషన్‌ను కొట్టిపారేసింది. మరోపక్కన, ఈసీతో తన యుద్ధాన్ని కొనసాగిస్తూ మహారాష్ట్ర ఓటరు జాబితాల డిజిటల్ ప్రతిని కాంగ్రెస్ గురువారం డిమాండ్ చేసింది.

మహారాష్ట్ర ఎన్నికలు ముగిసి ఏడునెలలుదాటినా అకారణంగానో, సకారణంగానో వార్తల్లో ఉంటోంది. ఎన్నికలు జరిగినప్పటినుంచి, ఎన్నికల సంఘాన్ని కాంగ్రెస్ ప్రశ్నిస్తోంది, నిలదీస్తోంది. పోలింగ్‌బూతుల వెలుపల భారీ క్యూలైన్లు ఏమీ లేకుండానే, ఆఖరునిముషంలో పడిన లక్షలాది దొంగ ఓట్లతో బీజేపీ కూటమి అధికారంలోకి రాగలిగిందని రాహుల్ కొన్ని లెక్కల ఆధారంగా విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. ఎన్నికల సంఘంతో వ్యవహారాలూ, అవసరమైతే వివాదాలూ నడిపేందుకు నాయకులు, నిపుణులతో కూడిన 'ఈగిల్' గ్రూప్‌ను కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈగిల్, ఈసీల మధ్య ఉత్తరప్రత్యుత్తరాల యుద్ధం సాగుతోంది. మహారాష్ట్ర ఎన్నికలకు సంబంధించిన సమస్త సమాచారాన్ని సాధించి, శోధించి, మధించి ఈసీని నిలదీయాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ పోతోంది. ప్రధానంగా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి పెద్దగా ఓట్లుపడని స్థానాల్లో ఓటర్లసంఖ్య అసెంబ్లీ ఎన్నికల నాటికి ఒక్కసారిగా హెచ్చిందని, ఈ రెండు ఎన్నికల మధ్యకాలంలో రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 92.9 మిలియన్ నుంచి 97 మిలియన్‌కు పెరిగిందని, ఐదునెలల్లోనే ఈ పెరుగుదల 4.1 మిలియన్ ఉన్నదని కాంగ్రెస్ లెక్కలు విప్పుతోంది. అంతకుముందు ఐదేళ్ళ కాలంలో ఈ పెరుగుదల 3.1 మిలియన్ మాత్రమే ఉన్నందున కాంగ్రెస్ విమర్శ పూర్తిగా కాదనలేనిది. ఈ ఆరోపణలు నిరాధారమని వివరంగా మాట్లాడుకుందాం రమ్మని రాహుల్‌ను ఈసీ పిలిచినా ఆయన వెళ్ళలేదు. ఓటర్ డేటా, సిసిటీవీ ఫుటేజ్ ఇత్యాది కీలక వివరాలు దక్కేవరకూ ఈసీ మెట్లు ఎక్కేది లేదని కాంగ్రెస్ అంటోంది.

ఐదునెలల్లోనే ఓటర్ల సంఖ్య అంతగా ఎలా పెరిగిందన్న ప్రశ్న కంటే, పోలింగ్ సమయం ముగిసిన ఐదుగంటలకు తాత్కాలిక అంచనాల ప్రకారం పోలైన ఓట్ల శాతం 58.22 ఉండగా, మర్నాడు ఉదయానికి అది 66.05శాతం ఎలా అయిందన్నది మంచి ప్రశ్న. ఇంకా ఓట్లు వేయాల్సి ఉన్నవారి భారీ క్యూలైన్లు కనిపించకున్నా, 7.83శాతం పెరుగుదల నమోదైందని కాంగ్రెస్ గుర్తుచేస్తోంది. అంటే, పోలింగ్‌వేళలు ముగిసిన తరువాత 76లక్షలమంది ఓటేశారని అర్థం. పోలింగ్ గడువు ముగిసే సమయానికి ఓట్లేసిన, ఆ తరువాత ఓటుహక్కు వినియోగించుకున్న ఓటర్ల సంఖ్య మధ్య తేడా గత మూడు అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఒకశాతం లోపే ఉండటం గమనార్హం. మహారాష్ట్రలోని లక్షపోలింగ్ కేంద్రాల్లో కేవలం 85 నియోజకవర్గాల్లోని 12వేల పోలింగ్ బూత్‌లలో మాత్రమే అదనపు పోలింగ్ జరగడం కాంగ్రెస్ విమర్శలకు కారణం. లోక్‌సభ ఎన్నికలలో ఈ నియోజకవర్గాల్లోనే ఎన్డీయే కూటమి వెనుకంజవేయడం, అసెంబ్లీ ఎన్నికల్లో ఈ 85సీట్లలోనే ఆ కూటమి అత్యధికస్థానాలు గెలుచుకోవడం కాంగ్రెస్ అనుమానాలకు కారణం.

పోలింగ్ బూతులకు సంబంధించిన సిసిటీవీ ఫుటేజ్, డిజిటల్ ఓటర్ లిస్ట్ కోసం కాంగ్రెస్ పట్టుబడుతున్న ఈ నేపథ్యంలోనే, ఎన్నికల సంఘం మే30వతేదీన జారీ చేసిన ఆదేశాలు ఆశ్చర్యం కలిగించాయి. ఫలితాలు ప్రకటించిన నలభైఐదురోజుల్లోగా కోర్టుల్లో కేసులేమీ నమోదుకాని పక్షంలో అన్ని రకాల విడియో ఫుటేజ్‌ను ధ్వంసం చేయవచ్చునని రాష్ట్ర ఎన్నికల అధికారులకు ఈసీ ఆదేశాలు ఇచ్చింది. విడియోల దుర్వినియోగాన్ని నివారించడానికే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఈసీ చెప్పింది. కాంగ్రెస్ ఆరోపణలను కొట్టివేయడం వల్లనో, ప్రతివిమర్శలతో సరిపుచ్చడం వల్లనో ఈసీకి ఒనగూరే లబ్ధి ఏమీ ఉండదు. ఎన్నికల ప్రక్రియమీద ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని వమ్ముచేసే అధికారం కాంగ్రెస్ సహా ఏ పార్టీకీ లేదు. మహారాష్ట్రలో అంతా సవ్యంగానే జరిగిందని ఈసీ నమ్మకంలో నిజం ఉండవచ్చు. కాంగ్రెస్ ఆరోపిస్తున్న అక్రమాలు, కుట్రలకు తావులేకుండా ఆ ఎన్నికలు జరిగివుండవచ్చు. కానీ, కాంగ్రెస్ ప్రస్తావిస్తున్న అన్ని రకాల డేటా, విడియోలతోనే ఈసీ ఆ విమర్శలను తిప్పికొట్టినప్పుడు ప్రజల్లో నమ్మకం కలుగుతుంది, ఈసీ ప్రతిష్ఠ ఇనుమడిస్తుంది.

ఆర్థిక పరిపుష్టికి కీలకం 'ఎమ్ఎస్ఎమ్ఈ'లే!

దేశ ఆర్థిక మూలాలను నిలబెడుతున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (ఎమ్ఎస్ఎమ్ఈలకు) నేటికీ తగిన ప్రభుత్వ ప్రోత్సకాలు అందటం లేదు. నిజానికి భారత స్థూల జాతీయోత్పత్తిలో సూక్ష్మ–చిన్న–మధ్యతరహా పరిశ్రమల వాటా 30 శాతం. ఇది రాబోయే రెండేళ్లలో, అంటే 2027 వరకు, 35శాతం వరకు పెరగవచ్చునని నిపుణుల అంచనా. దేశ మొత్తం ఎగుమతుల్లో వీటి వాటా 40శాతం. అలాగే ఉద్యోగ కల్పనలో కూడా వీటి వాటా సింహభాగమే. దాదాపుగా 11 కోట్ల మందికిపైగా సూక్ష్మ–చిన్న–మధ్యతరహా పరిశ్రమలలో ఉపాధి పొందుతున్నారు. రాబోయే ఐదేళ్ళల్లో ఈ సంఖ్య 15 కోట్లకు చేరుతుందని అంచనా. అంతేగాక మొత్తం పారిశ్రామిక ఉత్పత్తుల్లో 45శాతం వీటి నుంచే వస్తున్నాయి. వీటి పాత్ర ఆర్థిక గణాంకాలకే పరిమితం కాదు. ఇవి ఎక్కువగా చిన్న లేదా మధ్య తరహా పట్టణాల్లో విస్తరించి ఉండటం వలన ఆయా ప్రాంతాల స్థానిక ఆర్థిక సామాజిక అభివృద్ధిలోనూ, ఉద్యోగ ఉపాధి కల్పనలోనూ కీలకపాత్ర పోషిస్తున్నాయి. అభివృద్ధి వికేంద్రీకరణలో ముఖ్యపాత్ర పోషిస్తూ ఆయా ప్రాంతాల్లో సామాజిక ఆర్థిక అంతరాలను తగ్గిస్తున్నాయి.

దేశీయ అంతర్జాతీయ వ్యాపార ప్రపంచం, మార్కెట్ అవసరాలు రోజు రోజుకీ చాలా వేగంగా మార్పు చెందుతున్న ప్రస్తుత కాలంలో ఆ మార్పులకు అనుగుణంగా, అంతే వేగంతో అందుబాటులో ఉన్న స్థానిక మానవ వనరులతో, తక్కువ పెట్టుబడితో నూతన శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణలు చేయడం కూడా ఎమ్ఎస్ఎమ్ఈల వల్లనే సాధ్యం. వేగంగా మారుతున్న వినియోగదారుల, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తక్షణమే స్పందించి అంతే వేగంగా సునిశితమైన సృజనాత్మకతతో ఉత్పత్తులను, సేవలను అందించగల నిర్మాణ సామర్థ్యం గలవి ఈ ఎమ్ఎస్ఎమ్ఈలే. అలాగే ఆర్థిక మాంద్యం వంటి ప్రతికూల పరిస్థితులలోనూ వేగంగా తిరిగి నిలబడే శక్తి సామర్థ్యాలు వీటికే ఉన్నాయి.



చైనా లాంటి దేశాలు ఈ రంగం ప్రాధాన్యతను ఎంతో ముందుగానే గుర్తించాయి. అక్కడ ఈ రంగానికి తక్కువ వడ్డీతో తక్షణ రుణాల మంజూరు, పన్ను మినహాయింపులు, సాంకేతిక శిక్షణ, అంతర్జాతీయ మార్కెట్‌కు చేరువ చేసేలా డిజిటల్ మేళాల నిర్వహణ, భూమి నీరు విద్యుత్ రహదారి మార్గాల వంటి మౌలిక సదుపాయాల కల్పన... ఇవన్నీ ప్రభుత్వమే అందించి స్థానికంగా పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేసింది. ఈ చర్యల వల్ల చైనా నేడు రాజకీయంగా, ఆర్థికంగా యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేయగలిగే స్థితిలో ఉంది.

కానీ మన దేశంలో ఈ రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలు, పథకాలు, సబ్సిడీలు ఇంకా క్షేత్ర స్థాయికి చేరడానికి ఎన్నో అవాంతరాలు, అడ్డంకులు ఉన్నాయి. అందువలనే ఈ రంగం నుంచి పూర్తి స్థాయిలో ఫలితాలు పొందలేకపోతున్నాం. బ్యాంకుల నుంచి రుణాల మంజూరులో జాప్యతని తగ్గించి, తగిన మౌలిక సదుపాయాలు కల్పించి, స్థానికంగా లభించే ముడి సరుకుని బట్టి పారిశ్రామిక క్లస్టర్‌లను ఏర్పాటు చేసి, డిజిటల్ వర్చువల్ మేళాలు నిర్వహించడం వంటి చర్యలు ఇక్కడ కూడా చేపట్టాలి. వాటిని వ్యవస్థీకృత మార్కెట్‌కి అనుసంధానించే చర్యలు చేపట్టాలి.

ఈ రంగానికి రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు తమ తమ బడ్జెట్లలో ఇతోధిక స్థాయిలో కేటాయింపులు జరపాలి. దేశ యువత ఉద్యోగార్థులుగా మాత్రమే మిగిలిపోకుండా, ఉద్యోగదాతలుగా మారేందుకు అన్ని సదుపాయాలు కల్పించాలి. పాఠశాల కళాశాల స్థాయి నుంచి అవగాహన, ప్రోత్సాహం అందించాలి. సూక్ష్మ–చిన్న–మధ్యతరహా సంస్థల విజయగాథలను పౌరులు పాఠశాల దశ నుండే తెలుసుకునేట్టు వాటిని పాఠ్యాంశాలుగా చేర్చాలి. ఈ రంగానికి ప్రభుత్వాలు, విద్యావ్యవస్థ, బ్యాంకింగ్ రంగం, వ్యాపార సంఘాలు, మీడియా కూడా తమ వంతు సహాయాన్ని అందిస్తే మన దేశానికి ఉన్న అపరిమిత సహజ మానవ వనరులతో అనతి కాలంలోనే భారత్ ప్రపంచంలో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించగలదు.

– కందుల నరేంద్రనాథ్ దత్
లఘు ఉద్యోగ భారతి జనరల్ సెక్రెటరీ, తెలంగాణ

(నేడు అంతర్జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల దినోత్సవం)

ప్రజాస్వామ్య త్రాసులో మోదీ, ఇందిర

ఈ జూన్ తొలినాళ్లలో కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ తన దైనందిన ట్వీట్‌లలో Emergency@11 అనే హ్యాష్ ట్యాగ్‌ను ఉపయోగించడం ప్రారంభించారు. అధికారంలో ఉన్నవారు వివిధ తప్పులు, పొరపాట్లు, నేరాలకు పాల్పడ్డారని ఆ పోస్ట్‌లలో ఆయన ఆరోపించారు. ఇందిరాగాంధీ విధించిన అత్యవసర పరిస్థితికి ఈ జూన్ ఆఖరివారంలో యాభై సంవత్సరాలు పూర్తవనున్న సందర్భాన్ని కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా మోదీ ప్రభుత్వం తప్పక ఉపయోగించుకుంటుందనే తెలివిడితోనే జైరామ్ రమేశ్ ఆ హ్యాష్ ట్యాగ్‌ను ఉపయోగించారు. తద్వారా, ఇందిర అమలుపరిచిన ఎమర్జెన్సీ రెండేళ్ల కంటే తక్కువ కాలంలోనే ముగిసిందని, మోదీ నిరంకుశాధికార పాలన ఒక దశాబ్దానికి పైగా విస్తరించి, కొనసాగుతోందని రమేశ్ అభిప్రాయపడ్డారు.

ఇందిర ప్రధానమంత్రిత్వ కాలంలో నేను యుక్త వయస్కుడినయ్యాను. మోదీ ఏలుబడి రోజుల్లో వృద్ధాప్యంలోకి ప్రవేశించాను. నా వ్యక్తిగత అనుభవాలు, విద్యా విషయక పరిశోధనల ఆధారంగా ఇందిర, మోదీ పరిపాలనా తీరుతెన్నులను తులనాత్మకంగా విశ్లేషించేందుకు ఈ కాలమ్‌ను ఉద్దేశించాను. రెండు భిన్న భావజాలాల నేపథ్యమున్న ఈ ఇరువురు ప్రధాన మంత్రుల పరిపాలనల మధ్య ఐదు పోలికలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. తొలుత ప్రస్తావించవలసిన సామ్యం– ఇందిర వలే మోదీ సైతం రాజకీయ అధికారాన్ని తన వ్యక్తిపూజను పెంపొందించడానికి పూర్తి స్థాయిలో వినియోగించారు. పార్టీ, ప్రభుత్వం, రాజ్యం, జాతికి తానే సర్వస్వమని, వాటి మూర్తీభవించిన రూపమే తాను అన్న ప్రచారాన్ని ప్రోత్సహించారు. ఇందుకు పన్నుల రూపేణా ప్రజలు చెల్లించిన సొమ్మును విచ్చలవిడిగా వినియోగించారు.

రెండోది–ప్రజాస్వామిక పాలనకు కీలకమైన రాజ్యాంగ సంస్థల స్వతంత్ర ప్రతిపత్తిని బలహీనపరిచేందుకు ఇందిర వలే మోదీ సైతం దీక్షగా పనిచేశారు. 'నిబద్ధ న్యాయవ్యవస్థ' 'నిబద్ధ ఉద్యోగ స్వామ్యం' గురించి మొట్టమొదట మాట్లాడిన దేశ పాలకురాలు ఇందిర. మోదీ ఆ భావాలను అంగీకరించారు; తన సొంత రీతుల్లో అమలుపరిచారు. మోదీ లాంఛనంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించకపోయినప్పటికీ రాజ్యాంగ బద్ధ ప్రజాస్వామ్యం పట్ల ఇందిర వలే నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. సత్యాలు, వాస్తవాలను వెల్లడించవద్దని పత్రికారంగాన్ని ఇందిర బెదిరించారు; అబద్ధాలు చెప్పాలని మీడియాను మోదీ బలవంతపెట్టారు.

మూడవది– మన పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రధాన మంత్రిని 'సమానులలో ప్రథముడు'గా పరిగణిస్తారు. అమెరికా అధ్యక్షుడు వలే మన ప్రధాన మంత్రి సర్వాధికారాలు చెలాయించేందుకు ఆస్కారం లేదు. అయితే ఇందిర తన కేబినెట్ సహచరులతో చర్చలు, సంప్రదింపులతో కాకుండా ఏకపక్ష నిర్ణయాలతో పాలన చేశారు. అధికార బాధ్యతల నిర్వహణలో ఆమె కేవలం ఒకే ఒక్క వ్యక్తి సలహాలు తీసుకునే వారు, పాటించేవారు. ఆ ఏకైక వ్యక్తి తొలుత పీఎన్ హక్సర్ కాగా ఆ తరువాత సంజయ్‌గాంధీ. ఇందిర వలే మోదీ సైతం ఒకే ఒక్క వ్యక్తిని సంప్రదిస్తారు, అతడి సలహాలనే తీసుకుంటారు. ఆ ఒకే ఒక్కడు అమిత్ షా. షాను మాత్రమే మోదీ విశ్వసిస్తారు. అమిత్ షా సైతం తన బాస్ వలే అపారదర్శక, నిరంకుశ పాలనాపద్ధతులకు అనుకూలుడు.



> స్వతంత్ర భారతదేశ ప్రధానమంత్రులలో నిరంకుశత్వ స్వభావం సహజ ప్రవృత్తిగా ఉన్న ఇద్దరు ప్రధానమంత్రులు ఇందిరాగాంధీ, నరేంద్ర మోదీ. ఇందిర ప్రధానమంత్రిత్వంలో చీకటి అధ్యాయం–ఎమర్జెన్సీ పరిణామాలలో ఒకటైన 'వంశపారంపర్య అధికార హానికర ప్రభావం' వర్తమాన భారత రాజకీయాలపై కొనసాగుతూనే ఉంది. నిరంకుశాధికారిత, మెజారిటీవాద ధోరణుల ఏకీకరణ నరేంద్ర మోదీ పాలనా శైలి ప్రధాన లక్షణంగా ఉన్నది.

నాల్గవది– ఇందిర వలే మోదీ సైతం భారతీయ సమాఖ్య పాలనా విధానాన్ని నిస్సారం చేశారు. కాంగ్రెసేతర పార్టీల ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వాలను తొలగించేందుకు ఇందిర రాజ్యాంగ అధికరణ 356ను విచక్షణారహితంగా ప్రయోగించేవారు; పక్షపాత రహితంగా రాజ్యాంగ విధులు నిర్వర్తించాల్సిన గవర్నర్లను బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చివేసేందుకు లేదా విధేయంగా చేసుకునేందుకు మోదీ సర్కార్ ఉపయోగించుకుంటోంది.

ఐదవది– తన పాలనను సుస్థిరం చేసుకునేందుకు దేశ ప్రజలలో తీవ్ర జాతీయవాద భావోద్వేగాలను మోదీ రగిలించారు. భారతీయుల ఆకాంక్షలను తాను మాత్రమే నెరవేర్చగలనే భావాన్ని ప్రజల మనసుల్లో పాదుకొల్పేందుకు ఇందిర వలే మోదీ కూడా పార్టీని, రాజ్య వ్యవస్థను, మీడియాను పూర్తిగా ఉపయోగించుకున్నారు. శ్రుతిమించిన దేశభక్తిని రెచ్చగొట్టడం ద్వారా తనపై వస్తున్న విమర్శలు దురుద్దేశపూర్వకమైనవని, వాటి వెనుక విదేశీ ప్రభుత్వాల ప్రమేయముందని మోదీ పదే పదే ఆరోపిస్తుంటారు. ఈ విషయంలో ఇందిర మరింత ముందుకు వెళ్లి మహోన్నత దేశభక్తుడు లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్‌ను 'పాశ్చాత్య దేశాల ఏజెంట్' అని ఆరోపించారు.

ఇందిర నియంతృత్వ పద్ధతులలో పాలించినప్పటికీ రాజ్యాంగం నిర్దేశించిన బహుళత్వ భారత్ భావనను మనసా వాచా కర్మణా సమర్థించారు. దేశ పౌరసత్వాన్ని భాష, మతం, జాతి పరంగా నిర్వచించని విశాల భావన అది. జవహర్‌లాల్ నెహ్రూ నిస్సందేహంగా నియమబద్ధమైన లౌకికవాది. ఆయన సైతం కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో ఒక ముస్లిం నాయకుడు ముఖ్యమంత్రిగా నియమితుడు అయ్యేందుకు దోహదం చేయలేకపోయారు. తండ్రికి భిన్నంగా ఇందిర తన పాలనలో నలుగురు ముస్లిం నేతలను ముఖ్యమంత్రి పదవిలో నియమించారు. ఆపరేషన్ బ్లూస్టార్ అనంతరం సిక్కు మతస్థులు అయిన తన అంగరక్షకులను తొలగించేందుకు ఆమె నిర్ద్వంద్వంగా నిరాకరించారు.

ఇందిరకు పూర్తిగా భిన్నమైన పాలకుడు నరేంద్ర మోదీ. మెజారిటీవాదాన్ని మినహాయింపులు లేకుండా విశ్వసించే నాయకుడు. సహచర స్వయం సేవక్‌ల వలే హిందూ రాష్ట్ర నిర్మాణానికి దీక్షాదక్షతలు చూపుతున్న పాలకుడు. ఆయన సంకల్పించిన హిందూ రాష్ట్రంలో దేశ రాజకీయాలు, సాంస్కృతిక విలువలు, పాలనా పద్ధతులు ఎలా ఉండాలో పూర్తిగా మితవాద హిందువులు మాత్రమే నిర్ణయిస్తారు, నిర్దేశిస్తారు. ఈ హిందూ రాష్ట్రంలో ముస్లింలే కాకుండా క్రైస్తవులు సైతం ద్వితీయ శ్రేణి పౌరులుగా ఉండాల్సిందే. మోదీ 11 సంవత్సరాల పాలన ఆయన నినాదం 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' ఎంత కపటమైనదో బయల్పరిచింది. బీజేపీ 2014, 2019, 2024 సార్వత్రిక ఎన్నికలలో లోక్‌సభకు పంపించిన 800 మందికి పైగా ప్రజాప్రతినిధులలో ముస్లిం సభ్యుడు ఒక్కడంటే ఒక్కడు కూడా లేడు!

ఇందిర నికార్సయిన లౌకికవాది. మెజారిటేరియన్ మోదీకి పూర్తిగా భిన్నమైన నాయకురాలు. ఇక వారిరువురి మధ్య ఉన్న మరో ప్రధాన వ్యత్యాసం ఆమెకు అపకీర్తిని తెచ్చింది. అత్యవసర పరిస్థితి కాలంలో పార్టీలోను, ప్రభుత్వంలోను సంజయ్‌గాంధీని తనకు వారసుడుగా ప్రకటించారు. 1980లో విమాన ప్రమాదంలో ఆయన దుర్మరణం పాలయ్యారు. ఆ తరువాత ఆమె తన పెద్ద కుమారుడు రాజీవ్‌గాంధీని తనకు వారసుడుగా రాజకీయాలలోకి తీసుకువచ్చారు. అలా వారసత్వ రాజకీయాలను ఆమె కొనసాగించారు. ఈ అపాయకరమైన ఆచరణ కాంగ్రెస్ పార్టీ చరిత్ర, సంప్రదాయాలకు పూర్తిగా విరుద్ధమైనది.

భారతదేశ పురాతన రాజకీయపక్షాన్ని ఇందిర ఒక కుటుంబ సంస్థగా మార్చివేయడం ఇతర రాజకీయ పార్టీ నాయకులు కూడా అదే విధంగా వ్యవహరించేందుకు ప్రోత్సాహం కల్పించింది. శివసేన, డీఎంకే, అకాలీదళ్, టీఎంసీ అధినేతలు తమ తమ రాష్ట్రాల పేరు ప్రతిష్ఠలు పెంపొందించేందుకు ప్రథమ ప్రాధాన్యమిచ్చేవారు. ఇప్పుడు ఠాక్రే, కరుణానిధి, బాదల్, బెనర్జీ కుటుంబాల పాలనను శాశ్వతం చేసేందుకు మాత్రమే వారు ప్రాధాన్యమిస్తున్నారు!


■ రామచంద్ర గుహ

మోదీ తల్లిదండ్రులు రాజకీయాలలో లేరు. ఆయనకు పిల్లలు లేరు. ఇది మోదీకి ఒక గొప్ప అనుకూలతను సమకూర్చింది. ఎన్నికలలో ఆయన విజయానికి తోడ్పడుతోంది. ప్రధాన మంత్రి పదవి విషయంలో ఆయనకు ప్రత్యర్థి అయిన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యక్తిగతంగా ఎంత సౌశీల్యుడు, సమున్నతుడు అయినప్పటికీ రాజీవ్, సోనియాగాంధీల కుమారుడు, ఇందిరాగాంధీ మనవడుగా మాత్రమే గౌరవాదరాలు పొందుతున్నారు. మోదీ స్వయం కృషితో ఎదిగిన రాజకీయ నాయకుడు అని, రాహుల్ కేవలం కుటుంబ వారసత్వంతో సమున్నత పదవికి పోటీపడుతున్న నాయకుడు అనే భావన ప్రజల్లో బలంగా ఉందన్న విషయం విస్మరించలేనిది. ఇది, గత మూడు సార్వత్రిక ఎన్నికలలో బీజేపీకి విశేషంగా తోడ్పడింది. మరింత స్పష్టంగా చెప్పాలంటే బీజేపీని వ్యతిరేకిస్తున్న పార్టీల వంశపారంపర్య రాజకీయాల కారణంగానే మోదీ పార్టీ ప్రాభవ ప్రాబల్యాలు పెరుగుతున్నాయి. ఇదొక కఠోర వాస్తవం. హిందూ మెజారిటేరియన్ వాదాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నవారు కూడా ఆ వాస్తవాన్ని అంగీకరించేందుకు సుముఖంగా లేరు. ఇందిర ప్రధానమంత్రిత్వంలో చీకటి అధ్యాయం ఎమర్జెన్సీ పరిణామాలలో ఒకటైన 'వంశపారంపర్య అధికార హానికర ప్రభావం' వర్తమాన భారత రాజకీయాలపై కొనసాగుతూనే ఉంది.

స్వతంత్ర భారతదేశ ప్రధానమంత్రులలో నిరంకుశత్వ స్వభావం సహజ ప్రవృత్తిగా ఉన్న ఇద్దరు ప్రధాన మంత్రులు ఇందిరాగాంధీ, నరేంద్ర మోదీ. ఎవరి పాలన ఎక్కువ చెడ్డది? భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను పరిగణనలోకి తీసుకుంటే ప్రస్తుత పరిస్థితి కొంచెం మెరుగ్గా ఉంది. స్వతంత్ర వెబ్‌సైట్‌లు, ప్రాంతీయ దిన పత్రికలు సత్యాన్ని ఎలా చెప్పాలో అలా చెప్పగలుగుతున్నాయి.

మే 2014 అనంతరం మితిమీరిన రాజకీయ జోక్యంతో మన రాజ్యాంగ సంస్థల స్వతంత్ర ప్రతిపత్తి బాగా తగ్గిపోయింది. అధికారులు, దౌత్యవేత్తలు పాలకులతో చాలా వరకు రాజీపడ్డారు. ఉన్నతన్యాయ వ్యవస్థ స్వల్పంగా రాజీపడింది. పన్ను వసూళ్ల సంస్థలు, దర్యాప్తు సంస్థలు, రెగ్యులేటరీ ఏజెన్సీలు తమ రాజకీయ యజమానులకు మరింతగా 'నిబద్ధమయ్యాయి'. అలాగే ఎన్నికల సంఘం కూడా. బాగా ఆందోళనకరమైన విషయమేమిటంటే మోదీ పాలనలో మత సంకుచితత్వం బాగా పెచ్చరిల్లిపోతోంది. నిరంకుశాధికారితతో మెజారిటీవాద ధోరణుల కలయిక నరేంద్ర మోదీ పాలనాశైలి అత్యంత నష్టదాయక లక్షణంగా ఉన్నది. ఈ నష్టం తీవ్రమైనది, విస్తృతమైనది. ప్రధానమంత్రి పదవి నుంచి మోదీ అంతిమంగా నిష్క్రమించిన తరువాత కూడా పరిస్థితులను బాగుపరిచి పూర్వ స్థితికి తీసుకువచ్చేందుకు దశాబ్దాల కాలం పట్టవచ్చు.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

ఆ దాడి.. వాస్తవం కాదు!

అత్యవసర పరిస్థితి అమలై యాభయ్యేళ్ళు పూర్తయిన సందర్భంగా హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులో నిర్బంధించిన మీసా డిటెన్యూలైన ఆర్ఎస్‌యు వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటరమణి, విరసం నేత వరవరరావుల వ్యాసాలలోని అనుభవాలకు సంబంధించి కొన్ని అంశాలను ప్రస్తావిస్తున్నాను. వెంకటరమణి చెప్పినట్లు లెఫ్ట్, రైట్ వంటి విభేదాలు లేకుండా, చివరకు ఆర్ఎస్ఎస్, జమాతే ఇస్లామి హింద్, ఆనంద్ మార్గ్ వంటి వారంతా కలిసి ఒక కుటుంబం మాదిరిగా ఉండేవాళ్లం. అయితే 50 ఏళ్ళు కావడంతో కొన్ని జ్ఞాపకాలు మసకబారి ఉండవచ్చు. వరవరరావు చెప్పినట్లు చెరబండరాజును మాజీ కేంద్ర మంత్రి ఆలె నరేంద్ర వెనుకగా వచ్చి కర్రతో కొట్టారనడం, తిరిగి నరేంద్రపై దాడి చేశారనడం వాస్తవం కాదు.

అలాగే వందేమాతరం పాటతో కోపగించుకున్నారనడం కూడా నిజం కాదు. భారత మాతను కించపరుస్తూ పాడడంతో పాతబస్తీకి చెందిన శివాజీరావు పవార్ ఆగ్రహంతో నిలదీశాడు. అయితే, సాయంత్రం వంటపాత్రలు ఇచ్చే దగ్గర జరిగిన వాగ్వివాదంలో వరవరరావు వంట చేసే పెనంపై కాలు వేయడంతో కోపం పట్టలేక, అన్నం వండే దానిపై కాలు వేస్తావా? అంటూ అందరూ ఉండగానే చెంపపై చేతితో కొట్టాడు. దాంతో కొంత అలజడి జరిగింది. తర్వాత, వీరిద్దరూ పేర్కొన్నట్లు భావజాలాన్ని బట్టి అక్కడ మెస్‌లు లేవు. వాస్తవానికి భావజాలాలు బట్టి కాకుండా వ్యక్తిగత అహంకారాలతో ఎక్కువగా వివాదాలు చెలరేగుతూ ఉండేవి. స్వాతంత్ర్య పోరాటంలో తన జైలు జీవితం గురించి రాస్తూ టంగుటూరి ప్రకాశం "నేను జైలులో పెద్దవారి చిన్న మనస్సులను, చిన్నవారి పెద్ద మనసులను చూశాను" అన్నారు. అంటే, బయట ఎంతో ప్రఖ్యాతులైన వారు జైలులో చిన్న చిన్న విషయాలలో సంకుచితంగా, మొండిగా వ్యవహరిస్తూ ఉండేవారు. ఇక్కడ కూడా అటువంటి ఘటనలు కొన్ని జరిగినా కొట్లాటల వరకు వెళ్లలేదు. ప్రతిరోజూ అందరం కలిసి చర్చాగోష్ఠులు నిర్వహించుకొనేవాళ్ళం. ఆ ప్రక్రియలోనే తరిమెల నాగిరెడ్డి మరణం సందర్భంగా సంతాప సభ జరిగింది. ఆ సభలో ఆర్ఎస్ఎస్ ప్రచారక్ విఎల్ దేశముఖ్ మాట్లాడటం అందరికీ ఆశ్చర్యం కలిగించింది.

– చలసాని నరేంద్ర

సరిహద్దులు లేని సహానుభూతి

ప్రతి ఉదయం కాఫీ పెట్టుకుంటూ, 'గడచిన రాత్రి ఉక్రెయిన్, గాజా, కశ్మీర్, ఇజ్రాయెల్, ఇరాన్‌లో ఏమి జరిగి ఉండవచ్చు' అని ఆలోచనామగ్నుడనవుతాను. ట్యాబ్ ఓపెన్‌చేస్తే, కాంతులు విరజిమ్ముతూ ఆకాశంలో దూసుకువెళుతోన్న బాంబులు, క్షిపణులు దృశ్యమానమవుతాయి. ఆ కాంతులు రంగుల రంగేళీ కాదు, మృత్యుపాశాలంటూ నేల మట్టమైన భవనాలు, అంబులెన్స్‌లు, రక్తాలోడుతున్న చిన్నారులు, ఆసుపత్రులు, మృతదేహాలు నాకు గుర్తు చేశాయి. కాఫీ ముగించాను, బ్రౌజర్ విండో మూసివేశాను. ఆలోచనలను నా దైనందిన వ్యాపకాల మీదకు మళ్లించాను. సుదూర సంఘటనలపై కలతచెందుతున్న నేను ఒక్కసారిగా నా సొంత జీవితంలో లీనమయ్యాను, లిప్తపాటులో పరివర్తన చెందాను. దూర శ్రవణ సాధనంలో మరణమృదంగాన్ని చూశాను; అది 'గుండెల కొండలలో మారుమ్రోగుతుండగానే' బతికే క్షణాలలోకి వెళ్లిపోయాను.

మనం మన నిత్య జీవన కార్యకలాపాలను వదిలివేయాలని గానీ, సొంత భద్రత, ఆనందాల ఆరాటాన్ని ఆపివేయాలని కానీ నేను అనడం లేదు. మరి, ధ్వంసమవుతోన్న మానవతకు దిగ్భ్రాంతి చెందుతూనే ఇలా నిర్లిప్తంగా ఉండిపోవడం వివేకశీలురు చేయవలసిన పనేనా? కాదు. ఆత్మసంరక్షణ ప్రభావంలో హింసనచణ, ధ్వంసరచన దారుణాల నుంచి మానసికంగా దూరతీరాలకు వెళ్లిపోతాం. సామాజిక వేర్పాటు, భౌగోళిక ఎడబాటు సమకూర్చిన వెసులుబాటు ఇది. ఈ రక్షణాత్మక సౌలభ్యమే విశాల ప్రపంచ వేదనకు పరితాపం చెందడం నుంచి స్వీయ జీవితంలోకి వెళ్లేందుకు మనలను పురిగొల్పుతుంది.

ఆ అమానుషాలు, అకృత్యాలన్నీ భౌమ రాజకీయాలు, చారిత్రక వైరుధ్యాలు ప్రేరేపించిన ఘర్షణలనీ, వాటిని నివారించేందుకు మనమేమీ చేయలేమని రాజకీయవేత్తలు, రాజనీతిశాస్త్రవేత్తలు వక్కాణిస్తారు. అదొక అనివార్య, చారిత్రక పరిణామమని, నివారించలేని హాని అని మనసు లోలోతుల్లో ఒప్పుకున్నాం కనుక ఘర్షించుకుంటున్న వైరిపక్షాలలో ఒకదాని వైపు మొగ్గుతాం. భౌమ రాజకీయ వైఖరి తీసుకుంటాం. వెన్వెంటనే లోకం బాగోగులను పూర్తిగా ఉపేక్షించి నిత్య జీవన వ్యవహారాలలో తలమునకలవుతాం. సాగుతున్న యుద్ధాలు సజ్జనులు, దుర్జనుల మధ్య చెలరేగుతున్నవేనని మనకు మనం సంజాయిషీ ఇచ్చుకుంటూ 'అంతా ప్రారబ్ధం, విధిని ఎవరు తప్పించగలరు?' అన్న నిట్టూర్పుతో ఇది ముగుస్తుంది.

ఒక్కక్షణం మనలను వేరు చేస్తున్న ఈ రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, భాషాసంబంధ, చారిత్రక నిర్దేశాలను తొలగించి చూడండి. అటువంటి అంతరాలు ఏవీలేవని, 'అంతరంగం అట్టడుగున అంతమందిమీ మానవులమే' అని స్పష్టమవుతుంది. ప్రపంచవ్యాప్తంగా జరుగుతోన్న ఈ యుద్ధాలు, ఇతర బాధాకర సంఘటనలు మీకు, నాకు సంబంధించినవేనని అర్థమవుతుంది. వాతావరణ మార్పు మన విశ్వజనీనతను మనకు ఇప్పటికీ గుర్తుచేస్తున్నది. మనకు మనం కట్టుకున్న సకల అడ్డుగోడలకు అతీతంగా అది సర్వత్రా పరివ్యాప్తమై ప్రతి ఒక్కరినీ సతమతం చేస్తోంది. మన సంకుచిత మనస్తత్వం, కూపస్థ మండూక స్వభావం, అత్యాశలు, అధికార ఆరాటాలు, మరీ ముఖ్యంగా సహానుభూతి లేకపోవడమే మనం ఎదుర్కొంటున్న విపత్తులకు మూలమని క్లైమేట్ ఛేంజ్ విశదం చేస్తోంది. భౌమ రాజకీయ సమస్యలు సమస్తమూ మన వ్యక్తిగత (విలువలు, రాజకీయ అభిప్రాయాలు మొదలైనవి), స్థానిక (పర్యావరణ భద్రత, సామాజిక గతిశీలత, ఆర్థిక స్థితిగతులు మొదలైనవి) అంశాల నుంచే ప్రభవిస్తున్నాయి.

> గాజా ఒక సుదూర సీమ కాదు, ఉక్రెయిన్ ఒక్క రష్యా సమస్య కాదు. కశ్మీర్ సంక్షోభం కేవలం ఉగ్రవాద దుర్మార్గాల పర్యవసానమే కాదు. ఎల్లెడలా అసంఖ్యాక ప్రజల దురవస్థలకు మానవీయ సంవేదనలతో ప్రతిస్పందించడంలో మన అశక్తతను గాజా, ఉక్రెయిన్ యుద్ధాలు ఎత్తి చూపుతున్నాయి.



గత నెలలో మూడు విభిన్న స్థానిక ఘటనలు నా అనుభవంలోకి వచ్చాయి. ప్రజలను, ధరిత్రిని, విశాల ప్రపంచాన్ని ఎలా చూడాలో అవి నాకు నేర్పాయి. ఇటీవల ప్రముఖ తమిళ రచయిత, అనువాదకుడు ఎమ్ఎల్ తంగప్ప సన్మాన కార్యక్రమంలో పాల్గొనేందుకు పుదుచ్చేరి వెళ్లాను. ఈ సందర్భంగా 'ప్రజల సంగీత' కార్యక్రమం చూస్తారని నాకు చెప్పారు. ఆ కచేరీ ఒక భవనం టెర్రస్ మీద జరిగింది. నాకు అది ఒక సంగీత సమారాధన జరిగే ప్రదేశంలాగా కన్పించలేదు. ఈ అభిప్రాయం, బహుశా, నా సొంత సామాజిక పరిసరాలతో ప్రభావితమయి ఉండవచ్చు. కానీ, పలు సామాజిక, సౌందర్యాత్మక అవధులను అధిగమించిన సంగీతంతో ఆ కచేరీ శ్రోతలను అలరించింది. శాస్త్రీయ, జానపద, లలిత మొదలైన సంప్రదాయ రీతులను ఆ విలక్షణ సంగీత కచేరి విస్మరించింది. సాంస్కృతిక, ఉద్వేగాత్మక విభజనలన్నిటిని అధిగమించి విభిన్న శ్రోతలనందరినీ అలరించిన ఆ సంగీతం నాకొక విశాల భావోద్వేగ అనుభవం.

కలశపాక్కం తమిళనాడులో ఒక చిన్న గ్రామం. ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాడు ఆ పల్లెలోని 'సంప్రదాయ విత్తన కేంద్రం' నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్నాను. దేవాలయం వెనుక భాగంలో ఉన్న ఒక సరస్సు తీరాన వేప వృక్షం నీడలో సమావేశమయ్యాం. పాతికేళ్లుగా ఆ చుట్టుపక్కల ప్రాంతానికి చెందిన సేంద్రియ వ్యవసాయదారులు ప్రతి నెలా అక్కడ సమావేశమై నైతిక వ్యవసాయం (ఆర్థిక ప్రయోజనాలతో పాటు జంతు సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతలకు ప్రాధాన్యమిచ్చే సేద్యం), విత్తనాలు, సాగు విజ్ఞానాన్ని ఉచితంగా పంచుకోవడం, అవగాహనను పెంపొందించుకోవడం, సుస్థిర వ్యవసాయాభివృద్ధిని సాధించడం మొదలైన అంశాలపై మాటామంతీ జరుపుతారు. పేరాశకు తావులేని జీవన విధానాన్ని ఈ రైతులు దృఢంగా విశ్వసిస్తారు. తమ ఫలసాయాన్ని ఉచితంగా పంచుకుంటారు. భిన్నాభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేస్తారు, చర్చిస్తారు. వారి మధ్య రాజీ చేయ వీలులేని విభేదాలున్నా క్రమం తప్పకుండా సమావేశమవుతారు.

చెన్నైలో హైకోర్టు బార్ కౌన్సిల్ ఆడిటోరియంలో సమాఖ్య పాలనా విధానంపై జరిగిన ఒక సమావేశంలో పాల్గొన్నాను. వేదికపై పలువురు రిటైర్డ్, ప్రస్తుత న్యాయమూర్తులు ఉన్నారు. సభికులలో యువ న్యాయవాదులు, విభిన్న సామాజిక నేపథ్యాల నుంచి వచ్చిన వారున్నారు. ఆ యువ న్యాయవాదులలో అనేక మంది ప్రజాఉద్యమాలలో కార్యకర్తలుగా పనిచేస్తున్నవారు. చర్చ శక్తిమంతంగా జరిగింది. లోతైన రాజకీయ వివేచన, చారిత్రకవిశ్లేషణతో రాజ్యాంగ సంస్థల పనితీరులో లోపాలు, లొసుగులు ఎత్తి చూపుతూ ప్రసంగాలు జరిగాయి. పాలనా పద్ధతిగాను, సామాజిక సూత్రంగాను సమాఖ్య విధానంలో తమ విశ్వాసాన్ని దృఢంగా వ్యక్తం చేస్తూ పలువురు వెలువరించిన ప్రసంగాలను విన్నాను.

ఈ మూడు సంఘటనలూ– సంగీతకళాకారుల కచేరీ, వ్యవసాయదారుల సమాలోచన, న్యాయశాస్త్ర విజ్ఞుల చర్చ– ఒకదానితో ఒకటి సంబంధం లేనివిగా కనిపించవచ్చు. కానీ, తమతమ రంగాలలో కృషి చేస్తున్న వారిని సమైక్యపరిచేందుకు, సమష్టి కార్యాచరణకు ఒక ఉమ్మడి ప్రాతిపదికను కనుగొనేందుకు, జీవనసూత్రాలలో భాగమయ్యేందుకు జరిగిన విశిష్ట ప్రయత్నాలవి. వారందరూ విభిన్న 'స్థానిక' అంశాలతో వ్యవహరిస్తున్నవారే. సంగీతాన్ని సృష్టించడమేకాకుండా, ఆ శ్రావ్య కళను సృష్టించిన, ప్రదర్శించిన, వినియోగించిన సామాజిక, సాంస్కృతిక సందర్భాలలో మౌలిక గుణశీల మార్పును సాధించడమే పుదుచ్చేరిలోని యువ సంగీత కళాకారుల లక్ష్యం; ఆరోగ్యకరమైన, స్వయం పోషకమైన జీవన విధానం విషయమై తమ అనుభవాలు, పాఠాలను విశాల సమాజంతో పంచుకోవడమే కలశపాక్కం వ్యవసాయదారుల మనోరథం; సమాఖ్య పాలనా విధానంపై తమ చర్చలు, వాదనలు, నిర్ణయాలు న్యాయస్థానాలకే పరిమితమవకూడదనేది న్యాయమూర్తుల, న్యాయవాదుల ఆకాంక్ష.

గాజా సుదూర సీమ కాదు, ఉక్రెయిన్ రష్యా సమస్య మాత్రమే కాదు. కశ్మీర్ సంక్షోభం కేవలం ఉగ్రవాద దుర్మార్గాల పర్యవసానమే కాదు. బతుకు పరుగుల్లో పడి మన చుట్టుపక్కల సంభవిస్తున్న విషాదాలను విస్మరిస్తున్నాం, దురదృష్టకర పరిణామాలను ఉపేక్షిస్తున్నాం. అసంఖ్యాక ప్రజల దురవస్థలకు మానవీయ సంవేదనలతో ప్రతిస్పందించడంలో మన అశక్తతను గాజా, ఉక్రెయిన్ యుద్ధాలు ఎత్తి చూపుతున్నాయి. మన ఆలోచనలు మానవతా సంస్పర్శతో సాగాలంటే మన స్థానిక నిమగ్నతలు, బాంధవ్యాలు కేవలం స్వీయ సామాజిక ప్రపంచానికి పరిమితం కాకూడదు. విశాలమైనవి, పరిపూర్ణమైనవిగా అవి వర్ధిల్లాలి.



• టి.ఎమ్. కృష్ణ
కర్ణాటక సంగీతవేత్త
(ది టెలిగ్రాఫ్)

పదోన్నతుల పైసా వసూల్

కార్పొరేషన్‌లో అధికార వైసీపీ నిర్వాకం

- డబ్బు కోసం లేని పోస్టులను సృష్టించే ప్రయత్నం
- పాత జీవో పేరు చెప్పి కమిషనర్‌ను ఏమార్చి..
- స్టాండింగ్ కమిటీలో పెట్టి.. ఆమోదించుకునే కుట్ర
- హెల్త్ అసిస్టెంట్ల పదోన్నతులంటూ హెల్త్ వర్కర్లకే గేలం
- రూ.లక్షల్లో వసూలు.. చేతి'వాటాలు'

దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే రీతిలో విజయవాడ కార్పొరేషన్‌లోని అధికార వైసీపీ ఆలోచిస్తోంది. అధికారం ఉన్న కొద్దిరోజుల్లో మామూళ్లు దండుకునే అవకాశాలను సృష్టించుకుంటోంది. ఇందుకోసం తాజాగా హెల్త్ అసిస్టెంట్ల పదోన్నతుల పేరుతో హెల్త్ వర్కర్ల నుంచి రూ.లక్షలు వసూలు చేసే కుట్రకు తెరతీసింది. ప్రభుత్వ ఉత్తర్వులు, నిబంధనలను పక్కన పెట్టి, కమిషనర్‌ను ఏమార్చి హెల్త్ అసిస్టెంట్ల పదోన్నతులకు అంగీకారం తీసుకున్నారు. కొద్దిరోజుల్లో స్టాండింగ్ కమిటీ ముందుంచి, ఆమోదం పొందేందుకు పావులు కదుపుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ కార్పొరేషన్‌లోని ప్రజారోగ్య శాఖలో ఎంతమంది ఉద్యోగులు పనిచేయాలన్న దానికి రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నిబంధనలు విధించింది. 2008లో హెల్త్ అసిస్టెంట్ల పదోన్నతులకు సంబంధించి ఇచ్చిన 780 జీవో ప్రకారం శానిటరీ మేస్త్రి ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ, బైపీసీ ఉత్తీర్ణులై ఉండాలి. అయితే, రెండేళ్ల తర్వాత ఆ జీవోను సవరించారు. 2010లో 218 జీవో ఇచ్చి, శానిటేషన్ టెక్నాలజీ (డిప్లొమా) కోర్సు చేసిన వారే శానిటరీ మేస్త్రిగా అర్హులని నిర్ణయించారు. అలాగే, లక్షమంది జనాభాకు ఒక హెల్త్ అసిస్టెంట్ ఉండాలని నిర్దేశించారు.



మిగతా 6లో..

నేడు విజయవాడ జగన్నాథస్వామి రథయాత్ర

- సితార జంక్షన్ నుంచి సీతమ్మ పాదాల వరకు.. 8



దుర్గమ్మ ఉత్సవమూర్తిని తీసుకెళ్తున్న ఈవో శీనానాయక్, ఆలయ సిబ్బంది

తొలిసారె తెస్తిమమ్మా..

- ఇంద్రకీలాద్రిపై ఆషాఢ మాసోత్సవాలు ప్రారంభం
- తొలిసారె సమర్పించిన ఈవో శీనానాయక్
- దేవస్థానం సిబ్బంది, కుటుంబాలతో కోలాహలం



ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ ఆషాఢ సారె మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకు ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రధాన ఆలయం నుంచి మహామండపం ఆరో అంతస్తులోకి ఊరేగింపుగా తీసుకొచ్చారు. మొదటి సారెను దేవస్థానం సిబ్బంది తరఫున ఈవో శీనానాయక్ దంపతులు, ఆలయ సిబ్బంది కుటుంబాలతో విచ్చేసి సమర్పించారు. తొలుత ప్రధాన ఆలయం నుంచి సంబరంగా మహామండపం వరకు వచ్చారు. అమ్మవారికి సారె నివేదన చేసి, భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ఎల్.దుర్గాప్రసాద్, ఉప ప్రధాన అర్చకులు కోట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. - ఇంద్రకీలాద్రి

యువత మేలుకో.. మత్తు మానుకో..





అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు శాఖ అధ్వర్యంలో గురువారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బందరు రోడ్డులో మెగా వాక్‌థాన్ నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొని డ్రగ్స్ మహమ్మారికి వ్యతిరేకంగా నినదించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర్‌బాబు పాల్గొన్నారు. 8


- విద్యార్థులే టార్గెట్‌గా నగరంలో మాఫియా

డ్రగ్స్.. కస్టడీ

ఎండీఎంఏ కేసులో బయటపడిన నిజాలు

- ఇప్పటికే ముగ్గురు నిందితుల అరెస్టు
- ఢిల్లీ-విజయవాడ డ్రగ్స్ సరఫరా చేసింది వీరే..
- నిందితులతో తరచూ మాట్లాడుతున్న 50 మంది
- అంతా కృష్ణా, గుంటూరు జిల్లాల విద్యార్థులే..
- విద్యార్థులు, తల్లిదండ్రులకు పోలీసుల పిలుపులు

మెథిలీన్ డైయాక్సీ ఎన్ మెథాఫెటమైన్ (ఎండీఎంఏ) డ్రగ్.. విద్యా నిలయాల్లోకి చేరిందా? ఇంజనీరింగ్, ఇతర కళాశాలల్లో విద్యార్థులు ఈ డ్రగ్‌ను వాడుతున్నారా? తల్లిదండ్రులిచ్చిన డబ్బును దీనికోసం వెచ్చిస్తున్నారా? అంటే అవుననే సమాధానమే వస్తుంది. ఢిల్లీ-విజయవాడ ఎండీఎంఏ డ్రగ్ కేసులో తవ్వేకొద్దీ కొత్త విషయాలు బయటకొస్తుండగా, తాజాగా కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని ప్రముఖ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల పేర్లు పోలీసుల చేతికి చిక్కాయి.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఢిల్లీ నుంచి విజయవాడకు ఎండీఎంఏ డ్రగ్‌ను తీసుకొచ్చిన కేసులో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన 50 మంది విద్యార్థుల పేర్లు బయటకొస్తున్నాయి. ఈ కేసులో మొత్తం ఐదుగురిని టాస్క్‌ఫోర్స్, పటమట పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కాగా, నిందితుల సెల్‌ఫోన్లను విశ్లేషించగా, విద్యార్థుల జాతకాలు బయటపడ్డాయి. ఈ విద్యార్థులంతా వివిధ కళాశాలల్లో చదువుతున్నట్టు పోలీసులు గుర్తించారు. ఇప్పుడు వారందరినీ టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి పిలిపించాలని నిర్ణయించారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులనూ పిలిచి కౌన్సెలింగ్ ఇవ్వాలని భావిస్తున్నారు.

ఆ ముగ్గురే..

ఢిల్లీ నుంచి కొరియర్ ద్వారా హైదరాబాద్‌కు ఈ డ్రగ్‌ను రప్పించుకుని, అక్కడి నుంచి నగరానికి తీసుకొస్తున్న తిరుమలశెట్టి జీవన్‌కుమార్, బొంతు నితీష్‌కుమార్, తూలిమెల్లి తరుణ్‌ప్రసాద్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వారికి ఢిల్లీలోని నోయిడాకు చెందిన రింకీ ఈ సరుకును పార్శిల్ చేస్తున్నాడని నిర్ధారణైంది. ఈ ముగ్గురు నిందితుల్లో జీవన్‌కుమార్ ఎండీఎంఏను రప్పించడంలో కీలకంగా వ్యవహరించాడు. పామర్రుకు చెందిన మనోహర్ అనే యువకుడు ఈ ఎండీఎంఏ రుచిని తనకు చూపించినట్టు జీవన్‌కుమార్ అంగీకరించాడు. దీంతో మనోహర్‌తో పాటు మరో నిందితుడిని కొద్దిరోజుల క్రితం పటమట పోలీసులు అరెస్టు చేశారు.

విద్యార్థులే టార్గెట్‌గా..

విద్యార్థులే టార్గెట్‌గా జీవన్‌కుమార్ ఎండీఎంఏ డ్రగ్‌ను విక్రయించినట్టు దర్యాప్తులో తేలింది. తొలివిడతలో అరెస్టైన ముగ్గురు నిందితుల్లో తరుణ్‌ప్రసాద్ పెనమలూరు మండలం గంగూరులో ఉన్న ఓ ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్నాడు. ఈ ముగ్గురు నిందితుల సెల్‌ఫోన్లను పోలీసులు ఫోరెన్సిక్ ల్యాబ్‌లో విశ్లేషించారు. వారి సీడీఆర్ (కాల్ డేటా రికార్డు)ను పరిశీలించారు. ఈ ముగ్గురికి తరచూ 50 నెంబర్ల నుంచి ఫోన్లు రావడం, వెళ్లడం జరిగినట్టు గుర్తించారు. ఈ 50 నెంబర్లు ఎవరి పేర్ల మీద ఉన్నాయో పోలీసులు కూపీ లాగారు. వారంతా వివిధ కళాశాల్లో చదువుతున్నారని తేలింది. అందులో కొంతమంది ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలల్లో, మరికొంతమంది ప్రైవేట్ డిగ్రీ కళాశాల్లో చదువుతున్నట్టు గుర్తించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆ జాబితాను సిద్ధం చేశారు. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి పిలిచి కౌన్సెలింగ్ చేయాలని భావిస్తున్నారు. ఈ విద్యార్థులంతా ఏడాదిగా ఈ ముగ్గురు నిందితులతో సంభాషిస్తున్నట్టు సమాచారం. తల్లిదండ్రులు ఇచ్చే రూ.100, రూ.200తో ఈ ఎండీఎంఏ కొంటున్నట్టు పోలీసులు గుర్తించారు. కాగా, ఆ విద్యార్థులంతా ఏయే కళాశాలల్లో చదువుతున్నారో తెలుసుకుని వాటి యాజమాన్యాలకు పోలీసులు నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది.

పలు రైళ్ల రద్దు

ట్రాక్ పనుల కారణంగానే..

రైల్వేస్టేషన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ మధ్య రైల్వేలో ట్రాక్ నిర్వహణ పనుల కారణంగా విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని సూళ్లూరుపేట-నెల్లూరు మధ్య నడిచే 66035, 66036 నెంబరు రైళ్లను ఈనెల 28, 29 తేదీల్లో రద్దు చేసినట్లు విజయవాడ డివిజన్ పీఆర్వో నుస్రత్ ఎం.మండ్రూపకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, తాడి-దువ్వాడ సెక్షన్ల మధ్య ట్రాక్ పనుల కారణంగా పలు రైళ్లను ఆగస్టు 26, 28, 30 తేదీల్లో రద్దు చేసినట్లు తెలిపారు. రాజమండ్రి-విశాఖపట్నం (67285), కాకినాడ పోర్టు-విశాఖపట్నం (17267), విశాఖపట్నం-కాకినాడ పోర్టు (17268), గుంటూరు-విశాఖపట్నం (22876), విశాఖపట్నం-గుంటూరు (22875), విజయవాడ-విశాఖపట్నం (12718), విశాఖపట్నం-విజయవాడ (12717) రైళ్లు రద్దయ్యాయి.



నగరాన జోరువాన

నగరంలో గురువారం రాత్రి జోరువాన కురిసింది. ఉదయం నుంచి వాతావరణం చల్లగానే ఉన్నప్పటికీ సాయంత్రం కురిసిన వర్షంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

Advika trading company

'అద్విక' ఆశల మోసం

- 1,200 మంది నుంచి రూ.300 కోట్లు వసూలు 6
- రూ.లక్షకు రూ.6 వేలు వడ్డీ అని ప్రచారం
- సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఫిర్యాదుతో వెలుగులోకి..
- రెండేళ్లుగా సాగుతున్న వసూళ్ల వ్యవహారం
- మాచవరం పీఎస్‌లో కేసు నమోదు

లెక్కలేకుండా..

సిద్ధార్థ మెడికల్ కాలేజీలో నిధుల గోల్‌మాల్

దశాబ్దకాలంగా సిద్ధార్థ మెడికల్ కాలేజీకి ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఇచ్చిన నిధులు దుర్వినియోగానికి గురైనట్టు ఆరోపణలు వస్తున్నాయి. డీఎంఈ కార్యాలయంలోని ఓ అధికారి అండతో సిద్ధార్థ మెడికల్ కాలేజీలోని ఉద్యోగులు కొందరు భారీగా ఈ నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్టు తెలుస్తోంది. దాదాపు దశాబ్దకాలంగా ఖర్చులకు సంబంధించిన వివరాలు ఇవ్వట్లేదని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ అధికారులు.. సిద్ధార్థ కాలేజీ యాజమాన్యానికి నోటీసులు ఇవ్వటంతో ఈ వ్యవహారం బయటపడింది.

- ఎన్టీఆర్ యూనివర్సిటీ నుంచి ఇచ్చిన డబ్బుకు లెక్కల్లేవ్..!
- 2013-2020 వరకు గోల్‌మాల్ జరిగినట్టు ఆరోపణలు
- 2020-2025 వరకు ఇచ్చిన నిధుల్లోనూ అవకతవకలు
- లెక్కలు అప్పగించాలంటూ ఎన్టీఆర్ వర్సిటీ నోటీసులు
- డీఎంఈ కార్యాలయంలోని అధికారి అండతోనేనా?



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలోని ఎంబీబీఎస్, నర్సింగ్, పారామెడికల్ పరీక్షల నిర్వహణకు సంబంధించి ప్రతి కాలేజీకి నిధులు కేటాయిస్తారు. ఇలా సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ఇన్విజిలేటర్లకు ఇచ్చే సొమ్ములో భారీగా అవకతవకలు జరిగినట్టు వెలుగుచూసింది. దాదాపు రూ.అరకోటి మేర గోల్‌మాల్ జరిగినట్టుగా ఆరోపణలు వస్తున్నాయి. ఈ తతంగం 2013 నుంచి ఇప్పటివరకు జరిగినట్టు తెలుస్తోంది. ఇటీవల బదిలీపై వెళ్లిన ఓ అధికారి లెక్కలు అప్పగించటంతో ఈ బాగోతాలన్నీ బయటకు వస్తున్నాయి.

గోల్‌మాల్ ఎలా..?

2013 నుంచి 2020 వరకు సుమారు రూ.కోటి నిధులు అందించామని, ఇప్పటి వరకు వాటికి లెక్కలు చెప్పలేదని ఇటీవల ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ

మిగతా 6లో..

ఎన్టీఆర్ వర్సిటీ పాత్ర ఏంటి?

ఈ వ్యవహారంలో ఎన్టీఆర్ వర్సిటీ యాజమాన్యం పాత్రపైనా అనుమానాలు కలుగుతున్నాయి. ఒకటి, రెండు బిల్లుల వ్యయ నివేదికను హెల్త్ యూనివర్సిటీకి సమర్పించాలి. అలా చేయకపోతే.. మూడో బిల్లును విడుదల చేయరు. కానీ, ఎలాంటి వ్యయ నివేదికలు సమర్పించకపోయినా ఏళ్ల తరబడి డబ్బు హెల్త్ వర్సిటీ నుంచి విడుదలవుతూనే ఉంది. దీంతో ఈ వ్యవహారంలో హెల్త్ యూనివర్సిటీ అధికారుల హస్తం ఉందేమోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కనకదుర్గమ్మకు ఆషాఢం సారె సమర్పణ


ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పిస్తున్న భక్తులు

ఇంద్రకీలాద్రి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను ఇంటి ఆడపడుచుగా భావించి ఆషాఢమాసం సందర్భంగా భక్తులు ఆషాఢసారె సమర్పించడం ఆనవాయితీగా వస్తున్నది. శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఆషాఢ మాసం ప్రారంభం సందర్భంగా గురువారం పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చి మహామండపం 6వ అంతస్తులో సారె సంభారాలను అమ్మవారికి సమర్పించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు. ఈ సందర్భంగా అర్చకులు భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ చేసి, సామూహిక ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఈవో శీనానాయక్ మాట్లాడుతూ, ఆషాఢమాస సారె సమర్పణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని, మహిళలు పెద్ద సంఖ్యలో సారె సమర్పిస్తున్నారని తెలిపారు. తెలుగు రాష్ట్రాల నుంచి సారె సమర్పణకు తరలి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. జులై 8, 9, 10 మూడురోజుల పాటు శాకంబరీ ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఈవో తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు అందుకోవాలని కోరారు.

దుర్గమ్మకు హోంమంత్రి ఆషాఢ సారె

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు గురువారం హోంమంత్రి వంగలపూడి అనిత ఆషాఢ సారె సమర్పించారు. ఈవో శీనానాయక్, అర్చకులు ఆమెకు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం అమ్మవారికి సారె సమర్పించి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రికి ఈవో,



అర్చకులు లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

దుర్గగుడిలో వారాహి నవరాత్రులు

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ సన్నిధిలో గురువారం వారాహి నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం నుంచి ప్రారంభమైన నవరాత్రులు జూలై 4వ తేదీవరకు కొనసాగుతాయి. తొమ్మిది రోజులు పాటు జరిగే గుప్త నవరాత్రుల ప్రారంభ పూజలో ఈవో శీనానాయక్ దంపతులు పాల్గొన్నారు. ఉదయం విఘ్నేశ్వరపూజ, రుత్విక్ వరుణ, పుణ్యాహవచనము, అఖండ దీపారాధన, అంకురార్పణ కార్యక్రమాలు జరిగాయి. ప్రధాన అర్చకులు ఎల్.దుర్గాప్రసాద్, ఉప ప్రధాన అర్చకులు కోట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


వారాహి నవరాత్రులు ప్రారంభిస్తున్న ఈవో


ఏఎంసీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న రేగళ్ల లక్ష్మి అనిత

కూటమి ప్రభుత్వంలో
మార్కెట్ యార్డులకు మహర్దశ

» తిరువూరు ఏఎంసీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

తిరువూరు/గంపలగూడెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో మార్కెట్ యార్డులకు మహర్ధశ పట్టనుందని, ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. పంజాబ్ రాష్ట్రంలో మార్కెట్ యార్డుల ద్వారా సిమెంట్ రోడ్ల నిర్మాణం జరుగుతుందని, ఈ విధానం రాష్ట్రంలోనూ ప్రవేశపెట్టాలనే యోచన చేస్తున్నారని ఎంపీ చెప్పారు. గురువారం మండలంలోని లక్ష్మీపురంలో ఓ ఫంక్షన్‌హాల్‌లో తిరువూరు ఏఎంసీ చైర్మన్‌గా రేగళ్ల లక్ష్మిఅనిత, పలువురు డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఎంపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, రైతులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, మార్కెట్ యార్డును పురోగతిలో నడిపించాలని పాలకవర్గానికి ఆయన సూచించారు. మరో రెండునెలల్లో గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టలేరు బ్రిడ్జి నిర్మాణానికి అంకురార్పణ జరగబోతుందన్నారు. ఈ ఏడాది చివరి నాటికి నిరుద్యోగ భృతి మంత్రి లోకేశ్ ఇవ్వనున్నట్టు తెలిపారు. వచ్చే నాలుగునెలల్లో తిరువూరు, నందిగామ నియోజకర్గాలలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటిస్తారన్నారు. తిరువూరులో టీడీపీకి పూర్వ వైభవం రావటానికి కారణం పార్టీ కార్యకర్తలు, నాయకులే కారణం అని, రాజకీయ జీవితం మొదలయ్యింది తిరువూరులోనే అని, అందుకే ఈ ప్రాంతమంటే తనకు ఎంతో ఇష్టం అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘనవిజయం సాధిస్తారన్నారు. సభలో ఎన్టీఆర్‌జిల్లా టీడీపీ అధ్యక్షుడు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్, ఆర్గానిక్ ప్రొడక్స్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ శావల దేవదత్, ఎన్టీఆర్‌జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు, మాదిగ కార్పొరేషన్ డెరెక్టర్ వాసం మునియ్య, మాజీ చైర్మన్లు తాళ్లూరి రామారావు, సీతారామప్రసాద్, గంపలగూడెం టీడీపీ అధ్యక్షుడు రేగళ్ల వీరారెడ్డి, బీజేపీ నాయకులు తదితరులు ప్రసంగించారు.


సరళకుమారిని సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

ఇంటర్ విద్యాశాఖ అధికారిణికి సత్కారం

మైలవరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేములూరి వెంకటరత్నం జూనియర్ ప్రభుత్వకళాశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న సొంగా సరళకుమారిని ప్రభుత్వం కృష్ణా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారిణిగా నియమించింది. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక, సిబ్బంది గురువారం సరళకుమారిని ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.

భూసేకరణ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలి

» రైతుల్లో అపోహలను తొలగించాలి : నారాయణ

గుంటూరు(తూర్పు), జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాజధాని అభివృద్ధికి మరో 40 వేల ఎకరాల భూమిని సేకరించాలన్న నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునఃసమీక్షించుకోవాలి అని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ సూచించారు. గుంటూరులో గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో 33 వేల ఎకరాలను సేకరించిన ప్రభుత్వం ఇప్పుడు మరింత భూమి కావాలనడంపై రైతుల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భూములు సేకరించే ముందు ఇప్పటికే సేకరించిన భూముల్లో నిర్మాణాలను పూర్తిచేసి చూపిస్తే రైతులు నమ్ముతారు. ఇంత పెద్ద మొత్తంలో పంట భూములను సేకరిస్తే భవిష్యత్తులో ఆహార కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. అందుకే భూసేకరణ అంశాన్ని ప్రభుత్వం పునరాలోచించాలి. బనకచర్ల ప్రాజెక్టు విషయాన్ని తెలుగు రాష్ట్రాల సీఎంలు అనవసరంగా రాజకీయ వివాదంగా మార్చడం సరికాదు. సముద్రంలోకి వెళ్తున్న నీటిని వినియోగించుకునే ప్రాజెక్టు మంచిదే. హంద్రీనీవా, వెలిగొండ ఇతర ప్రాజెక్టులు పూర్తి గాకుండానే కొత్త ప్రాజెక్టుకు నిధులు కేటాయించడం సరైనది కాదు' అని నారాయణ అన్నారు. సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, కోట మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

5న రాష్ట్రవ్యాప్త నిరసనలు: సీపీఐ

అమరావతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు భారాలను వ్యతిరేకిస్తూ వచ్చే నెల 5న రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం పిలుపునిచ్చారు. ' తాము అధికారంలోకి వస్తే విద్యుత్తు చార్జీలు తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేస్తామని సీఎం చంద్రబాబు గత ఎన్నికల్లో ప్రజలకు హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది కాలంలోనే 4సార్లు విద్యుత్తు చార్జీలు పెంచి రూ.15,485 కోట్ల ఆర్థిక భారాన్ని వినియోగదారులపై మోపారు.' అంటూ రామకృష్ణ ధ్వజమెత్తారు.

అప్రకటిత ఎమర్జెన్సీ కోరల్లో ప్రజాస్వామ్యం

» మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

మచిలీపట్నం టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : అప్రకటిత ఎమర్జెన్సీ కోరల్లో నేడు భారతదేశం ఉందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. మహాత్మా జ్యోతీరావుపూలే విజ్ఞాన కేంద్రంలో గురువారం 'ఎమర్జెన్సీ నాడు - నేడు' అంశంపై జరిగిన సదస్సులో లక్ష్మణరావు మాట్లాడారు. 50 ఏళ్ల క్రితం దేశంలో విధించిన ఎమర్జెన్సీ అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ నియంతృత్వ పోకడలకు అద్దంపట్టిందన్నారు. ప్రస్తుతం భారతదేశంలో ఎమర్జెన్సీ కాలం నాటి నిరంకుశ విధానాలు కనబడుతున్నాయన్నారు. కార్పొరేట్ ప్రయోజనాలకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ, మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండతో ప్రజలమధ్య తెగలపేరుతో చిచ్చుపెడుతున్నారన్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆదుకోండి

» మంత్రి పయ్యావులకు ఉద్యోగుల సంఘం నేతల వినతి


మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఔట్‌సోర్సింగ్, ఉద్యోగ సంఘాల నాయకులు

కలెక్టరేట్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : సెర్ప్, మెప్మా ఉద్యోగుల మాదిరిగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని మంత్రి పయ్యావుల కేశవ్‌ను గురువారం ఆయన కార్యాలయంలో ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సుమన్, ఇ.మధుబాబు, పసుపులేటి శివ సైదారావులు కలిసి విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా మంత్రి వర్గ ఉపసంఘం నియమించినందుకు కూటమి ప్రభుత్వానికి ఏపీ జేఏసీ అమరావతి పక్షాన ధన్యవాదాలు తెలిపారు. గతంలో ప్రైవేట్ ఏజెన్సీల వలన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అనేక విధాలుగా నష్టపోయారని, జీతాలు కూడా సక్రమంగా చెల్లించకపోవడమే కాకుండా ఉద్యోగులు దాచుకొన్న డబ్బులు కూడా ఏజెన్సీలు చెల్లించకుండా ఇబ్బందులు పెట్టిన సంఘటనలు అనేకం ఉన్నాయని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను సీఎఫ్ఎంఎస్‌లో ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తూ వారికి, వారి కుటుంబానికి అందాల్సిన సంక్షేమ పథకాలన్నీ రద్దు పరిచారని తెలిపారు. దీనివలన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. అంగన్వాడీ వర్కర్స్ గ్రామ రెవెన్యూ సహాయకులు, ఆశా వర్కర్లు తదితరులకు ప్రభుత్వం సర్వీసు రూల్‌ను ఏర్పాటు చేసిన విధంగానే, ప్రభుత్వ శాఖల్లో ఫుల్‌టైం పనిచేసే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ సర్వీస్ రూల్స్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. మంత్రికి వినతిపత్రం సమర్పించిన వారిలో మున్సిపల్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మసెట్టి నాగేశ్వరరావు, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్‌వీ రాజేష్, ఆర్‌డబ్ల్యుఎస్ అధ్యక్షుడు ఎ.కుమార్‌రెడ్డి, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రామ్‌భద్ర, సచివాలయం ఔట్‌సోర్సింగ్ మహిళా ఉద్యోగినులు తదితరులు పాల్గొన్నారు.

అప్రకటిత ఎమర్జెన్సీ కోరల్లో
నేడు ప్రజాస్వామ్యం

» మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు



మచిలీపట్నం టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : అప్రకటిత ఎమర్జెన్సీ కోరల్లో నేడు భారతదేశం ఉందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. మహాత్మా జ్యోతీరావుపూలే విజ్ఞాన కేంద్రంలో గురువారం 'ఎమర్జెన్సీ నాడు - నేడు' అంశంపై జరిగిన సదస్సులో లక్ష్మణరావు మాట్లాడారు. 50 ఏళ్ల క్రితం దేశంలో విధించిన ఎమర్జెన్సీ అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ నియంతృత్వ పోకడలకు అద్దంపట్టిందన్నారు. ప్రస్తుతం భారతదేశంలో ఎమర్జెన్సీ కాలం నాటి నిరంకుశ విధానాలు కనబడుతున్నాయన్నారు. కార్పొరేట్ ప్రయోజనాలకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ, మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండతో ప్రజల మధ్య తెగలపేరుతో చిచ్చుపెడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.సుబ్రహ్మణ్యం, కొడాలిశర్మ, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘ నాయకుడు జి. కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అద్విక ఆశల మోసం!

» 1200 మంది నుంచి రూ.300 కోట్లు వసూలు
» రూ.లక్షకు రూ.6వేలు వడ్డీ అని ప్రచారం
» సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన మోసం
» రెండేళ్లుగా సాగుతున్న వసూళ్ల వ్యవహారం
» మాచవరం పీఎస్‌లో కేసు నమోదు

విజయవాడ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : నూటికి రూపాయి వడ్డీ చొప్పున రూ.లక్షను అప్పు ఇస్తే నెలకు రూ.1000 వస్తుంది. అదే అర్థరూపాయి చొప్పున ఇస్తే రూ.500 వస్తుంది. అదే వడ్డీ నెలకు రూ.6 వేలు వస్తుంటే ఎవరైనా ఆగుతారా? విజయవాడలో సరిగ్గా అదే చేసింది అద్విక ట్రేడింగ్ కంపెనీ. తమ సంస్థలో రూ.లక్ష పెట్టుబడిగా పెడితే నెలకు రూ.6వేలను వడ్డీగా చెల్లిస్తామని ప్రజల నుంచి కోట్లాది రూపాయలను వసూలు చేసింది. ఇలా అధికవడ్డీకి ఆశ పడి లక్షలాది రూపాయలను పెట్టుబడిగా పెట్టిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నిలువునా మనిగిపోయాడు. చివరకు అతడు పోలీసులను ఆశ్రయించడంతో అధిక వడ్డీల పేరుతో అద్విక చేసిన అసలు మోసం బయటకు వచ్చింది. విజయవాడ ఎన్టీఆర్ కాలనీలోని రోడ్డు నంబరు 2లో తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్య అనే వ్యక్తి అద్విక ట్రేడింగ్ కంపెనీని మరికొంతమందితో కలిసి ఏర్పాటు చేశాడు. తమ సంస్థలో రూ.లక్ష పెట్టుబడి పెడితే వడ్డీగా నెలకు రూ.6వేలు చెల్లిస్తామని ప్రచారం చేశాడు. దీనితో ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం శన్నవరం గ్రామానికి చెందిన వీరమల్లు గణేష్ చంద్రబాబు అనే వ్యక్తి పెట్టుబడులు పెట్టారు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న గణేష్‌కు తన బావ మిద్దే ప్రవీణ్ ద్వారా ఆదిత్య పరిచయమయ్యాడు. అతడు తనతోపాటు భార్య పేరు మీద గడచిన ఏడాది జనవరి నుంచి లక్షలాది రూపాయలను పెట్టుబడిగా పెట్టాడు. ఇద్దరి పేరు మీద సుమారుగా రూ.50 లక్షల వరకు అద్వికకు అందజేశాడు. ఈ ఏడాది జనవరి వరకు వడ్డీ రూపంలో రూ.13 లక్షలను ఆదిత్య చెల్లించాడు. ఫిబ్రవరి నుంచి చెల్లింపులు ఆపేశాడు. దీనిపై గణేష్ నిత్యం అద్విక కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. రేపు మాపు అంటూ వాయిదాలు వేస్తున్నారు తప్ప చెల్లింపులు మాత్రం చేయడం లేదు. దీనితో గణేష్ మాచవరం పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. ఆదిత్య అండ్ గ్యాంగ్ మొత్తం 1200 మంది నుంచి రూ.300 కోట్ల వరకు ఇలా పెట్టుబడులు సేకరించినట్టు పోలీసులు నిర్ధారించారు. ఆదిత్యను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఆదిత్యతోపాటు మరో వ్యక్తి పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం.

ప్రయోగాత్మకంగా మ్యాజిక్ డ్రెయిన్

» ఉపాధి డైరెక్టర్‌తో కలిసి నిర్మాణ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే తాతయ్య


డ్రెయిన్ల వివరాలను ఎమ్మెల్యేకు వివరిస్తున్న ఉపాధి డైరెక్టర్ షణ్ముఖ్

నందిగామ రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడా లేని విధంగా మండలంలోని సోమవరం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని మ్యాజిక్ డ్రెయిన్‌లు నిర్మించటం అభినందనీయమని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పేర్కొన్నారు. గ్రామంలో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణ పనులను పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, జిల్లాలోని పీడీలతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిమెంట్ డ్రెయిన్ల నిర్మాణానికి రూ. లక్షల వ్యయం అవుతుందన్నారు. మ్యాజిక్ డ్రెయిన్ మూడు దశల్లో 100 మీటర్లకు రూ.90 వేల నుంచి రూ. లక్ష వరకు ఖర్చవుతుందని, అంతే కాకుండా ప్రతి 50 మీటర్లుకు ఇంకుడు గుంత నిర్మాణం జరుగుతుందన్నారు. గ్రామంలో 1000 మీటర్ల మేర మ్యాజిక్ డ్రైన్‌లు నిర్మిస్తున్నట్టు తెలిపారు. నీటి నిల్వ ఉండదని, దుర్వాసన కూడా రాదని చెప్పారు. ఈ పైలెట్ ప్రాజెక్టు విజయవంతమైతే రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టేందుకు ప్రభుత్వం ప్రతిపాదన చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముక్, అడిషనల్ కమిషనర్ శివప్రసాద్, జాయింట్ కమిషనర్ సునీత, చీఫ్ కంట్రోల్ ఆఫీసర్ గోపీచంద్, డ్వామా పీడీ రాము, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపీవో శరత్ బాబు, నాయకులు గురుప్రసాద్, పీడీలు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనులు వేగవంతం చేయాలి : జేసీ


మ్యాప్ పరిశీలిస్తున్న జేసీ

బెంజ్‌సర్కిల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి విస్తరణ పనులను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా అధికారులను ఆదేశించారు. గురువారం ఖమ్మం-విజయవాడ గ్రీన్‌ఫిల్డ్ జాతీయ రహదారి ఎన్‌హెచ్-165జి విస్తరణ పనులను అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. విజయవాడరూరల్ రాయనపాడు,పైడూరుపాడు, జక్కంపూడి గ్రామాల్లో సేకరించిన ప్రభుత్వ భూములకు సంబంధించి ఎలివేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జేసీ వెంట రూరల్ తహసీల్దార్ బి.సుగుణ, అధికారులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం

» మంత్రి కొల్లు రవీంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మాదకద్రవ్యాలకు యువతను దూరంగా ఉంచేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అంతర్జాతీయ గంజాయి, మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం, నషాముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కోర్టు సెంటర్ నుంచి జిల్లా పరిషత్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య, కలెక్టర్ డీకే బాలాజీ ప్రారంభించారు. ర్యాలీలో ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ ఆర్.గంగాధరరావు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, డీఆర్వో చంద్రశేఖరరావు, మోటమర్రి బాబాప్రసాద్, ఎక్సైజ్ అధికారులు, రెడ్‌క్రాస్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కళాశాల విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, గంజాయి క్రయ, విక్రయాలపై ఎక్సైజ్, పోలీసు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, యువత అలవాట్ల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. డీఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ, గంజాయి వాడకం వల్ల అనర్థాలపై కళాశాలలు, విద్యాసంస్థల్లో అవగాహనా సదస్సులు నిర్వహించాలన్నారు. బండి రామకృష్ణ మాట్లాడుతూ, గంజాయి మత్తులో యువత నిర్వీర్యమైపోతుందని, కౌన్సెలింగ్ ద్వారా వారిని సన్మార్గం వైపు మరల్చాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అందరితో ప్రతిజ్ఞ చేయించారు.

యోగాంధ్ర విజయవంతంపై కలెక్టర్‌కు అభినందన

మచిలీపట్నం టౌన్ : జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినందుకు కలెక్టర్ బాలాజీని మంత్రి రవీంద్ర అభినందించారు. జిల్లాలో యోగా కార్యక్రమాలు ప్రజలను చైతన్యపరిచాయన్నారు. నాగాయలంకలో నిర్వహించిన జలయోగ కార్యక్రమానికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డు దక్కిందన్నారు. కూచిపూడిలో యోగసాధకుల కార్యక్రమానికి అంతర్జాతీయ అవార్డు వచ్చిందన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మోకాళ్లపై నిరసన

ధర్నాచౌక్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ సర్వేయర్లు ధర్నాచౌక్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం రెండవ రోజు కొనసాగింది. మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మధుబాబు మాట్లాడారు. ప్రభుత్వం గ్రామ సర్వేయర్ల సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడేళ్లుగా తమ సమస్యలపై అధికారులను అనేకసార్లు కలిసినా ఫలితం లేదని వాపోయారు. గ్రామ సర్వేయర్లకు కనీస విద్యార్హతగా డిప్లొమాను గుర్తించి, టెక్నికల్ జాబ్‌లకు తగిన పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీనియారిటీ జాబితాలను అన్ని జిల్లాల్లో త్వరగా విడుదల చేయాలని, అర్హులైన వారికి పదోన్నతుల కల్పనకు సర్వీస్‌రూల్స్‌లో మార్పులు చేయాలని కోరారు. పలువురు అసోసియేషన్ మహిళా ప్రతినిధులు మాట్లాడుతూ బదిలీల ప్రక్రియలో జీవో 5లో మార్పులు చేసి అంతర్‌జిల్లాల బదిలీలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పదోన్నతుల పైసా వసూల్

(5వ పేజీ తరువాయి)

దీనిప్రకారం చూస్తే ప్రస్తుత విజయవాడ జనాభా 15.6 లక్షలు ఉండగా, 16 మంది హెల్త్ అసిస్టెంట్లకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం విజయవాడలో 16 మంది హెల్త్ అసిస్టెంట్లు ఉన్నారు. కాబట్టి అదనంగా హెల్త్ అసిస్టెంట్లను తీసుకోవాల్సిన అవసరం లేదు. కానీ, కాసుల కోసం అధికార పక్షం హెల్త్ అసిస్టెంట్లు అవసరమన్న వాదనను తెరపైకి తెచ్చింది. హెల్త్ వర్కర్లుగా పనిచేస్తున్న వారికి హెల్త్ అసిస్టెంట్లుగా పదోన్నతులు ఇవ్వటం ద్వారా అదనంగా మరో ఐదుగురిని నియమించాలని కుట్ర పన్నింది. జనాభా ప్రకారం 16 పోస్టులను 21కు చేర్చాలని నిర్ణయించింది. ఎడాపెడా పోస్టులు తీసుకుంటే అనుమానం వస్తుందన్న ఉద్దేశంతో తొలుత ఐదుగురికి అవకాశం కల్పించాలని నిర్ణయించారు. కొందరు హెల్త్ వర్కర్లతో బేరాలు సాగించారు. పదోన్నతి కల్పిస్తామని ఒక్కొక్కరి నుంచి రూ.5 లక్షల చొప్పున మొత్తం ఆరుగురు హెల్త్ వర్కర్ల దగ్గర రూ.30 లక్షలకు బేరం పెట్టినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈ డబ్బును అధికారపక్షంలోని బిగ్‌బాస్‌తో పాటు స్టాండింగ్ కమిటీ, ప్రజారోగ్యశాఖలోని ఓ అధికారికి వాటాలు పంచేలా ఒప్పందాలు జరిగినట్టు తెలుస్తోంది.

పాత జీవో ప్రకారమే స్కెచ్

సవరించిన కొత్త జీవో ప్రకారమే ఎలాంటి నిర్ణయమైనా తీసుకోవాల్సి ఉండగా, కార్పొరేషన్‌లోని అధికారపక్షం మాత్రం పాత 780 జీవోను తెరపైకి తెచ్చింది. దీని ప్రకారమే హెల్త్ అసిస్టెంట్ల పదోన్నతులకు రంగం సిద్ధం చేసింది. కొత్త జీవో ప్రకారం శానిటేషన్ టెక్నాలజీలో డిప్లొమా విద్యార్హత ఉండాలి. అలాకాకుండా, పాత జీవో ప్రకారం ఇంటర్ విద్యార్హత ఉన్న వారిని తీసుకోవాలని నిర్ణయించింది. కొత్త జీవో అయితే కొత్తగా ఎవరినీ తీసుకోవటానికి అవకాశం ఉండదు కాబట్టి, పాత జీవోను తెలివిగా అమలు చేశారు.

లెక్కలేకుండా..

(5వ పేజీ తరువాయి)

నుంచి సిద్ధార్థ మెడికల్ కాలేజీ యాజమాన్యానికి తాఖీదులు అందాయి. ఈ నేపథ్యంలో నెలలో అకౌంట్ల లావాదేవీలు తేల్చాలని సిద్ధార్థ మెడికల్ కాలేజీ యాజమాన్యం సంబంధిత ఉద్యోగిని ఆదేశించింది. ఆ ఉద్యోగి లెక్కలు అప్పగించి వెళ్లిపోయారు. ఈ నివేదిక ద్వారా పదేళ్లుగా ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ ఇచ్చిన డబ్బుకు ఇప్పటి వరకు ఎలాంటి వ్యయ నివేదికలను సమర్పించలేదని తెలిసింది.

ఆ సీనియర్ అసిస్టెంట్ ఎవరు?

సిద్ధార్థ మెడికల్ కాలేజీలో గతంలో ఒక సీనియర్ అసిస్టెంట్ యూనివర్శిటీ నుంచి వచ్చిన నిధులను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలు వచ్చాయి. నిధుల ఖర్చుకు సంబంధించి ఎలాంటి స్టేట్‌మెంట్లు ఇవ్వకపోవటంతో ఆ సీనియర్ అసిస్టెంట్‌కు చార్జిమెమో ఇచ్చారు. ఆ ఉద్యోగిపై మే నెలలో విచారణ కూడా జరిపారు. ఆ తర్వాత ఇన్‌చార్జిగా వచ్చిన వ్యక్తి కూడా నిధుల వినియోగానికి సంబంధించిన లెక్కలు అప్పగించనట్టు తెలుస్తోంది. కాలేజీ ఎగ్జామినేషన్ అకౌంట్‌కు తన సొంత అకౌంట్ నుంచి చలానా రూపంలో ఓ ఉద్యోగి డబ్బు కట్టిన ఉదంతం తాజాగా వెలుగుచూసింది. అలాగే, దారి మళ్లించిన కొంత డబ్బును కూడా ఇటీవల తిరిగి చెల్లించినట్టుగా తెలుస్తోంది. వైద్యులు, సిబ్బందికి పేమెంట్లు ఇవ్వకుండా ఇచ్చినట్టు వారి పాత సంతకాలను ఫోర్జరీ చేయటంతో పాటు రికార్డులను ట్యాంపరింగ్ చేసినట్టు కూడా ఆరోపణలు వస్తున్నాయి.

2020-2025 చెల్లింపుల్లోనూ అవకతవకలు

2020-2025 వరకు జరిగిన చెల్లింపుల్లో కూడా భారీ అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈ నిధులకు సంబంధించి కూడా పేమెంట్లు ఇచ్చినట్టుగా దొంగ సంతకాలతో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీకి స్టేట్‌మెంట్లు పంపినట్టు తెలుస్తోంది. ఈ నిధుల దుర్వినియోగం వెనుక డీఎంఈ కార్యాలయంలో ఉన్న ఓ అధికారి ఉన్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. అలాగే, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ, సిద్దార్థ మెడికల్ కాలేజీ అధికారుల పాత్రపైనా ఆరోపణలు గుప్పుమంటున్నాయి. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దీనిపై సమగ్ర విచారణకు ఆదేశించాల్సిన అవసరం ఉంది.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

భారతీనగర్ : రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలో విద్యుత్‌లైన్లు మరమ్మతుల వల్ల శుక్రవారం ఉదయం 9 నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ ఈఈ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. న్యూ పిఅండ్‌టీ కాలనీ, సాయిబాబా టెంపుల్ ఏరియా, చందమామ హాస్పిటల్ ఏరియా, మెక్డోనాల్డ్ ఏరియా, శ్రీనగర్ ఏరియాల్లో కరెంట్ ఉండదని తెలిపారు.







శాప్ కార్యాలయంలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న చైర్మన్ రవినాయుడు, టెన్నిస్ ప్లేయర్ సాకేత్ తదితరులు, నలంద కాలేజీలో, మారిస్ స్టెల్లా విద్యార్థినుల ర్యాలీ

సే నో టు డ్రగ్స్

- అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా భారీ ర్యాలీ, మానవహారాలు
- మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేసిన విద్యార్థులు

లబ్బీపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలను సంపూర్ణంగా నిర్మూలించగలిగితేనే రాష్ట్రాభి వృద్ధి, దేశాభివృద్ధి సాధ్యపడుతుందని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. శాప్ కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల నియంత్రణ దినోత్సవాన్ని శాప్ చైర్మన్ రవినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ కారణంగా యువత భవిష్యత్తు అంధకారమవుతుందని, వారి కుటుంబాలు కూడా విచ్ఛిన్నం అవుతున్నాయని తెలిపారు. క్రీడాకారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి డ్రగ్స్ వినియోగంపై కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ ప్రచారం చేయాలని, స్పోర్ట్స్ అథారిటీ కూడా పూర్తిస్థాయిలో డ్రగ్స్ నివారణకు కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో అర్జున అవార్డు గ్రహీత, అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు సాకేత్ మైనేని, క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొని సే నో టు డ్రగ్స్- సే ఎస్ టూ స్పోర్ట్స్ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో శాప్ అధికారులు ఎస్.వెంకటరమణ, అజీజ్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- నలంద కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. జిల్లా యువజన వెల్ఫేర్ అధికారి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఆలోచనలతో ముందుకు వెళ్లాలని తెలిపారు. జీజీహెచ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మీ, పీపీటీ ప్రజంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. నలంద కళాశాల ప్రిన్స్‌పాల్ ఎం.అనురాధ, 17(ఎ) బెటాలియన్ కమాండర్ లెఫ్టినెంట్ కల్నల్ జీసీ పాండే, జి.వెంకటేశ్వరరావు, కె.సుధాకర్ పాల్గొన్నారు.

బెంజిసర్కిల్: స్టెల్లా కళాశాల ఎన్‌సీసీ ఆర్మీ వింగ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ జసింత క్వాడ్రస్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ కళాశాల నుంచి సర్వీస్ రోడ్డు మీదుగా గురునానక్ కాలనీ వరకు సాగింది. అనంతరం కళాశాల ప్రాంగణంలో ఆర్మీ అసోసియేట్ ఆఫీసర్ కెప్టెన్ శైలజ విద్యార్థినులతో మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎస్.ఐ జి.రేవతి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటుపడడం హానికరం, నేరమని వెల్లడించారు. మాదక ద్రవ్యాలు నిరోధించడంలో ఎన్‌సీసీ క్యాడెట్లు ముందుండాలని ప్రిన్సిపాల్ జసింత క్వాడ్రస్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 4 ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ బలిందర్ సింగ్, యాంటీ డ్రగ్ కమిటీ కో- ఆర్డినేటర్ రామకృష్ణ, డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ ఉషకుమారి, నేవీ ఆఫీసర్ స్వప్న, 400 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు 588 మందికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్

భారతీనగర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి జిల్లాలో పాలిటెక్నిక్ కళాశాలల్లో అందుబాటులో ఉన్న సీట్ల భర్తీకి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయపారథి ఒక ప్రకటనలో తెలిపారు. మూడు కేంద్రాల్లో 588 మందికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేశారన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్‌సీసీ, స్పోర్ట్స్‌కోటాకు 166 మందికి, ఎస్ఆర్ఆర్‌లో 220మందికి, లయోలాలో 202 మందికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేసినట్లు తెలిపారు.

త్రిశక్తిపీఠంలో వారాహి నవరాత్రులు ప్రారంభం



కృష్ణలంక, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): త్రిశక్తిపీఠంలోని కాళీమాత ఆలయంలో వారాహి దేవి నవరాత్రులు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. వారాహి దేవిగా కాళీమాత అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఫలరసాలతో అభిషేకం చేశారు. . అనంతరం వారాహి మూలమంత్ర హవనం, సుదర్శన హోమం, రుద్రహోమం, నవగ్రహ హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ కార్యదర్శి కొప్పురావూరి జగదీష్ కుమార్ దంపతులు సమర్పించిన ప్రత్యేక పట్టుచీరలో అమ్మవారిని అలంకరించారు. వారాహి హోమం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



టీడీపీ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న లుక్కా సాయిరాం తదితరులు

ఎమ్మెల్యే కాగిత పుట్టినరోజు వేడుకలు

వన్‌టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్, కల్లుగీత కార్మిక సంఘ నాయకులు వాకా వెంకటేశ్వరరావు గౌడ్, నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి అందరికీ పంచి ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సాయిరాం మాట్లాడుతూ ఆయన మరెన్నో పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎం.ఫైజాన్, పి.కిషోర్ బాబు, బి.దుర్గారావు, పి.రాజేష్, కె.ఆంజనేయవాసు, జాస్తి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయండి

4, 11, 20, 22 డివిజన్ల ముఖ్య నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పిలుపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ పేరుతో ప్రభుత్వం ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న విషయాన్ని కూటమి నేతలు విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు వైసీపీ చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పి కొట్టాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పిలుపు నిచ్చారు. అశోక్‌నగర్‌లోని తన కార్యాలయంలో గురువారం 4, 11, 20, 22 డివిజన్‌లోని ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది పాలనలోని సూపర్‌సిక్స్‌లోని చాలా పథకాలను అమలు చేసినట్లు చెప్పారు. డివిజన్ కమిటీ నియామకంలో పార్టీ ఆదేశించిన నియమ నిబంధనలతో పాటుగా సామాజిక సమీకరణలు పాటించాలన్నారు. ఎన్నికల పరిశీలకులు వెలగపూడి శంకర్‌బాబు, ఉయ్యూరు మార్కెట్‌యార్డ్ చైర్మన్ కొండ ప్రవీణ్‌లు మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో అందరి ఆమోదంతో డివిజన్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. పరిశీలకులుగా సెంట్రల్ నియోజకవర్గం నుంచి యర్రబోలు రమణరావు, వల్లభనేని సతీష్, పరుచూరు ప్రసాద్‌లు హాజరవుతారన్నారు. ఈసమావేశంలో కో-ఆర్డినేటర్ సిద్దెం నాగేంద్రరెడ్డి, గొల్లపూడి నాగేశ్వరరావు, తదితరులు హాజరయ్యారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

రాణిగారితోట: రాష్ట్రంలోని ప్రజలందరికి విద్య, వైద్యం అందుబాటులోకి తీసుకురావాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. 16వ డివిజన్ పూర్ణచంద్రరావు నగర్‌లో 37మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజురైన రూ.41లక్షల విలువైన చెక్కులను గురువారం డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. జనసేన నాయకులు అమ్మిశెట్టి వాసు, నందమూరి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం సెంటర్‌లో గాంధీ, ఎన్టీఆర్ విగ్రహాల ఏర్పాటుకు శంకుస్థాపన నేడు



గన్నవరంలో ఏర్పాటు చేయనున్న గాంధీ, ఎన్టీఆర్ విగ్రహాలు

గన్నవరం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గన్నవరం ప్రధాన సెంటర్‌కు నయా లుక్ తెచ్చేందుకు తగిన చర్యలు చేపట్టారు. ఇప్పటికే సెంటర్‌లోనే గాంధీజీ, ఎన్టీఆర్ విగ్రహాలను తొలగించి డ్రెయినేజీ నిర్మాణ పనులు చేస్తున్నారు. జాతీయ రహదారి నుంచి పోలీస్ స్టేషన్ వరకూ డివైడర్ ఇరువైపులా ఆక్రమణలను తొలగించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.

గాంధీ, ఎన్టీఆర్ విగ్రహాలు తొలగించిన చోటే కొత్తవి ఏర్పాటు చేయనున్నారు. సుమారు రూ.20లక్షలు విలువ చేసే గాంధీజీ కాంస్య విగ్రహం, రూ.10 లక్షలు విలువ చేసే ఎన్టీఆర్ విగ్రహాలను తయారు చేస్తున్నారు. వీటిని ఏర్పాటు చేసేందుకు శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కూటమి నేతలతో కలసి శంకుస్థాపన చేయనున్నారు. దీంతో గన్నవరం పట్టణానికి నూతన శోభ రానుంది. మాజీ ప్రధానుల మూడు బొమ్మలని కూడా తొలగించారు. వాటిని సైతం ఇదే మార్గంలో డివైడర్ మధ్యలో ప్రతిష్ఠించి వారి గొప్పతనాన్ని నేటి తరానికి పరిచయం చేసేందుకు కృషి జరుగుతుందన్నారు.



సాఫ్ట్‌టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్న క్రీడాకారులు

జాతీయ స్థాయి సాఫ్ట్ టెన్నిస్‌కు రాష్ట్ర జట్టు పయనం

విజయవాడ స్పోర్ట్స్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): హర్యానాలో ఈ నెల 26 నుంచి 30 వరకు జరగనున్న 20వ జాతీయ స్థాయి జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌కు రాష్ట్ర జట్టు గురువారం పయనమైనట్లు ఏపీ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి. దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర బాలుర, బాలికల జట్టు ప్రాతినిధ్యం వహిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా జట్టు సభ్యులకు అసోసియేషన్ అధ్యక్షుడు వి.శ్రీనుబాబు, కోశాధికారి బి.నీరజ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

డీజీ లక్ష్మీలపై ఆన్‌లైన్‌లో శిక్షణ



ఆన్‌లైన్‌లో శిక్షణనిస్తున్న అధికారులు

పటమట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరపాలక సంస్థ సర్కిల్ - 3 పరిధిలో డీజీ లక్ష్మిల కింద నమోదైన సభ్యులకు గురువారం పటమట సర్కిల్ - 3 కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ఆఫీసర్ (యూసీడీ) వెంకట నారాయణ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో వారి విధి విధానాలు ప్రజలకు డీజీ లక్ష్మిలపై ఎలా అవగాహన కల్పించాలి అనే విషయాలపై శిక్షణనిచ్చారు.

ధాన్యం బకాయిలు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలి

- ఏపీ కౌలు రైతుల సంఘం డిమాండ్

గవర్నర్‌పేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు ధాన్యం బకాయిలు రూ. వెయ్యి కోట్లకు పైగా ఉందని తక్షణమే వారి ఖాతాల్లో జమచేయాలని ఏపీ కౌలు రైతుల సంఘం డిమాండ్ చేసింది. గురువారం పౌర సరఫరాల శాఖ ఎండీ మన్‌జీర్ జిలానీ సుమూన్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం మే 8వ తేదీ తరువాత ఇంత వరకు రైతులకు ధాన్యం డబ్బులు ఇవ్వలేదని సంఘ నేతలు ఆరోపించారు. ధాన్యం బకాయిలతో పాటు రవాణా చార్జీలు, కాటా కూలి, సంచుల ఖర్చులు కూడా ఇవ్వాల్సి ఉందన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమతున్నందున పెట్టుబడి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు, కృష్ణాజిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, ఎన్టీఆర్ జిల్లా నాయకులు కె. శ్రీనివాసరెడ్డి, జి.హనుమాన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం గురించి బీజేపీ మాట్లాడటం విడ్డూరం

ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల శ్రీనివాస్

కృష్ణలంక, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ 2014లో అధికారం చేపట్టి నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి బాధ్యతలు చేపట్టిన దగ్గర నుంచి దేశంలో ప్రతిరోజు ఏదో ఒక చోట హింసాత్మక ఘటనలు చోటు చేసుకోవడం దురదృష్టకరమని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, న్యాయవాది వేముల శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ స్వాతంత్ర్యం, పౌరహక్కులు, పత్రికాస్వేచ్ఛ, రక్షణ గురించి బీజేపీ నేతలు మాట్లాడటం చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టుందని ఎద్దేవా చేశారు. దేశ సంపదను అదానీ, అంబానీ వంటి బడా కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడం వంటివి చేస్తున్న బీజేపీ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. దేశంలోని ప్రజలందరూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అప్రకటిత ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడాలని అలా పోరాడితేనే బీజేపీ పాలిత ప్రాంతాల్లో చీకటి రోజులు పోతాయని శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు నృత్య కళార్చన

ఇంద్రకీలాద్రి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానం కళావేదికపై గురువారం హైదరాబాద్‌కు చెందిన శ్రీఅభినయ కూచిపూడి అకాడమీ విద్యార్థులు అమ్మవారికి నృత్య కళార్చన నిర్వహించారు. శ్రీఅభినయ కూచిపూడి అకాడమీ గురువు ఊర్వశి సతీష్ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. అనంతరం దేవస్థానం అధికారులు కళాకారులను అభినందించి, అమ్మవారి ప్రసాదం, సర్టిఫికెట్లను అందజేశారు.

మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం

- డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొడతాం
- మెగా వాకథాన్‌లో కలెక్టర్ లక్ష్మీశ



మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర్‌బాబు, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, విద్యార్థులు

కలెక్టరేట్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా మాదకద్రవ్యాల ఆనవాళ్లు కనిపిస్తే ఉపేక్షించేది లేదని, చట్టాలు గట్టిగా ఉన్నాయని, డ్రగ్స్ మహమ్మారిని సమాజం నుంచి దూరం చేసేవరకు నిద్రపోమని, విక్రేతలూ ఖబడ్దార్ అంటూ కలెక్టర్ లక్ష్మీశ గట్టిగా హెచ్చరించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం ఐజీఎం మైదానం నుంచి ఎంజీ రోడ్డులో మెగా వాక్‌థాన్ జరిగింది. ప్రజలకు డ్రగ్స్ మహమ్మారిపై అవగాహన పెంచి, మాదక ద్రవ్య రహిత జిల్లా, రాష్ట్ర, దేశం లక్ష్యంగా నిర్వహించిన ఈ వాక్‌థాన్‌లో అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొని డ్రగ్స్ మహమ్మారికి వ్యతిరేకంగా నినదించారు. యువతా మేలుకో.. మత్తు మానుకో అంటూ నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన సదస్సులు నిర్వహిస్తామని, ఈగల్ క్లబ్స్‌తో పాటు క్యాంపస్ అంబాసిడర్లను నియమిస్తున్నామన్నారు. మీ చుట్టుపక్కల ఎక్కడైనా డ్రగ్స్ విక్రయిస్తున్నా, తీసుకొంటున్నా సమీప పోలీస్ స్టేషన్ లేదా సచివాలయంలో సమాచారం అందించాలని, ఈగల్ టోల్‌ఫ్రీ నెంబరు 1972 అందుబాటులో ఉందన్నారు. పోలీసు కమిషనర్ ఎస్‌వీ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతోందని, పిట్ ఎన్‌డీపీఎస్ చట్టాన్ని సైతం ప్రయోగించడం జరుగుతోందన్నారు. ఈ చట్టం కింద 11 మందికి సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, ఇప్పటికే అయిదుగురిపై ఈ చట్టాన్ని ప్రయోగించినట్లు వివరించారు. ఈ చట్టం ద్వారా విచారణ లేకుండా దాదాపు ఏడాది పాటు జైలుపాలయ్యే పరిస్థితి ఉంటుందని, చాలా కఠినంగా వ్యవహరిస్తున్నామనే సందేశాన్ని అసాంఘిక శక్తులకు చెప్పేందుకు ఈ వాక్‌థాన్ నిర్వహించినట్టు సీపీ రాజశేఖర్‌బాబు తెలిపారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరం కృషి చేద్దామని, మాదక ద్రవ్యాలతో మనిషి నిర్వీర్యమవడంతో పాటు సమాజంపై ప్రతికూల ప్రభావం చూపుతాయన్నారు. అనంతరం నేను సైతం నా జీవితంలో ఎప్పుడూ మాదక ద్రవ్యాలు వాడనంటూ ప్రతిజ్ఞ చేశారు. ఆర్‌డీవో కావూరి చైతన్య, డీసీపీలు కేజీవీ సరిత, ఏబీటీఎస్ ఉదయరాణి, అదనపు డీసీపీ జి.రామకృష్ణ, ఏసీపీ కేదామోదరరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం సుహాసిని, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డాక్టర్ కొల్లేటి రమేష్, వివిధ కళాశాలల ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాల్యానికి భరోసా కల్పిద్దాం

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రత్యేక దృష్టి పెట్టి బాలకార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై గురువారం కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన ఆయన కార్యాలయంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ టాస్క్‌ఫోర్స్ బృందాలు దాడులు ఉధృతం చేయాలన్నారు. దాడుల్లో గుర్తించిన బాల కార్మికులకు వృత్తి విద్యాకోర్సులు, ఒకేషనల్ కోర్సుల్లో చేర్పించి ఆసరా కల్పించాలన్నారు. పీ-4లో వారి తల్లిదండ్రుల బంగారు కుటుంబాలకు యజమానులు ఆర్థిక సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాసవి మహిళా మండలి స్వచ్ఛంద సంస్థలో నైపుణ్య శిక్షణ, ఒకేషనల్ ఇంటర్ కోర్సుల్లో ఉచిత విద్యను అందించి శిక్షణ అందించాలని సూచించారు. ఈ నెల 31 వరకు నిర్వహిస్తున్న ప్యాన్ ఇండియా చైల్డ్ లేబర్ స్పెషల్ డ్రైవ్‌లో గుర్తించిన 13 మంది అడల్ట్ అండ్ లేబర్‌కు కనీస వేతనాలు చెల్లింపుతో పాటు బాలకార్మిక వ్యతిరేక చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం లక్ష్మీనరసింహం, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ సీహెచ్ ఆషారాణి, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డీ రామచంద్రరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జే ఇందుమతి, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జీ మహేశ్వరరావు, వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ బీ కీర్తి, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కో-ఆర్డినేటర్ అరవ రమేష్, దిశ స్టేషన్ ఆఫీసర్ కే వాసవీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తిరుమల దృశ్యాలతో ఆన్‌లైన్ గేమ్ యాప్

- తొలగించాలంటూ టీటీడీకి కిరణ్‌రాయల్ ఫిర్యాదు
- చర్యలు తీసుకోవాలని విజిలెన్స్‌కు చైర్మన్ ఆదేశం

తిరుమల, జూన్ 26(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా రోబ్లెక్స్ పేరుతో ఆన్‌లైన్‌లో ఉన్న మొబైల్ గేమ్‌ను తొలగించాలని, దీని రూపకర్తలపై టీటీడీ చర్యలు తీసుకోవాలని తిరుపతి జనసేన పార్టీ ఇన్‌చార్జ్ కిరణ్‌రాయల్ కోరారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడకు గురువారం తిరుమలలో ఈ గేమ్‌ను చూపించి వివరించారు. తిరుపతి నుంచి తిరుమలకు ప్రయాణం, వైకుంఠం క్యూకాంప్లెక్స్ నుంచి శ్రీవారి ఆలయం, దైవ దర్శనం చేసుకునే దృశ్యాలతో డిజైన్ చేసిన ఈ గేమ్ యాప్ అవాంఛనీయ శక్తులకు ఉపయోగపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా.. దైవభక్తిని ఆసరాగా చేసుకుని డాలర్స్ రూపంలో ఆన్‌లైన్‌లో వసూలు చేసినట్టు తమకు ఫిర్యాదు అందిందని, ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని టీటీడీ చైర్మన్ స్పష్టం చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ అధికారులను ఆయన ఆదేశించారు.

3 నుంచి విశాఖలో సౌత్ జోన్ ఎనస్తీషియా వైద్యుల వార్షిక సదస్సు

విజయవాడ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ ఎనస్తీషియా వైద్యుల వార్షిక సదస్సు విశాఖపట్నంలో నిర్వహించనున్నట్టు రాష్ట్ర ఎనస్తీషియా అకడమిక్ చైర్మన్ డాక్టర్ ఉప్పులేటి తారక ప్రసాద్ తెలిపారు. జూలై 3 నుంచి 6వ తేదీ వరకు ఐఎస్‌ఏ విశాఖ సిటీ బ్రాంచ్ ఆధ్వర్యంలో సదస్సు జరుగుతుందని గురువారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పుదుచ్చేరి నుంచి మొత్తం 1,500 మంది ఎనస్తీషియా వైద్యులు, జాతీయ స్థాయి నుంచి 150 మంది వైద్యులు హాజరవుతారని తెలిపారు. జూలై 3న వర్క్‌షాపు, 4న సీఎంఈ.. 5, 6 తేదీల్లో సదస్సు నిర్వహిస్తున్నట్టు తారకప్రసాద్ వెల్లడించారు.

పోషించలేక పాపను అమ్మేశారు!

- శ్రీసత్యసాయి జిల్లాలో అమానుషం
- పోలీసుల అదుపులో తల్లిదండ్రులు

కదిరి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పేదరికం, అనారోగ్యం కారణంగా బిడ్డలను పోషించలేక తల్లిదండ్రులు అమానుషంగా వ్యవహరించారు. పొట్ట పోసుకునేందుకు కేరళకు వెళ్లి.. అక్కడ మూడేళ్ల కుమార్తెను అమ్మేశారు. 'పాప ఎక్కడ..?' అని తాత నిలదీయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం మరవతండాకు చెందిన శ్రీవాణి, రవీంద్ర నాయక్ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కూలి పనులు చేసుకుని జీవనం సాగించే ఈ దంపతులు.. ఉపాధి కోసం అప్పుడప్పుడు కేరళకు వెళ్లి వస్తుంటారు. రవీంద్ర నాయక్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పేదరికం కారణంగా తగిన వైద్యం చేయించుకోలేకపోతున్నాడు. కుటుంబ పోషణ భారంగా మారింది. ఈ క్రమంలో రెండు నెలల క్రితం కేరళకు వెళ్లిన ఈ కుటుంబం.. అక్కడ ఓ బ్యాంకు ఉద్యోగికి తమ కూతురు యశ్వితా బాయి(3)ని విక్రయించినట్టు తెలిసింది. పాప లేకుండా తల్లిదండ్రులు, ఇద్దరు కుమారులు తండాకు తిరిగి రావడంతో బంధువులు ప్రశ్నించారు. తన మనవరాలిని విక్రయించినట్టు తెలుసుకున్న పాప తాత రామచంద్ర నాయక్, అల్లుడు రవీంద్ర నాయక్‌తో మంగళవారం రాత్రి గొడవ పడ్డాడు. పరస్పరం దూషించుకుని, దాడి చేసుకున్నారు. ఇద్దరూ గాయపడి, కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. దీంతో వ్యవహారం పోలీసుల దృష్టికి వెళ్లింది. పాప తల్లిదండ్రులను అదుపులోకి తీసుకుని విచారించారు. పాపను తాము విక్రయించలేదని, అన్ని వివరాలను పోలీసులకు తెలిపామని శ్రీవాణి అన్నారు. కదిరి అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ నుంచి శ్రీవాణిని, ఆమె భర్తను కేరళ తీసుకువెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పాపను తిరిగి తెచ్చేందుకు కేరళకు గురువారం రాత్రే పోలీసులు బయలుదేరే అవకాశం ఉంది. పాప విషయంలో జరిగిన గొడవలో రవీంద్ర నాయక్, రామచంద్ర నాయక్ గాయపడ్డారని, ఈ గొడవపై కేసు నమోదు చేశామని అప్‌గ్రేడ్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. పాపను విక్రయించిన ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని అన్నారు. కాగా.. శ్రీవాణి దంపతుల ఇద్దరు కుమారులు మరువ తండాలో రెండో తరగతి, ఒకటో తరగతి చదువుతున్నారు. కొడుకులు ఇద్దరినీ చదివించుకోవాలని, కష్టాల నుంచి గట్టెక్కాలని కూతురును అమ్మేసినట్టు తండాలో ప్రచారం జరుగుతోంది.




కొండపిలో రాస్తారోకో చేస్తున్న పొగాకు రైతులు

ప్రకాశంలో రోడ్డెక్కిన పొగాకు రైతులు

- భారీగా నో బిడ్‌లపై ఆగ్రహం
- వెల్లంపల్లి, కొండపిల్లో వేలం నిలిపివేత

ఒంగోలు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాలో రోజూ భారీగా నో బిడ్ (తిరస్కరణలు) బేళ్లు అధికంగా ఉండటంపై తీవ్ర ఆవేదన వ్యక్తంచేసిన పొగాకు రైతులు గురువారం వేలం బహిష్కరించి రోడ్డెక్కి నిరసన తెలిపారు. జిల్లాలోని వెల్లంపల్లి, కొండపి కేంద్రాల్లో ఈ పరిస్థితి నెలకొంది. దక్షిణాదిలోని 11 కేంద్రాల్లో బుధవారం వేలానికి వచ్చిన బేళ్లలో సగటున 27.50 శాతం బేళ్లు నో బిడ్లు అయ్యాయి. అందులో ప్రకాశం జిల్లాలోని వెల్లంపల్లి కేంద్రంలో ఏకంగా 42.50 శాతం బేళ్లు నో బిడ్లు రాగా, పొదిలిలో 41.69, కనిగిరిలో 37.59, ఒంగోలు-1లో 30.14, ఒంగోలు-2లో 24.91, కొండపిలో 24.87శాతం బేళ్లు నో బిడ్ అయ్యాయి. గురువారం మార్కెట్లోనూ అలాంటి పరిస్థితే ఉండటంతో కొండపి, వెల్లంపల్లి కేంద్రాల్లోని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వేలం అడ్డుకొని నిలిపివేశారు. అనంతరం రోడ్డెక్కి నిరసనకు దిగారు. వెల్లంపల్లి కేంద్రంలో ముండ్లమూరు మండల రైతులు వేలం నిలిపివేసి చెన్నై-కోల్‌కతా రహదారిపై రాస్తారోకోకు దిగగా, కొండపి కేంద్రంలో మర్రిపూడి మండల రైతులు ఒంగోలు-కొండపి రోడ్డుపై ధర్నాకు దిగారు. బోర్డు అధికారులు చర్చించినా ఫలితం లేక వేలం నిలిచిపోగా పోలీసుల జోక్యంతో రైతులు ఆందోళన విరమించారు.



పోస్టర్, టీషర్టులను ఆవిష్కరిస్తున్న చక్రధారిదాస్, గోకరాజు గంగరాజు

నగరంలో నేడు అతిపెద్ద రథయాత్ర

- ఇస్కాన్ మందిరాధ్యక్షుడు చక్రధారిదాస్

రాణిగారితోట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అతిపెద్ద రథయాత్రగా పేరుగాంచిన ఇస్కాన్ విజయవాడ జగన్నాథ స్వామి రథయాత్ర మహోత్సవం శుక్రవారం నిర్వహిస్తున్నట్టు ఇస్కాన్ మందిరాధ్యక్షుడు చక్రధారిదాస్ తెలిపారు. జగన్నాథస్వామి రథయాత్ర పోస్టర్, టీషర్టులను గురువారం ఇస్కాన్ మందిరంలో లైలా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ గోకరాజు గంగరాజుతో కలిసి ఇస్కాన్ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి 29 వరకు ఈ మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు భవానీపురం సితార గ్రౌండ్స్ నుంచి రథయాత్ర ప్రారంభమై స్వాతి థియేటర్, కనకదుర్గమ్మ గుడి, రథంసెంటర్, సీతమ్మ వారి పాదాల వరకు జరుగుతుందన్నారు. సీతమ్మవారి పాదాల వద్ద ఉన్న ప్రదేశంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గుండిచ మందిరంలో స్వామి ప్రత్యేక దర్శనం ఇస్తారని, ఈ మూడు రోజుల పాటు సాయంత్రం 5 గంటల నుంచి ప్రత్యేక కార్యక్రమాలు, స్వామికి పూజలు జరుగుతాయన్నారు. సీఎం చంద్రబాబు, ఇతర ప్రముఖులను ఆహ్వానించామని, అలాగే పలు దేశాల నుంచి వచ్చిన అతిథులు హరినామ సంకీర్తనలు చేస్తారన్నారు. సింటెక్స్ ఇండస్ట్రీస్ అధినేత సుధాకర్ చౌదరి, శ్యామ్ సుందర్ దాస్ పాల్గొన్నారు.

డ్వాక్రా బజార్ల ఏర్పాటుకు కృషి

- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)



మెప్మా అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగర పరిధిలో డ్వాక్రా సంఘాల అభివృద్ధికి వారు తయారు చేస్తున్న ఉత్పత్తుల మార్కెటింగ్‌కు డ్వాక్రాబజార్లు ఏర్పాటు చేయాలని, తద్వారా ఆర్థికాభివృద్ధి జరుగుతుందని, అప్పుడు మాత్రమే సీఎం చంద్రబాబు ఆశయం మేరకు కుటుంబంలో ఒక వ్యాపారవేత్త అభివృద్ధి చెందుతారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. విజయవాడ మెప్మా డిపార్టుమెంట్ అధికారులతో ఎంపీ శివనాథ్ గురువారం తన కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని దాదాపు 14వేల డ్వాక్రా గ్రూపులు వారి అవసరాలను బట్టి స్వయం ఉపాధికి కుటీర పరిశ్రమల కామన్ ఫెసిలిటీ సెంటర్స్ ద్వారా ట్రైనింగ్ ఇవ్వాలని సూచించారు. టైలరింగ్, మిల్లెట్స్ ప్రొడక్ట్ తయారీ, పేపర్ బ్యాగులు, విస్తరాకులు తయారీకి శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు. అలాగే కామన్ ఫెసిలిటీ సెంటర్స్ ఉత్పత్తులు తయారు చేసేవారికి మార్కెటింగ్ జరిగేలా ఒకే బ్రాండ్‌తో ఉత్పత్తి అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని దీనికి ప్రభుత్వపరంగా, కేశినేని ఫౌండేషన్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. మెప్మా పీవో వెంకట నారాయణ, జిల్లా అర్బన్ సమాఖ్య అధ్యక్షురాలు కె.మీనాక్షి, టీఈలు, సీడీవోలు ఎస్.డబ్లూలు, సీవోలు, సీఎల్ఆర్‌పీలు, టీఎల్ఎఫ్ ప్రెసిడెంట్లుతో పాటు జీవీ నరసింహరావు, సొంగా సంజయ్ వర్మ, వీ నరసింహ చౌదరి, మాదిగాని గురునాథం, సంకె విశ్వనాథం పాల్గొన్నారు.

యోగా 'అంథమ్' సాంగ్ ప్రొడ్యూసర్ కావూరికి అభినందన

ఇంటర్నేషనల్ యోగా డే సందర్భంగా నిర్వహించిన పాటల పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి పొందిన యోగం పాటకి కాన్సెప్ట్ అండ్ ప్రొడ్యూసర్ కావూరి అశోక్ కుమార్ గురువారం గురునానక్ కాలనీ ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఎంపీ శివనాథ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ పాటకు రూ.లక్ష బహుమతి లభించింది. ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నె ప్రసాద్ (అన్న), ఉడా మాజీ చైర్మన్ తూమాటి ప్రేమనాథ్, విజయవాడ అర్బన్ మాజీ ప్రచార కార్యదర్శి కిలారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కాలేజీని తక్షణం పునఃప్రారంభించాలి

- శాతవాహన పూర్వ విద్యార్థులు

గవర్నర్‌పేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): శాతవాహన కళాశాల యాజమాన్యంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, తక్షణమే కళాశాల పునఃప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని కళాశాల సిబ్బంది, పూర్వ విద్యార్థులు కలెక్టర్ లక్ష్మీశకు విజ్ఞప్తి చేశారు. కళాశాల కమిటీ అధ్యక్షుడు పిన్నమనేని కృష్ణమోహన్, కళాశాల పరిరక్షణ కమిటీ కన్వీనర్ వీ సాంబిరెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం గురువారం కలెక్టర్‌ను కలిసి కళాశాల నిర్వహణలో జరుగుతున్న వివాదాలను వివరించారు. ప్రభుత్వ ఎయిడ్‌తో నడుస్తున్న కళాశాల, స్థలం వివాదం కారణంగా గేటుకు తాళాలు వేసి ఎవరినీ లోనికి రాకుండా స్థలం కబ్జా చేసేందుకు కొందరు యత్నిస్తున్నారని, సిబ్బందిని కూడా రానివ్వడం లేదని ప్రతినిధి బృందం కలెక్టర్‌కు వివరించారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ వివాదం కోర్టులో తేలేవరకు విద్యార్థులకు నష్టం జరక్కుండా కళాశాలను పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌ను కలిసి ప్రతినిధి బృందంలో కళాశాల పరిరక్షణ కమిటీ కో-కన్వీనర్లు శ్రీనివాసరావు, మోతుకూరి అరుణ్‌కుమార్, నవనీతం సాంబశివరావు, వల్లూరు నాగబాబు, రవికిరణ్, యార్లగడ్డ రాజేష్ ఉన్నారు.



కలెక్టర్ లక్ష్మీశకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, శాతవాహన కళాశాల పరిరక్షణ కమిటీ సభ్యులు





అధికార ప్రతిపక్ష సభ్యుల మధ్య వాదనలు వింటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మల, ఎమ్మెల్యే కొలికపూడి

కచ్చా డ్రెయిన్ల పూడికతీతపై కౌన్సిల్‌లో ఫైట్

- ప్రజల సొమ్ము కాంట్రాక్టర్లకు దోచిపెడుతున్నారని విపక్ష వైసీపీ ఆరోపణ
- వైసీపీ నాలుగేళ్ల పాలనలో పూడిక తీయించకపోవడం వల్లే అధిక ఖర్చన్న అధికార పక్షం
- తిరువూరు నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి నిధులు ఖర్చు పెడదామన్న ఎమ్మెల్యే

తిరువూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలువార్డుల్లో కచ్చా డ్రెయిన్లలో పూడికతీతకు సాధర నిధుల నుంచి రూ.20 లక్షల కేటాయింపుపై అధికార టీడీపీ, ప్రతిపక్ష వైసీపీ సభ్యుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. గురువారం నూతన పాలకవర్గం తొలి కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ నిర్మల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వైసీపీ కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు (బీరువాల బాబు) తంగిరాల వెంకటరెడ్డి మాట్లాడుతూ కచ్చా డ్రెయిన్ పేరుతో రూ.లక్షలు కాంట్రాక్టర్‌కు కట్టబెట్టేందుకు అధికార పార్టీ ప్రయత్నిస్తున్నట్టు ఆరోపించగా, నాలుగేళ్లుగా వైసీపీ ఆధ్వర్యంలో డ్రెయిన్లు పూడిక తీయకపోవడంతో ప్రస్తుతం ఎక్కువ నిధులు కేటాయించాల్సి వస్తుందని టీడీపీ ఫ్లోర్‌లీడర్ షేక్ అబ్దుల్ హస్సేన్, కౌన్సిలర్ నాళ్లా సురేంద్ర అన్నారు. పట్టణంలో ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని పరిశీలించిన పలువురు కౌన్సిలర్లు టీడీపీకి మద్దతు ఇస్తున్నారన్నారు. సాధారణ నిధులు అధికంగా ఖర్చుచేస్తే పట్టణంలో దోమల నివారణ, పారిశుధ్య పనులెలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. అలాగే గతంలో కచ్చాడ్రెయిన్ల పూడికతీతకు రూ.5లక్షలతో అంచనాలు వేసి పనులు చేశామని, ప్రస్తుతం రూ.25 లక్షలు ఎలా ఖర్చుచేస్తారని, పట్టణంలో అన్ని వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తారా అని వైసీపీ కౌన్సిలర్లు ప్రశ్నించారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ పట్టణ సమాగ్రాభివృద్ధే లక్ష్యంగా అందరం సమష్టిగా పాటుపడదామన్నారు. జూలై మొత్తం క్లీన్ తిరువూరులో భాగంగా ఏ వార్డులో వరదనీరు నిలవకుండా ప్రాధాన్యత క్రమంలో పనులు నిర్వహిద్దామన్నారు. పట్టణాభివృద్ధికి మంజూరైన నిధులు రాజకీయాలకు అతీతంగా అన్ని వార్డుల్లో పనులు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. మున్సిపల్ కమిషనర్ కె.మనోజ. ఏఈ లోకేశ్, పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై అడ్డదిడ్డంగా!

ఎక్కడ పడితే అక్కడ వాహనాల పార్కింగ్‌తో ట్రాఫిక్ కష్టాలు

- ఆవులు, పందులు, కుక్కలు, కోతులతో మరిన్ని ఇబ్బందులు
- వీటీపీఎస్ పాత గేటు రహదారిలో ప్రయాణం నరకప్రాయం

ఇబ్రహీంపట్నం, ఆంధ్రజ్యోతి: స్థానిక డాక్టర్ ఎన్టీటీపీఎస్ పాత గేటు రహదారి రద్దీతో కిటకిటలాడుతోంది. ఈ డబుల్ రోడ్డుపై ఎంపీడీవో, ఎంఈవో, తహసీల్దార్, ఏవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఎస్బీఐ, ఆంధ్రా, యూనియన్ బ్యాంకులతో పాటు ప్రైవేటు పాఠశాలలు, ఎన్టీటీపీఎస్ క్వార్టర్స్ ఉన్నాయి. దీంతో నిత్యం ట్రాఫిక్ రద్దీగా ఉంటుంది. అయితే, రెండు కిలోమీటర్ల మేరకు రోడ్డు రెండు వైపులా పాఠశాల బస్సులు, చెడిపోయిన వాహనాలు, టిప్పర్లు, ఇతర వాహనాలను నిలిపి రహదారిని పార్కింగ్ స్థలంగా మార్చేస్తున్నారు. భోజన హోటళ్ల బోర్డులు రోడ్డు సగానికి పైగా అడ్డుగా ఉంటున్నాయి. మోటార్‌బైక్ మెకానిక్ షాపుల వద్ద రోడ్డుపైనే మరమ్మతులు చేస్తున్నారు. దీంతో, రెండు వాహనాలు తప్పుకునే రోడ్డు ఒకే వాహనం పోయేంత ఇరుకుగా మారింది. మండల మేజిస్ట్రేట్ కార్యాలయం ఎదుట నో పార్కింగ్ బోర్డు ఉన్నా, భారీ వాహనాలు అక్కడే నిలిపేస్తున్నారు. అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. రోడ్డుపై నిలిపిన వాహనాల చుట్టూ షాపులు, ఇళ్లవారు చెత్త వేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. పశువులు, కోతులు, కుక్కలు చెత్తను చిందరవందర చేస్తున్నాయి. ఈ జంతువులు రోడ్డుపైకి ఒక్కసారిగా వచ్చి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. సుమారు 50కి పైగా ఆవులు అడ్డదిడ్డంగా తిరుగుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయి. రాత్రివేళల్లో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ సరిగా పనిచేయకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఒక్కోసారి రోడ్డు పూర్తి అంధకారంలో ఉంటుంది. జిల్లా అధికారులు స్పందించి, రహదారిపై నిలిపిన వాహనాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.





రహదారికి ఇరువైపులా నిలిపిన టిప్పర్లు, రోడ్డుపై వాహనాలకు అడ్డుగా నిలిచిన ఆవులు

రైతుబజారులో చౌకధరలు అమలయ్యేలా చర్యలు

- జాయింట్ కలెక్టర్ ఇలక్కియా

కృష్ణలంక/కలెక్టరేట్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రైతుబజార్లలో దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తే సహించేది లేదని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే వినియోగదారులకు కూరగాయలు, నిత్యావసర సరుకులను అందుబాటులో ఉంచాలని జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ అధికారులను ఆదేశించారు. నగరంలోని కృష్ణలంక రైతుబజారును గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 15 రైతు బజార్లున్నాయని, వీటిలో నగరంలో తొమ్మిది, రూరల్‌లో ఆరున్నాయన్నారు. బహిరంగ మార్కెట్లలో కంటే రైతుబజార్లలోనే తక్కువ ధరకు నాణ్యమైన కూరగాయలను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. రైతుబజార్లలో దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. నోటీసు బోర్డులో నమోదు చేసిన ధరలకు వ్యాపారులు,



పొదుపు గ్రూపు మహిళలు, రైతులు కూరగాయలు విక్రయిస్తున్నారో లేదోనని ఆమె పరిశీలించారు. పరిసరాలను మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, అమ్మకందారులకు వినియోగదారులకు తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలన్నారు. రైతుబజార్లలో ఎదురయ్యే సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని జేసీ ఇలక్కియా తెలిపారు. జేసీ వెంట ఎస్టేట్ అధికారి సీహెచ్ జాన్ విక్టర్, రైతుబజారు సిబ్బంది ఉన్నారు.

ముగ్గురంటే ముగ్గురే..!

మూత పడేందుకు సిద్ధంగా కొత్తూరు గొల్లగూడెం ఫౌండేషన్ స్కూల్స్

జి.కొండూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జి.కొండూరు శివారు కొత్తూరు గొల్లగూడెంలోని ఫౌండేషన్ స్కూల్లో ముగ్గురు విద్యార్థులే మిగిలారు. 3,4,5 తరగతులను జి.కొండూరు మోడల్ ప్రైమరీ స్కూల్లో విలీనం చేయడంతో ఇక్కడ కేవలం ఒకటి, రెండు తరగతులు మాత్రమే బోధన జరుగుతుంది. దీంతో ఇక్కడ కేవలం ముగ్గురు విద్యార్థులు మాత్రమే మిగిలారు. వారు కూడా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి స్థిరపడిన వారి పిల్లలే. గ్రామంలోకి ఐదు ప్రైవేటు పాఠశాలలకు చెందిన బస్సులు వస్తే అవి నిండిపోతున్నాయి కానీ గ్రామంలో అన్ని వసతులున్నా, మధ్యాహ్నం భోజనంతో పాటు ఇతర సదుపాయాలున్నా పిల్లల్ని మాత్రం ప్రభుత్వ స్కూళ్లకు పంపడం లేదు. ఇది ఒక కారణమైతే



అసలు గ్రామంలో ఫౌండేషన్ స్కూల్లో చదివే వయస్సున్న వారు కేవలం 12 మంది మాత్రమే ఉన్నారు. ఈక్రమంలో ఇక్కడ అసలు స్కూల్ ఉంచాలా లేక ఉన్న పిల్లలను అంగన్వాడీ కేంద్రంలో చేర్పించి స్కూల్ మూసేయాలా అనే ఆలోచనలో అధికారులున్నట్లు తెలుస్తుంది.

ఆలయ దర్శనం


సద్గతులనిచ్చే క్షేత్రం... వ్యాఘ్రేశ్వరం

ఏకాదశ రుద్రులుగా పేరు పొందిన ఈశ్వర రూపాల్లో... తొమ్మిది కోనసీమ జిల్లాలోని అంబాజీపేట మండలంలో కొలువుతీరాయి. వాటిలో ఈశ్వరుడు స్వయంభువుగా వెలిశాడు. ఎంతో మహిమ కలిగిన ఈ క్షేత్రాలను సందర్శిస్తే పాపవిముక్తి, సద్గతి ప్రాప్తి కలుగుతాయనే విశ్వాసం ఉంది. వీటన్నిటిలో అత్యంత శక్తిమంతమైన క్షేత్రంగా వ్యాఘ్రేశ్వరంలోని శ్రీబాలాత్రిపురసుందరీ సమేత శ్రీవ్యాఘ్రేశ్వర స్వామి ఆలయం ప్రసిద్ధి చెందింది.

ఈశ్వరుడే వ్యాఘ్రరూపంలో...

స్థల పురాణం ప్రకారం... పూర్వం ఈ ప్రాంతమంతా దట్టమైన అడవులతో నిండి ఉండేది. ఆ అడవులనుంచి భక్తులు ప్రతిరోజూ శివపూజ కోసం బిల్వ పత్రాలను (మారేడు దళాలను) తెచ్చుకొనేవారు. ఒకసారి మహా శివరాత్రి నాడు మారేడు దళాల కోసం ఒక పేద బ్రాహ్మణుడు ఆ అడవికి వెళ్ళాడు. అక్కడ అతణ్ణి ఒక పెద్ద పులి తరమడంతో... భయంతో పరుగులు పెడుతూ ప్రాణ రక్షణ కోసం ఒక మారేడు





చెట్టు ఎక్కి కూర్చున్నాడు. ఆ పులి చెట్టు కిందే కాచుకొని ఉంది. దాంతో చెట్టు దిగలేక, మరోవైపు శివరాత్రి మహా పుణ్యకాలం సమీపిస్తూ ఉండడంతో... ఆ చెట్టు ఆకులను ఒక్కొక్కటిగా కోసి, మంత్రాలు చదువుతూ పూజ నిర్వహించాడు. తెల్లవారిన తరువాత చూస్తే... ఆ చుట్టుపక్కల పులి కనిపించలేదు. ఈ వృత్తాంతాన్ని ప్రాంతాన్ని పాలించే పిఠాపురం రాజుకు అతను వివరించాడు. ఆ రాజు భటులను పంపించి, బ్రాహ్మణుడు పూజించిన మారేడు దళాలు గుట్టగా ఉన్న చోట తవ్వించగా... ఒక పెద్ద శబ్దం వినిపించింది. ఆ ప్రదేశంలో ఒక శివలింగం బయటపడింది. మహా శివరాత్రి రోజున పరమశివుడే.. వ్యాఘ్రం (పెద్ద పులి) రూపంలో వచ్చాడని అందరూ భావించారు. ఆ తరువాత రాజు కలలో శివుడు సాక్షాత్కరించి... ఆ వృత్తాంతాన్ని గుర్తు చేశాడు. అప్పుడు రాజు ఆ ప్రదేశంలో ఒక ఆలయాన్ని నిర్మించి, నిత్య దీప ధూప నైవేద్యాలకు తగిన ఏర్పాట్లు చేశాడు. ఆ ప్రాంతం 'వ్యాఘ్రేశ్వరం'గా ప్రసిద్ధి చెందింది. నాటి నుంచి నేటివరకూ ఇక్కడ వ్యాఘ్రేశ్వరుడిగా శివుడు పూజలందుకుంటున్నాడు.

ఇంటింటా ఆ పేరే...

ఈ ప్రాంతం వారు వ్యాఘ్రేశ్వరుణ్ణి తమ ఇలవేలుపుగా కొలుస్తారు. నేటికీ ప్రతి కుటుంబం తమ ఇంట పుట్టిన ప్రథమ సంతానం పేరులో తప్పనిసరిగా 'వ్యాఘ్రేశ్వర' లేదా 'వ్యాఘ్రి' అనే పదాన్ని చేరుస్తారు. మరో విశేషం ఏమిటంటే... భక్తులు తమ కోర్కెలు తీరడం కోసం ఆలయ ప్రాంగణంలో ఒక కొబ్బరి మొక్కను నాటుతారు. అలా చేస్తే తాము కోరుకున్నవన్నీ నెరవేరుతాయని వారి విశ్వాసం. ప్రతి సంవత్సరం మాఘమాసంలో బహుళ ఏకాదశి రోజు నుంచి ఆరు రోజులపాటు స్వామివారి కళ్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతాయి. వాటితోపాటు ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీమదన గోపాలస్వామి కళ్యాణ వేడుకలను కూడా వైభవంగా నిర్వహిస్తారు.

• సి.ఎన్. మూర్తి, 8328143489

విశేషం

జగన్నాథుడి రథయాత్ర... భక్తులు అంగరంగంగా జరుపుకొనే ఒక మహోత్సవం. సాక్షాత్తూ శ్రీకృష్ణుడి ప్రతిరూపమైన శ్రీజగన్నాథస్వామి... బలభద్ర, సుభద్రలతో కలిసి... భక్తులను అనుగ్రహించడానికి ఆలయం నుంచి బయటకు వచ్చే దివ్యమైన సందర్భం అది. జగన్నాథుడి రథోత్సవం జనన మరణ చక్రానికి అడ్డుకట్ట వేసి, మోక్షమార్గాన్ని సులభంగా అనుగ్రహించగలదని పురాణాలు చెబుతున్నాయి.



పతితపావనుడు శ్రీ జగన్నాథుడు

ఒడిశాలోని పూరీలో ఉన్న, అత్యంత పురాతనమైన శ్రీ జగన్నాథుడి ఆలయంలో ప్రతి సంవత్సరం జరిగే కన్నుల పండుగ... జగన్నాథ రథయాత్ర. ఇది ప్రతి సంవత్సరం ఆషాఢ శుద్ధ విదియ నాడు ప్రారంభమవుతుంది. భగవంతుణ్ణి ఆలయంలో దర్శించుకోలేని భక్తులకు... ఆ జగన్నాథుడే స్వయంగా రథంపై వచ్చి దర్శన భాగ్యం కల్పిస్తాడు. అందుకే ఆయనను 'పతిత పావనుడు' అంటారు. 'రథస్థం కేశవం దృష్ట్వా.. పునర్జన్మ న విద్యతే... రథంపై కొలువై ఉన్న జగన్నాథ స్వామిని దర్శించినవారు పునర్జన్మ నుంచి విముక్తి పొందుతారు' అనేది శాస్త్రవాక్యం. జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర అసంపూర్ణమైన కరచరణాలతో, ప్రత్యేక రూపాలతో కనిపించడం వెనుక ఒక లీల ఉంది. ఒకసారి కురుక్షేత్రంలో, సూర్యగ్రహణ సమయంలో... శ్రీకృష్ణుడు, బలరాముడు, సుభద్ర తమ బాల్య లీలలను రోహిణీ మాత నుంచి వింటూ పరవశించిపోయారు. అప్పుడు వారి దేహాలు విశాలమైన కళ్ళతో, లోపలికి చొచ్చుకుపోయిన కరచరణాలతో రూపాంతరం చెందాయి. అవి వ్రజ వాసుల మాధుర్య, ప్రేమ భావనలకు ప్రతిరూపాలుగా పూజలందుకుంటున్నాయి.

గుండిచాలో విడిది

రథయాత్రలో జగన్నాథుడు (సాక్షాత్తు శ్రీకృష్ణుడు), బలభద్రుడు (బలరాముడు), సుభద్ర (శ్రీకృష్ణుని సోదరి) వేర్వేరు రథాల మీద కొలువై కదులుతారు. జగన్నాథుడి రథాన్ని 'నందిఘోష' అంటారు ఇది 16 చక్రాలతో 44 అడుగుల రెండంగుళాల ఎత్తులో ఉంటుంది. బలభద్రుడి రథాన్ని 'తాళధ్వజం' అంటారు. దానికి 14 చక్రాలుంటాయి ఎత్తు 43 అడుగుల మూడంగుళాలు. సుభద్ర రథం పేరు 'దేవదళన'. దీనికి 12 చక్రాలుంటాయి, ఎత్తు 42 అడుగుల మూడంగుళాలు ఉంటుంది. ఈ రథయాత్ర ప్రధాన ఆలయం దగ్గర మొదలై గుండిచా మందిరం వరకూ సాగుతుంది. జగన్నాథ, బలభద్ర, సుభద్రలు తొమ్మిదిరోజుల పాటు గుండిచా మందిరంలో బస చేస్తారు. మూడు రోజుల తరువాత 'హేరా పంచమి' ఉత్సవం జరుగుతుంది. ఆ రోజు లక్ష్మీదేవి గుడించా మందిరానికి వెళ్ళి, స్వామిని తిరిగి రమ్మని చెప్పి, కోపంగా వెనక్కు తిరిగి వస్తుంది. చివరకు స్వామివారు తమ మందిరానికి చేరుకొని, బంగారు ఆభరణాలతో దర్శనమిచ్చే 'సోనాబేష'తో రథయాత్ర ముగుస్తుంది.

జగన్నాథ నామం... విశ్వవ్యాప్తం

హరేకృష్ణ ఉద్యమ సంస్థాపకాచార్యులైన శ్రీల ప్రభుపాదుల కృషి ఫలితంగా ఇప్పుడు ప్రపంచంలోని అన్ని ఖండాలలో, ప్రతి ప్రఖ్యాత నగర వీధుల్లో జగన్నాథ రథయాత్రను నిర్వహిస్తున్నారు. 1967లో అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో నగరంలో తొలిసారిగా అంతర్జాతీయ రథయాత్రను నిర్వహించారు. కుల, మత, వర్గ భేదం లేకుండా.. ప్రతి ఒక్కరికీ భగవంతుణ్ణి సేవించే అవకాశాన్ని ఈ ఉత్సవం అందిస్తుంది. ప్రజలంతా 'హరేకృష్ణ... హరేరామ' మహా మంత్రాన్ని జపిస్తూ ఉత్సవంలో పాల్గొంటారు. ఈ రథయాత్రలు జగన్నాథుని నామాన్ని, ప్రేమను ప్రపంచ వ్యాప్తంగా వ్యాప్తి చేస్తున్నాయి. సామాజిక ఐక్యతను పెంపొందిస్తున్నాయి. శ్రీల ప్రభుపాదులు శ్రీ జగన్నాథుణ్ణి విశ్వమంతా పరిచయం చేశారు. ఆయనకు చిన్ననాటి నుంచే రథయాత్రపట్ల అమితమైన ఆసక్తి ఉండేది. కాగా... నవద్వీపంలో అవతరించిన శ్రీచైతన్య మహాప్రభువు 24వ యేట సన్న్యసించిన తరువాత... జగన్నాథపురినే తన భక్తి ఉద్యమ ప్రచార కేంద్రంగా చేసుకొని, హరినామ సంకీర్తనను వ్యాపింపజేశారు. శ్రీల ప్రభుపాదులు కూడా చైతన్య మహాప్రభువుల గౌడీయ సంప్రదాయ మార్గ నిర్దేశాలను అనుసరించి... ఈ రథోత్సవాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్ళారు. ప్రపంచవ్యాప్తంగా రాధా-కృష్ణ దేవాలయాలు స్థాపించాలని, రథయాత్రలు నిర్వహించాలని తన శిష్యులను కోరారు. ఆయన అనుగ్రహం వల్లనే నేడు జగన్నాథుని నామం ప్రపంచమంతటా మారుమోగుతోంది.

ఎలా పాల్గొనాలి?

శ్రీ జగన్నాథ రథయాత్ర... భగవంతుడికి సేవ చేసేందుకు ప్రతి ఒక్కరికీ లభించే ఒక గొప్ప అవకాశం. భగవంతుడితో మనకున్న సనాతనమైన సంబంధాన్ని మళ్ళీ తెలుసుకోవడానికి ఈ ఉత్సవం సహాయపడుతుంది. రథయాత్రలో పాల్గొనడం ద్వారా శ్రీకష్ణునితో ప్రత్యక్షంగా అనుబంధం ఏర్పడుతుంది. ఎంత గొప్పవాడినైనా భగవంతుడి సర్వోతత్వాన్ని అంగీకరించాలనే ఆలోచనను రథయాత్ర కలిగిస్తుంది. రథయాత్ర సమయంలో రథాన్ని తాడు పట్టుకొని లాగడం, స్వామిని దర్శించడం, హారతులు ఇవ్వడం, నృత్య సంకీర్తనలు చేయడం, రథ మార్గంలో ముగ్గులు వేయడం, ప్రసాదాలు నివేదించడం లాంటి సేవలు భక్తులు చేయవచ్చు. ఇవి వారిని ఆధ్యాత్మికంగా మరింత పురోగమింపజేస్తాయి.





• శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9396956984

విశేషాలు ఎన్నెన్నో...

పూరీలోని జగన్నాథ ఆలయం అనేక విశేషాల సమాహారం. శ్రీకృష్ణుని హృదయం ఇప్పటికీ ఈ ఆలయంలోని పవిత్రమైన గోడల లోపల కొట్టుకుంటూ ఉంటుందనేది భక్తుల నమ్మకాల్లో ఒకటి. కృష్ణుడి అవతార సమాప్తి తరువాత... అతని హృదయం నాశనం కాకుండా ఉండేందుకు ఈ ఆలయం లోపల ఒక దైవిక అవశేషంగా భద్రపరిచారని చెబుతారు.


- ఈ ఆలయం గోపురంపైన సుదర్శన చక్రం ఉంటుంది. అన్ని టన్నుల బరువైన లోహపు నిర్మాణాన్ని అంతపైకి ఎలా చేర్చారనేది ఇప్పటికీ అంతుపట్టని విషయం. అలాగే స్వామి మందిరాన్ని ఏ కోణం నుంచి చూసినా ఒకే విధంగా కనిపిస్తుంది. అలాగే నగరంలోని ఏ దిశ నుంచి చూసినా... ఆలయం పైన ఉన్న చక్రం ఒకే మాదిరిగా దర్శనం ఇస్తుంది.
- జగన్నాథ ఆలయంలోని దారు (కలప) విగ్రహాల స్థానంలో 8, 12, 19 ఏళ్ళకు ఒకసారి నిర్వహించే నవకళేబర యాత్ర సందర్భంగా కొత్త వాటిని ఏర్పాటు చేస్తారు. దీనికోసం నిర్దిష్టమైన లక్షణాలు కలిగిన వేప చెట్లను జాగ్రత్తగా ఎంపిక చేస్తారు. విగ్రహాలను చెక్కే పని 21 రోజుల పాటు నిపుణులైన కళాకారులు రహస్యంగా చేస్తారు. కొత్త విగ్రహాల ప్రతిష్ఠ తవాత.. పాత విగ్రహాలను ఖననం చేస్తారు. ఇంతకుముందు... 2015లో నవ కళేబర యాత్ర జరిగింది. మళ్ళీ 2034లో దీన్ని నిర్వహిస్తారు.
- జగన్నాథుడి ఆలయం మీద ఏ పక్షులూ ఎప్పుడూ ఎగరవు. అలాగే విమానాలకు కూడా ఆలయం మీదుగా ఎగరడానికి అనుమతి లేదు.
- నలభై అయిదు అంతస్తుల ఎత్తున ఉండే ఆలయ గోపురం పైకి అర్చకులు ప్రతిరోజూ ఎక్కి, 20 అడుగుల వెడల్పు ఉండే త్రిభుజాకార పతాకాన్ని ఎగురవేస్తారు. గత 1800 ఏళ్ళుగా ఇది నిరంతరాయంగా కొనసాగుతోంది. దీనికి ఒక్క రోజు అంతరాయం కలిగినా... పద్ధెనిమిదేళ్ళు ఆలయాన్ని మూసేయాలనే నియమం ఉంది. కాగా... గాలి ఒక దిశలో వీస్తూ ఉంటే... దానికి వ్యతిరేక దిశలో జగన్నాథ గోపుర పతాకం ఎగరడం విస్మయం కలిగించే మరో విశేషం.
- రోజులో ఏ సమయమైనా, ఆకాశంలో ఎండ ఎంత తీవ్రంగా కాస్తున్నా... జగన్నాథ ఆలయం నీడ నేల మీద పడదు. ఇది నిర్మాణపరమైన అద్భుతం అనేది కొందరి అభిప్రాయం కాగా... మరికొందరి దృష్టిలో ఇది జగన్నాథుడి లీల.
- శ్రీ జగన్నాథుడికి అయిదు విడతలుగా... 56 రకాల ప్రసాదాలను నిత్యం సమర్పిస్తారు. ఇరిరెండు రకాలు. వీటిలో పొడిగా ఉండే రకాలు కొన్ని, అన్నం, పప్పు లాంటి పదార్థాలు కొన్ని ఉంటాయి. మహా ప్రసాదం తయారీలో వేలాది మంది నిమగ్నం అవుతారు. ఏడు కుండలను ఒకదానిపై ఒకటి పెట్టి కట్టెల పొయ్యిల మీద వంట చేస్తారు. అన్నిటికన్నా పైన ఉన్న కుండలో ఉన్న పదార్థం మొదట, తరువాత మిగిలిన కుండల్లోని పదార్థాలు ఉడుకుతాయి. దీన్ని పూరీ క్షేత్రానికే ప్రత్యేకమైన విశేషంగా చెబుతారు. ప్రతిరోజూ ఒకే పరిమాణంలో ప్రసాదం తయారు చేస్తారు. అయితే భక్తుల సంఖ్య ఎక్కువైనా, తక్కువైనా... ఏ రోజూ ఆహారం వృథా కాదనీ, అలాగే భక్తులు ఎవరూ నిరాహారంగా మిగిలిపోరనీ అంటారు.

దైవమార్గం

నీ తోటివాడూ నీలాంటివాడే...

సంపన్నుడైన ఒక బాటసారి కొండదారిలో ఒంటరిగా ప్రయాణిస్తున్నాడు. అతని దగ్గిర డబ్బు, నగలు ఉన్న పెద్ద మూట ఉంది. అది దొంగలు దారికాచి దోచుకోవడానికి అనువైన ప్రదేశమే. కాబట్టి అతను ఆ మూటను జాగ్రత్తగా పట్టుకొని నడుస్తున్నాడు. అతను భయపడినట్టే... చెట్ల చాటు నుంచి, బండల మాటు నుంచి దొంగలు వచ్చారు. అతణ్ణి చుట్టు ముట్టారు. తీవ్రంగా కొట్టారు. అతని దగ్గర ఉన్నదంతా దోచుకుపోయారు. ఆ బాటసారి స్పృహ కోల్పోయాడు. కొద్దిసేపటికి తేరుకున్నాడు. లేవలేని స్థితిలో ఉన్న అతను సాయం కోసం అరిచాడు, అర్థించాడు. అటువైపు పలువురు పలుకుబడి ఉన్న పెద్దమనుషులు, సంఘ సేవకులుగా పేరున్నవారు, సంపన్నులు, మతాచార్యులు ప్రయాణించారు. అందరూ అతణ్ణి దాటుకుంటూ పోయారు తప్ప సహాయం చేయలేదు.

కొంతసేపటికి ఒక సాదాసీదా మనిషి చిన్న గాడిదమీద అటు వచ్చాడు. ఆ బాధితుణ్ణి చూసి, 'అయ్యో పాపం' అని జాలిపడ్డాడు. అతడికి కట్లు కట్టాడు. తన గాడిద మీద ఎక్కించుకొని దగ్గరలో ఉన్న సత్రంలోకి చేర్చాడు, వైద్యం చేయించాడు. సత్రం వారికి మళ్ళీ వస్తానని చెప్పి వెళ్ళాడు. మరుసటిరోజు వచ్చి... సత్రం వారికి చెప్పిన మొత్తం చెల్లించాడు. ఆ బాటసారిని అతని ఇంటికి తీసుకువెళ్ళాడు. ఆ వచ్చిన వ్యక్తి ఒక సమరేయుడు. అంటే ఆ రోజుల్లో కడ జాతివాడుగా, అంటరానివాడుగా పరిగణించే వ్యక్తి. అందరూ ఈ సడించుకొనే వర్గానికి చెందినవాడు. అయితేనేం... బాధలో ఉన్న తోటి మనిషిని అతను కాపాడి తన ఔన్నత్యాన్ని చాటుకున్నాడు.



"సాటివాడు శత్రువు కాదు. తోటివాడు తోడేలూ కాదు. వారూ మనలాంటి మనుషులే అని భావించి, ప్రేమించడం నేర్చుకోవాలి. ఎంత సంపద ఉన్నా, అధికారంలో ఉన్నా, జాతిపరంగా ఉన్నతులమని భావించేవారైనా... వారెవరూ గొప్పవారు కాదు. తోటివారికి సాయం చేసేవారు పేదలైనా, నిమ్నవర్గాలవారైనా ఉన్నతులే" అంటూ తన చుట్టూ చేరిన ప్రజలకు ఏసు క్రీస్తు చెప్పిన కథ ఇది. 'మనల్ని మనం ప్రేమించుకోవడంలో విశేషం ఏముంది? మనల్ని మనం ఎంతగా ప్రేమించుకుంటామో మన చుట్టుపక్కలవారిని కూడా అలాగే ప్రేమించాలి' అనేది బైబిల్ సారాంశం.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

తెలుసుకుందాం

ఉలూచి... ప్రాణదాతే కానీ...

మహాభారతంలో ఉలూచి (ఉలూపి) పాత్రచిత్రమైనది. ఆమె పాతాళలోకంలో నాగులకు రాజైన కౌరవ్యుడి కూతురు. అర్జునుడి తీర్థయాత్రల సమయంలో ఈ పాత్ర పరిచయం అవుతుంది. పాండవులు ఒక నియమం పెట్టుకుంటారు. వారిలో ఎవరైనా ద్రౌపదితో ఏకాంతంగా ఉండగా... మిగిలినవారు ఆ వైపు వెళ్ళకూడదు. ఏ కారణంగానైనా ఆ నియమాన్ని ఉల్లంఘించినట్టయితే... నిర్ణీతకాలం తీర్థయాత్రలు చేయాల్సి ఉంటుంది. ఒకసారి ధర్మరాజు, ద్రౌపది ఏకాంతంలో ఉండగా... ఆర్త రక్షణ కోసం తన విల్లమ్ములు తీసుకోవడానికి ఆ మందిరంలోకి అర్జునుడు ప్రవేశించక తప్పని పరిస్థితి ఎదురవుతుంది. అందుకు పరిహారంగా అర్జునుడు తీర్థయాత్రలకు బయలుదేరుతాడు. అతను గంగానదిలో స్నానం చేస్తూ ఉండగా... నాగకన్య అయిన ఉలూచి అతడి కాలు పట్టుకొని పాతాళానికి లాక్కుపోతుంది. తనను పెళ్ళాడమని అర్జునుణ్ణి ప్రాధేయపడుతుంది. మొదట అర్జునుడు నిరాకరించినా... ఆమె అతణ్ణి ఒప్పించి వివాహం చేసుకుంటుంది. కొన్నాళ్ళకు అర్జునుడు ఆమెను విడిచి పెట్టి వెళ్ళిపోతాడు. వారికి ఇరావంతుడనే కొడుకు జన్మిస్తాడు. అతను మహాభారత యుద్ధంలో మరణిస్తాడు.



అర్జునుడి పాపం...

ఒక రోజు ఉలూచి గంగానదిలో స్నానానికి వస్తుంది. అక్కడికి వసువులు వచ్చి, గంగాదేవితో మాట్లాడడం గమనిస్తుంది. తమ వసువుల్లో ఒకరు శాపవశాత్తూ గంగాపుత్రుడైన భీష్ముడిగా జన్మించి... భారత యుద్ధంలో సాధించిన విజయాలను వారు వివరిస్తూ ఉంటే... శిఖండిని అడ్డుపెట్టుకొని భీష్ముణ్ణి అర్జునుడు చంపాడని గంగాదేవి ఆవేదన చెందుతుంది. అప్పుడు వసువులు "నీవు ఆజ్ఞాపిస్తే అర్జునుణ్ణి శాపంతో భస్మం చేస్తా"మంటారు. అందుకు గంగాదేవి సమ్మతిస్తుంది. ఆ మాటలు విన్న ఉలూచి పరుగుపరుగున పాతాళలోకానికి వెళ్ళి, అర్జునుణ్ణి కాపాడాలని తన తండ్రిని కోరుతుంది. కౌరవ్యుడు ఆమెతో కలిసి వసువుల దగ్గరకు వస్తాడు. తన కుమార్తెకు పతిభిక్ష పెట్టాలని కోరుతాడు. వారి వేదనను చూసి కరిగిపోయిన వసువులు "మేము ఊరుకున్నా అర్జునుణ్ణి ఆ పాపం వెంటాడుతూనే ఉంటుంది. అతను నరకానికి వెళ్ళక తప్పదు. అర్జునుడు తన కుమారుడి చేతిలో మరణించడమే పాపపరిహారం" అంటారు. భారత యుద్ధం తరువాత... అర్జునుడికి మిగిలిన కుమారుడు బభ్రువాహనుడు మాత్రమే. అర్జునుడు-చిత్రాంగదల కుమారుడైన అతను మణిపుర రాజ్యానికి పాలకుడు. అతనికీ, అర్జునుడికీ మధ్య యుద్ధం జరిగే సందర్భం కోసం ఉలూచి నిరీక్షిస్తూ ఉంటుంది.

యుద్ధానికి ప్రేరేపించి...

కొన్నాళ్ళకు ధర్మరాజు అశ్వమేధ యాగం చేస్తాడు. యాగాశ్వ రక్షణ కోసం దాని వెంట బయలుదేరిన అర్జునుడు.. మణిపుర రాజ్యంలోకి ప్రవేశిస్తాడు. ఇది తెలుసుకున్న బభ్రువాహనుడు తండ్రికి స్వాగతం చెప్పడానికి వెళతాడు. అతణ్ణి అర్జునుడు ఎగతాళి చేస్తాడు. వెనుతిరిగి వస్తున్న బభ్రువాహనుణ్ణి ఉలూచి కలుసుకుంటుంది. యాగాశ్వాన్ని బంధించి, వాటి వెనుక వచ్చినవారిని జయించడమే రాజ ధర్మం అని చెప్పి, అర్జునుడితో యుద్ధం చేయమంటుంది. అప్పుడు బభ్రువాహనుడు యుద్ధానికి దిగి, అర్జునుణ్ణి ఓడిస్తాడు. అతను సంధించిన ఒక అస్త్రం అర్జునుడి ప్రాణాలు తీస్తుంది. ఈ సంగతి తెలిసిన చిత్రాంగద రణరంగానికి చేరుకొని విలపిస్తూ ఉంటుంది. అప్పుడు ఉలూచి వచ్చి... తన దగ్గర ఉన్న మృతసంజీవనీ మణితో అర్జునుణ్ణి బతికిస్తుంది. అర్జునుడి పాపపరిహారం కోసం తపించిన ఉలూచి... సవతి కొడుకును భర్త ప్రాణాలు తీయడానికి ప్రేరేపించి, ఆ తరువాత భర్తను బతికించి... తన ఆశయాన్ని నెరవేర్చుకుంది.

చింతన

హృదయంలో అన్వేషించండి

ప్రతి ఒక్కరి జీవితంలో మూడు ముఖ్యమైన నియమాలు ఉంటాయి. వాటికి అందరం లోబడి ఉంటాం. మొదటిది... జన్మించడం, రెండోది... జీవించడం, మూడోది... ఈ లోకాన్ని విడిచిపోవడం. వీటిని ఎవరూ ఉల్లంఘించలేరు. అన్ని జీవులు వీటికి కట్టుబడి ఉంటాయి. పూర్వం ఎవరో చెప్పినట్టు రాజైనా, సామాన్యుడైనా, సాధువులైనా... పుట్టినవారు గిట్టవలసిందే. కొందరు సింహాసనాన్ని అధిష్ఠించి పోతారు, మరికొందరు జీవన బంధాల్లో చిక్కుకొని కష్టాలు పడుతూ పోతారు.

అది హృదయంలో ఉంటుంది...

మనం దుఃఖాల నుంచి తప్పించుకోవాలని అనుకుంటాం. సుఖంగా బతకాలని తాపత్రయపడతాం. కానీ సుఖం అనేది ఎక్కడుంది? అది మీలోనే ఉంది. కానీ మీరేమో దాన్ని బాహ్యంగా అన్వేషిస్తున్నారు. అది మీకు బయట దొరకదు. ఈ బాహ్య సుఖాలు ఎలాంటివంటే... సుఖంలో కూడా దుఃఖాలే మిగులుతాయి. ఈ ప్రాపంచిక సుఖం ఈ రోజు ఉంటుంది, రేపు ఉండదు. రేపటి రోజున అన్నీ మారిపోతాయి. ప్రతి ఒక్కటీ మారిపోతున్నా... మారకుండా ఉండాలని మీరు శతవిధాలా ప్రయత్నిస్తారు. చాలామంది వయసు తెలియకూడదని జుట్టుకు రంగు వేసుకుంటారు. కానీ యవ్వనం అనేది జుట్టులో ఉండదు. మీ హృదయంలో ఉంటుంది.

కాలయాపన వద్దు...

బయట ఉన్నవన్నీ మారుతాయి, మారుతూనే ఉంటాయి. ఈ రోజు ఉంటాయి. రేపు లేకుండా పోతాయి లేదా మారిపోతాయి. మిత్రులు మారుతారు. ఉద్యోగం మారుతుంది. రిటైరయ్యే రోజు కూడా తప్పకుండా వస్తుంది. వాతావరణం కూడా నిరంతరం మారుతూ ఉంటుంది. కానీ ఏదీ మారకుండా ఉండాలనేది మీ ఆకాంక్ష అన్నీ ఒకేలా ఉండాలని మీరు భావిస్తారు. కానీ మార్పు సహజం. అయితే మీరు జీవించి ఉన్నంతకాలం మారనిది ఒకటుంది.. అదే మీ లోపలికి వచ్చీపోయే శ్వాస. దాన్ని మీరు అర్థం చేసుకోకపోతే... ఉత్త చేతులతో వచ్చిన మీరు ఉత్త చేతులతోనే వెనుతిరగాల్సి వస్తుంది. కాబట్టి ఆ శ్వాస సరాగాలను ఆస్వాదించండి. అందులోని ఆనందాన్ని అనుభూతి పొందండి. మీరు అన్వేషిస్తున్నది మీలోనే ఉంది. దానికోసం నిరీక్షిస్తూ కాలయాపన చేయకండి. పరమానందం మీలోనే ఉందని గుర్తించండి. అలాగే మీలోనికి శ్వాస వస్తూ, పోతూ ఉంది కాబట్టి మీరు ఎంత భాగ్యశాలి అనేది కూడా గుర్తించండి. మీ జీవితంలో చీకటి ఛాయలు అలముకున్నప్పుడు, ప్రతిదీ మీకు విరుద్ధంగా ఉన్నట్టు అనిపిస్తున్న స్థితిలో కూడా... ఈ శ్వాస మీకు తోడుగా ఉంటుంది. మీలోకి సహజంగా వస్తూ పోతూ ఉంటుంది. యావత్ ప్రపంచాన్నీ నడిపిస్తున్న ఆ దివ్య శక్తి మిమ్మల్ని ఆ స్థితిలో కూడా విస్మరించడం లేదు. ఈ విషయాలన్నీ గుర్తించగలగడం నిజంగా ఎంతో గొప్పవిషయం. ప్రపంచమంతా తల్లకిందులై, అన్నీ అస్తవ్యస్తంగా ఉంటూ, సమయం మీకు ఏమాత్రం అనుకూలంగా లేని పరిస్థితుల్లో కూడా... శ్వాస మీలోనికి వస్తూ, పోతూ ఉంటే... అంతా సవ్యంగా ఉన్నట్టే!



అజ్ఞానానికి భయపడండి...

మీరు గుర్తుంచుకోవాల్సిన మరో విషయం... మీరు దేనికీ భయపడవలసిన అవసరం లేదు. ఒకవేళ భయపడాల్సి వస్తే... అజ్ఞానానికి భయపడండి. అజ్ఞానిలా ఉండకండి. ఎందుకంటే జ్ఞానం మీలోనే ఉంది. చీకటిని చూసి భయపడాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ప్రకాశం మీలోనే ఉంది. మీ అంతరంగంలోని ఆ జ్ఞాన దీపాన్ని వెలుగొందేలా చూసుకుంటే... చీకటి మీ దరిదాపులలోకి కూడా రాదు. జీవితంలో సమస్యలు వస్తాయి. కొన్నిటిని మీరు పరిష్కరించుకోగలరు. మరికొన్నిటికి ఎలాంటి పరిష్కారం ఉండదు. కానీ జీవితం లక్ష్యం... సమస్యలను పరిష్కరించుకోవడం. కాదు. పరమానందాన్ని పొందడం, ఈ జీవితాన్ని సఫలం చేసుకోవడం. దానికోసం ప్రయత్నించండి.




ప్రేమ్‌రావత్

స్పోర్ట్స్

విజయవాడ ● శుక్రవారం 27 జూన్ 2025

ఆర్చర్ వచ్చేశాడు..



రెండో టెస్టుకు ఇంగ్లండ్ జట్టు

బర్మింగ్‌హామ్: నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత పేసర్ జోఫ్రా ఆర్చర్ ఇంగ్లండ్ టెస్టు జట్టుకు ఎంపికయ్యాడు. వచ్చేనెల 2 నుంచి భారత్‌తో జరగబోయే రెండో టెస్టు కోసం 15 మందితో కూడిన జట్టును సెలెక్టర్లు గురువారం ప్రకటించారు. 30 ఏళ్ల ఆర్చర్ రాకతో ఇప్పటికే ఐదు టెస్టుల సిరీస్‌లో భారత్‌పై 1-0 ఆధిక్యంలో ఉన్న స్టోక్స్ సేన బౌలింగ్ మరింత పటిష్టం కానుంది. కొన్నేళ్లుగా గాయాలతో సతమతమవుతున్న తను చివరిసారిగా 2021, ఫిబ్రవరిలో భారత్‌పైనే టెస్టు ఆడాడు. ఇక ఆర్చర్ మినహా తొలి టెస్టుకు ఎంపిక చేసిన జట్టులో ఎలాంటి మార్పులు లేవు.

జట్టిదే: బెన్ స్టోక్స్ (కెప్టెన్), క్రాలే, డకెట్, బ్రూక్, రూట్, స్మిత్, పోప్, సామ్ కుక్, ఒవర్టన్, వోక్స్, బషీర్, ఆర్చర్, బెథెల్, టంగ్, కార్స్

అల్కారజ్ 2 క్రెజికోవా 17



వింబుల్డన్ సీడింగ్స్

లండన్: ప్రతిష్ఠాత్మక వింబుల్డన్ చాంపియన్‌షిప్ ఈనెల 30న ప్రారంభం కానుంది. వచ్చే నెల 13 వరకు జరిగే ఈ టోర్నీకి సీడింగ్‌ల వివరాలను గురువారం వెల్లడించారు. పురుషుల డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్కారజ్‌కు రెండో సీడింగ్ కేటాయించగా..మహిళల విజేత బార్బరా క్రెజికోవాకు 17వ సీడింగ్ లభించింది. గత సోమవారం విడుదలైన ప్రపంచ ర్యాంకింగ్స్ ఆధారంగా ఈ సీడింగ్‌లు కేటాయించారు. ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్ జానిక్ సినర్‌కు టాప్ సీడింగ్ లభించింది. రెండు గ్రాండ్‌స్లామ్‌ల చాంపియన్ సబలెంక, ఫ్రెంచ్ ఓపెన్ విజేత గాఫ్ టాప్, రెండో సీడింగ్‌లతో బరిలో దిగనున్నారు.

హ్యాట్రిక్ టైటిళ్లతో భారత్ చరిత్ర

ఆసియా స్క్వాష్ డబుల్స్ చాంపియన్‌షిప్స్



అనాహత్-జోష్న

కౌలాలంపూర్: ఆసియా స్క్వాష్ డబుల్స్ చాంపియన్‌షిప్స్‌లో భారత్ మూడు టైటిళ్లతో క్లీన్‌స్వీప్ చేసి చరిత్ర సృష్టించింది. పురుషుల, మహిళల డబుల్స్‌తోపాటు మిక్స్‌డ్ విభాగంలోనూ భారత్ జయభేరి మోగించింది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో అభయ్ సింగ్-వెలవన్ జోడీ 9-11, 11-5, 11-5తో పాకిస్థాన్‌కు చెందిన నూర్-నాసిర్‌పై గెలిచింది. మహిళల డబుల్స్ తుది పోరులో జోష్న చినప్ప-అనాహత్ సింగ్ జంట 8-11, 11-9, 11-10తో మలేసియాకు చెందిన ఐన్నా అమానీ-జిన్ యింగ్‌పై, మిక్స్‌డ్‌లో అభయ్-అనాహత్ సింగ్ జోడీ 11-9, 11-7తో మలేసియా జంట రేచల్ అర్నాల్డ్-అమీషన్‌రాజ్ చంద్రన్‌పై విజయం సాధించాయి. దీంతో అభయ్, అనాహత్ డబుల్ టైటిల్స్ సాధించినట్టయింది.

టిక్కెట్లు అమ్ముడుపోయాయ్ !

నవంబరులో ఆస్ట్రేలియా x భారత్ సిరీస్

సిడ్నీ: క్రికెట్ ఆడే దేశాలలో టీమిండియాకున్న క్రేజ్ చెప్పనలవి కాదు..ఏ దేశంలో పర్యటించినా భారత జట్టు ఆడే మ్యాచ్‌లకు క్రికెట్ ఫ్యాన్స్ పోటెత్తుతారు. దటీజ్ టీమిండియా. ఇకపోతే ఆస్ట్రేలియాతో పరిమిత ఓవర్ల సిరీస్‌కోసం వచ్చే అక్టోబరు-నవంబరులో భారత జట్టు ఆ దేశంలో పర్యటించనుంది. ఇందులో భాగంగా ఇరు జట్లు మూడు వన్డేలు, ఐదు టీ20లలో తలపడనున్నాయి. సిరీస్‌లో మూడో వన్డే (అక్టోబరు 25)కు సిడ్నీ, తొలి టీ20 (అక్టోబరు 29)కి కాన్‌బెరా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఈ రెండు మ్యాచ్‌లకు సంబంధించిన టిక్కెట్లను అమ్మకానికి పెట్టగా..హాట్ కేకుల్లా అభిమానులు కొనేశారు. ఈ విషయాన్ని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) గురువారం వెల్లడించింది.

టెస్టుల్లోనూ స్టాప్ క్లాక్

స్లో ఓవర్ రేట్‌కు చెక్

ఐసీసీ నిర్ణయం



దుబాయ్: క్రికెట్‌ను మరింత ఆకర్షణీయంగా, పోటీతత్వం పెంచేందుకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తమ నిబంధనలను మార్చడం పరిపాటి. ఇటీవలే వన్డేల్లో ఒకే బంతి, బౌండరీ క్యాచ్‌లు, కంకషన్ సబ్‌స్టిట్యూట్ అంశాలపై రూల్స్‌ను సవరించిన విషయం తెలిసిందే. తాజాగా మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. దీనిలో భాగంగా టెస్టుల్లో స్లో ఓవర్ రేట్‌కు చెక్ పెట్టేందుకు స్టాప్ క్లాక్‌ను ప్రవేశపెట్టింది. ఒక రోజులో 90 ఓవర్లు పూర్తి కావాల్సి ఉండగా.. చాలాసార్లు అలా జరగకపోవడం చూస్తూనే ఉంటాం. అందుకే ఇక నుంచి ఓవర్ పూర్తయిన 60 సెకన్లలోపే తర్వాతి ఓవర్‌ను మొదలెట్టాలి. అలా జరగకపోతే ఫీల్డింగ్ జట్టు కెప్టెన్‌ను అంపైర్లు రెండుసార్లు హెచ్చరిస్తారు. మూడోసారి రిపీట్ అయితే మాత్రం పెనాల్టీ కింద ప్రత్యర్థి జట్టుకు అదనంగా ఐదు పరుగులను కోల్పోవాల్సి ఉంటుంది. 80వ ఓవర్ వరకు ఇలా ఎన్నిసార్లు జరిగినా కూడా పెనాల్టీ రన్స్ విధిస్తారు. డబ్ల్యూటీసీ కొత్త సీజన్ (2025-2027) నుంచే ఇది అమల్లోకి వస్తుందని ఐసీసీ వెల్లడించింది. వాస్తవానికి వన్డే, టీ20ల్లో గతేడాది జూన్ ఒకటి నుంచే ఈ స్టాప్ క్లాక్ రూల్ కొనసాగుతోంది.

ఉమ్మి పూసినా..

మ్యాచ్ సమయంలో బౌలర్లు బంతికి లాలాజలం పూయడంపై నిషేధం కొనసాగుతోంది. అయితే ఇక నుంచి బౌలర్లు తమ ఉమ్మి పూశారనే కారణంతో అంపైర్లు బంతిని మార్చాల్సిన అవసరం లేదు. ఎందుకంటే కొత్త బంతి కోసం ఒక్కోసారి బౌలింగ్ జట్టు సభ్యులు కావాలనే ఉమ్మి పూస్తుంటారు. దీన్ని ఎదుర్కొనేందుకే కొత్త రూల్ తీసుకువచ్చారు. అయితే ఇంతకుముందులాగే బంతి పూర్తిగా దెబ్బతిన్నప్పుడు మాత్రమే దాన్ని మార్చాల్సి ఉంటుంది.

డీఆర్ఎస్ అవుట్ విషయంలో..

వికెట్ కీపర్ పట్టిన క్యాచ్ విషయంలో బ్యాటర్ రివ్యూకు వెళ్లినప్పుడు అల్ట్రాఎడ్జ్‌లో బంతి బ్యాట్‌కు తాకిందా? ప్యాడ్‌కు తాకిందా? అని పరిశీలిస్తారు. క్యాచ్ కాదని తెలియగానే థర్డ్ అంపైర్ వెంటనే ఎల్బీ కోసం కూడా చెక్ చేస్తాడు. అయితే బాల్ ట్రాకింగ్‌లో అవుట్‌గా తేలితే అంపైర్ కాల్ ప్రకారం బ్యాటర్ పెవిలియన్‌కు చేరాల్సిందే.

పూర్తి రన్ తీయాల్సిందే..

బ్యాటర్ ఉద్దేశపూర్వకంగా తన రన్ పూర్తి చేయకుండా (క్రీజులో బ్యాట్ పెట్టకుండా) మరో సింగిల్ కోసం వెళితే ఐదు పరుగుల పెనాల్టీ విధిస్తారు. అలాగే తర్వాత బంతిని ఏ బ్యాటర్ ఎదుర్కోవాలనేది ఫీల్డింగ్ జట్టు నిర్ణయించవచ్చు.

నోబాల్ క్యాచ్‌పై..

గతంలో నోబాల్‌కు ఫీల్డర్ క్యాచ్ పట్టుకుంటే దాన్ని సరిగ్గా పట్టుకున్నాడా? లేదా? అని రివ్యూ చేసేవారు కాదు. కానీ ఇప్పుడు థర్డ్ అంపైర్ పరిశీలించి సరైన క్యాచ్ అని తేలితే బ్యాటింగ్ జట్టుకు నోబాల్ రన్ మాత్రమే ఇస్తారు. అదే క్యాచ్ సరిగ్గా లేకపోతే బ్యాటర్లు ఎన్ని పరుగులు చేస్తే అన్ని రన్స్ పరిగణనలోకి తీసుకుంటారు.

రెండో టెస్ట్‌కు బుమ్రా దూరం?



న్యూఢిల్లీ: రెండో టెస్ట్ ముందు భారత జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలేలా ఉంది. టీమిండియా ఎంతో ఆధారపడిన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా బర్మింగ్‌హామ్ టెస్ట్‌కు దూరమవుతాడన్న సంకేతాలు వినిపిస్తున్నాయి. తొలి టెస్ట్‌లో మిగతా పేసర్లు విఫలమైనా బుమ్రా ఒంటరి పోరాటం చేశాడు. అయితే, పనిభారం నిర్వహణలో భాగంగా బర్మింగ్‌హామ్ టెస్ట్‌కు బుమ్రాకు విశ్రాంతినివ్వాలని మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్టు సమాచారం. దీంతో లార్డ్స్‌లో జరిగే మూడో టెస్ట్‌కు అతడు అందుబాటులో ఉండే అవకాశం ఉంది. అయితే, లీడ్స్‌లో అనూహ్యంగా ఓటమిపాలైన భారత్.. పుంజుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని భారత మాజీ ఆటగాడు రవిశాస్త్రి చెప్పాడు. బుమ్రాకు విశ్రాంతినిస్తే భారత్ 0-2తో వెనుకబడే ప్రమాదం ఉందని హెచ్చరించాడు. 'ఈ సిరీస్‌లో మూడు టెస్టులు మాత్రమే ఆడతానని బుమ్రా చెప్పాడు. కానీ, అవి ఏవేవో చెప్పలేదు. ఒకవేళ రెండో మ్యాచ్‌కు దూరమైతే.. లార్డ్స్ టెస్ట్‌లో కచ్చితంగా ఆడాలనుకొంటాడు. అయితే, బర్మింగ్‌హామ్‌లో బుమ్రా బరిలోకి దిగకపోతే భారత్ 0-2తో వెనుకబడుతుంది. టీమిండియా పోటీలో ఉండాలంటే మాత్రం బుమ్రా ఆడి తీరాల'ని శాస్త్రి చెప్పాడు. ఇంగ్లండ్ బౌలింగ్ బలహీనంగా ఉండడంతోపాటు ఆ టీమ్‌ను గాయాల బెడద వెంటాడుతోందన్నాడు. వీటిని అవకాశాలుగా మలచుకొని భారత్ పంచ్ ఇవ్వాలని సూచించాడు. అలా జరగాలంటే టీమ్‌లో బుమ్రా ఉండాలని అన్నాడు.

హైదరాబాద్‌లో జాతీయ బాక్సింగ్

బరిలో లవ్లీనా, నిఖత్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఎలైట్ మహిళల జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌కు రంగం సిద్ధమైంది. శనివారం నుంచి హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు జరగనున్నాయి. ఒలింపియన్లు నిఖత్ జరీన్, లవ్లీనా బొర్గోహైన్, ప్రపంచ యూత్ మాజీ చాంపియన్ అంకుషిత బోరో బరిలోకి దిగుతున్నారు. మొత్తం 15 రాష్ట్రాలకు చెందిన వందమందికి పైగా బాక్సర్లు 10 కేటగిరీల్లో తలపడనున్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, తెలంగాణ బాక్సింగ్ సమాఖ్య సంయుక్తంగా ఈ టోర్నీని నిర్వహిస్తున్నాయి.

స్పాన్సర్లు లేక తరలనున్న ఢిల్లీ ఫ్రీస్టయిల్ చెస్



న్యూఢిల్లీ: స్పాన్సర్లు ముందుకు రాకపోవడంతో భారత్‌లో జరగాల్సిన ప్రతిష్ఠాత్మక ఫ్రీస్టయిల్ చెస్ టోర్నమెంట్ తరలిపోనుంది. ఈ భారత అంచె టోర్నమెంట్ సెప్టెంబరు 17 నుంచి 24 వరకు ఇక్కడ జరగాల్సి ఉంది. కానీ ఈ టోర్నీని స్పాన్సర్ చేసేందుకు దేశంలోని ఏ సంస్థా ముందుకు రాలేదట. దీంతో వరల్డ్ నెం.1 మాగ్నస్ కార్ల్‌సన్ ఆటను ప్రత్యక్షంగా చూడాలన్న భారత చెస్ అభిమానులకు నిరాశే మిగలనుంది. వివిధ అంచెలలో నిర్వహించే ఫ్రీస్టయిల్ చెస్ చాంపియన్‌షిప్‌లో..మూడు అంచెలు ముగిశాయి. కార్ల్‌సన్ 65 పాయింట్లతో టాప్‌లో ఉన్నాడు. భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి (16) ఆరో స్థానంలో కొనసాగుతున్నాడు. ఢిల్లీలో జరగాల్సింది నాలుగో అంచె టోర్నమెంట్.

నిస్సాంక అజేయ శతకం

లంక 290/2

కొలంబో: ఓపెనర్ పథుం నిస్సాంక (146 బ్యాటింగ్) అజేయ శతకంతో.. బంగ్లాదేశ్‌తో రెండో టెస్ట్‌లో శ్రీలంక భారీ ఆధిక్యానికి రంగం సిద్ధంచేసుకుంది. రెండో రోజైన గురువారం ఆట ముగిసేసరికి శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 290/2 పరుగులు సాధించింది. నిస్సాంకతోపాటు ప్రభాత్ జయసూర్య (5 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. నిస్సాంక, దినేశ్ చాందిమల్ (93) రెండో వికెట్‌కు 194 రన్స్ చేశారు. కాగా, ఓవర్‌నైట్ స్కోరు 220/8తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన బంగ్లా 247 పరుగులకు ఆలౌటైంది.

ఆసియా జూ. బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

టీమ్‌లో తన్వీ, వెన్నెల, ప్రణవ్

డబుల్స్‌లో భార్గవ్, కీర్తి జోడీలు

న్యూఢిల్లీ: ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌కు ఎంపిక చేసిన జట్టులో తెలుగు ప్లేయర్లు వెన్నెల కోలగట్ల, తన్వీ రెడ్డి అండ్లూరి, ప్రణవ్ రామ్‌తోపాటు భార్గవ్, కీర్తి జోడీలకు చోటు దక్కింది. మొత్తం 19 మంది జట్టు సభ్యులను భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) గురువారం ప్రకటించింది. ఈ టోర్నీ జూలై 18 నుంచి 27 వరకు ఇండోనేసియాలో జరగనుంది. టీమ్, వ్యక్తిగత విభాగాల్లో భారత షట్లర్లు తలపడనున్నారు. తెలంగాణకు చెందిన వెన్నెల, తన్వీ, ప్రణవ్ సింగిల్స్‌లో బరిలోకి దిగనుండగా.. మిక్స్‌డ్‌లో కీర్తి మంచాల-విష్ణు కేదార్ జోడీ ఆడనుంది. పురుషుల డబుల్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భార్గవ్ రామ్ అరిగెల్ల-విశ్వతేజ గొబ్బూరు జోడీ సత్తాచాటనుంది. గతంలో ఇదే ఈవెంట్‌లో పీవీ సింధు, లక్ష్య సేన్ స్వర్ణాలు గెలిచారు.

విశాఖ ఇండస్ట్రీస్ కేసులో హెచ్‌సీఏకు ఎదురుదెబ్బ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో వ్యాపార ప్రకటనల హక్కులకు సంబంధించి విశాఖ ఇండస్ట్రీస్‌తో జరిగిన ఒప్పందం విషయంలో హైదరాబాద్ క్రికెట్ సంఘానికి (హెచ్‌సీఏ) ఎదురుదెబ్బ తగిలింది. విశాఖ ఇండస్ట్రీస్‌తో జరిగిన ఒప్పందాన్ని అమలు చేయనందుకు హెచ్‌సీఏ రూ.25 92 కోట్లు చెల్లించాలని, ఈ మొత్తం చెల్లించే వరకు 18 శాతం వడ్డీ లెక్కగట్టాలని ఆర్బిట్రేషన్ అవార్డు జారీ అయింది. ఈ అవార్డును హెచ్‌సీఏ 2016లో కమర్షియల్ కోర్టులో సవాల్ చేయగా 2024లో కమర్షియల్ కోర్టు హెచ్‌సీఏ పిటిషన్‌ను కొట్టేసింది. కమర్షియల్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ హెచ్‌సీఏ హైకోర్టులో అప్పీల్ చేసింది. కాగా హైకోర్టులో సైతం హెచ్‌సీఏకు ఎదురుదెబ్బ తగిలింది. హెచ్‌సీఏకు వ్యతిరేకంగా జారీ అయిన ఆర్బిట్రేషన్ అవార్డును హైకోర్టు సమర్థించింది. హెచ్‌సీఏ ఏ దశలోనూ న్యాయబద్ధంగా ఆట ఆడలేదని.. కనీసం అవార్డుకు సంబంధించిన చట్టబద్ధమైన సెక్యూరిటీ డిపాజిట్ కూడా చేయలేదని హైకోర్టు తప్పుబట్టింది. హెచ్‌సీఏ క్రీడా స్ఫూర్తిలేని తన అసలు రంగును బయటపెట్టిందని హైకోర్టు వ్యాఖ్యానించింది.

వెస్టిండీస్ 190 ఆలౌట్

బార్బడోస్: ఆస్ట్రేలియా-వెస్టిండీస్ జట్ల మధ్య జరుగుతున్న తొలి టెస్టులో బౌలర్ల ఆధిపత్యం సాగుతోంది. తొలి ఐదు సెషన్లలోనే ఇరు జట్లు ఆలౌట్ కావడం విశేషం. గురువారం రెండో రోజు టీ విరామ సమయానికి విండీస్ తొలి ఇన్నింగ్స్‌ను 63.2 ఓవర్లలో 190 పరుగుల దగ్గర ముగించింది. దీంతో 10 పరుగుల స్వల్ప ఆధిక్యం దక్కింది. హోప్ (48), చేజ్ (44) రాణించారు. స్టార్క్‌కు 3... వెబ్‌స్టర్, హాజెల్‌వుడ్, కమిన్స్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. అంతకుముందు ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగులకే కుప్పకూలింది. హెడ్ (59), ఖవాజా (47), కమిన్స్ (28) ఆకట్టుకున్నారు.

బిజినెస్

వడ్డీ రేట్లను వెంటనే తగ్గించండి

- జాప్యం చేయొద్దు
- బ్యాంకులకు ఆర్‌బీఐ సూచన



ముంబై: తగ్గిన రెపో రేటుకు అనుగుణంగా బ్యాంకులన్నీ తమ రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కోరింది. ఈ నెల 6న జరిగిన ద్వైమాసిక ద్రవ్య పరపతి సమీక్షలో ఆర్‌బీఐ కీలక రెపో రేటును ఆరు శాతం నుంచి 5.5 శాతానికి కుదించింది. ఈ నేపథ్యంలో తగ్గించిన రెపో రేటు స్థాయిలోనే బ్యాంకులు వెంటనే తమ రుణాలపై వసూలు చేసే వడ్డీ రేట్లు తగ్గించాలని గురువారం వెలువడిన జూన్ నెల ఆర్‌బీఐ బులెటిన్‌లో ప్రచురితమైన ఒక వ్యాసంలో ఆర్థికవేత్తలు సూచించించారు. బ్యాంకులు ఆర్‌బీఐ వద్ద హామీగా ఉంచాల్సిన నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్)నీ ఆర్‌బీఐ ఈ నెల 6న నాలుగు నుంచి మూడు శాతానికి కుదించింది. దీంతో ఈ ఏడాది చివరికల్లా బ్యాంకులకు రూ.2.5 లక్షల కోట్ల నిధులు అదనంగా అందుబాటులోకి రానున్నాయి. ఇవన్నీ బ్యాంకుల వడ్డీ రేట్లు తగ్గించేందుకు అనువైన పరిస్థితులేనని ఆ బులెటిన్ పేర్కొంది.

పరోక్ష మొట్టికాయ: రెపో రేటు తగ్గించిన కొద్ది రోజులకే ఎస్‌బీఐ, బీఓబీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో పాటు అనేక బ్యాంకులు తమ రుణాలపై వడ్డీ రేట్లను అర శాతం (0.5%) తగ్గిస్తున్నట్టు ప్రకటించాయి. ఇంకా కొన్ని బ్యాంకులు ఈ తగ్గింపును తమ రుణ ఖాతాదారులకు బదిలీ చేసేందుకు మీనమేషాలు లెక్కబెడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ తాజా బులెటిన్ ఆ బ్యాంకులను సుతిమెత్తగా హెచ్చరించిందని భావిస్తున్నారు.

పోకో ఎఫ్7 5జీ స్మార్ట్‌ఫోన్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ పోకో.. మార్కెట్లోకి సరికొత్త 5జీ స్మార్ట్‌ఫోన్ పోకో ఎఫ్7 విడుదల చేసింది. భారత్‌లోనే తొలిసారిగా 7,550 ఎంఏహెచ్ బ్యాటరీతో దీన్ని రూపొందించినట్లు సంస్థ ప్రొడక్ట్ మేనేజర్ సచిన్ దేవ్ వెల్లడించారు. సిలికాన్ కార్బన్‌తో కూడిన ఈ బ్యాటరీ దీర్ఘకాలం సమర్థవంతంగా పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. స్నాప్‌డ్రాగన్ 8ఎస్ జెన్ 4 చిప్‌సెట్, 6.83 అంగుళాల స్క్రీన్, 50 ఎంపీ సోనీ ఐమ్యాక్స్882 కెమెరాతో రెండు వేరియంట్లలో ఈ ఫోన్ అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. 12 జీబీ రామ్, 256 జీబీ మెమరీతో కూడిన ఎఫ్ 7 ధర రూ.29,999గా ఉండగా 12 జీబీ రామ్ 512 జీబీ మెమరీతో కూడిన ఫోన్ ధర రూ.31,299గా ఉంది. జూలై 1న ఈ-కామర్స్ పోర్టల్ ఫ్లిప్‌కార్ట్ ద్వారా ఈ ఫోన్‌ను విడుదల చేయనున్నట్లు సచిన్ తెలిపారు.

ఇళ్ల అమ్మకాలకు ధరల పోటు

20%పడిపోయిన అమ్మకాలు: అనరాక్

న్యూఢిల్లీ: హైదరాబాద్‌తో సహా దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో ఇళ్ల అమ్మకాలు నేలచూపులు చూస్తున్నాయి. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో ఈ ఏడు నగరాల్లో 1,20,335 ఇళ్లు, ఫ్లాట్లు మాత్రమే అమ్ముడయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 20 శాతం తక్కువ. రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ అనరాక్ గురువారం విడుదల చేసిన ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది. పుణె, హైదరాబాద్ నగరాల్లో ఈ తగ్గుదల మరింత ఎక్కువగా 27 శాతం వరకు ఉంది. ఈ కాలంలో హైదరాబాద్‌లో అమ్మకాలు 15,085 యూనిట్ల నుంచి 11,040 యూనిట్లకు పడిపోయాయి. చెన్నైలో మాత్రం గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో అమ్మకాలు 11 శాతం పెరిగాయి. గత ఏడాది తొలి 6 నెలలతో పోలిస్తే ధరలు 11 శాతం పెరగడం, జాతీయ, అంతర్జాతీయ ఉద్రిక్తతలు ఇందుకు కారణమని అనరాక్ చైర్మన్ అనూజ్ పురి చెప్పారు.

ఆఫీస్ స్పేస్ లీజింగ్‌లో పెరుగుదల: నివాస గృహాల మార్కెట్ అంతంత మాత్రంగానే ఉన్నా ఆఫీస్ కార్యాలయాలకు మాత్రం మంచి గిరాకీ ఏర్పడింది. దీంతో గత మూడు నెలల్లో (ఏప్రిల్-జూన్) ఈ ఏడు ప్రధాన నగరాల్లో 178 లక్షల చదరపు అడుగుల లీజుకు సంబంధించిన ఒప్పందాలు జరిగాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 11 శాతం ఎక్కువని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ కోలియర్స్ ఇండియా తెలిపింది. ఈ కాలంలో హైదరాబాద్‌లో 32 లక్షల ఎస్ఎఫ్‌టీ ఆఫీస్ స్పేస్ లీజుకు సంబంధించి ఒప్పందాలు కుదిరాయి.

బ్రాండ్ బాజా..

సత్తా చాటుతున్న దేశీయ కంపెనీల బ్రాండ్లు

- టాప్-100 బ్రాండ్స్ విలువ రూ.20.27 లక్షల కోట్లు
- అగ్రస్థానంలో టాటా బ్రాండ్ : బ్రాండ్ ఫైనాన్స్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: బ్రాండ్ వాల్యూ విషయంలో మన దేశీయ కంపెనీలూ సత్తా చాటుతున్నాయి. ప్రస్తుతం భారత్‌లోని టాప్-100 కంపెనీల బ్రాండ్ వాల్యూ 23,650 కోట్ల డాలర్ల (సుమారు రూ.20.27 లక్షల కోట్లు) వరకు ఉంటుందని బ్రాండ్ ఫైనాన్స్ ఇండియా సంస్థ ఒక నివేదికలో తెలిపింది. ఇందులో టాటా గ్రూప్ బ్రాండ్ విలువే 3,160 కోట్ల డాలర్ల (సుమారు రూ.2.78 లక్షల కోట్లు) మేర ఉందని తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం టాటా గ్రూప్ బ్రాండ్ విలువ 10 శాతం పెరిగింది. బ్రాండ్ వాల్యూ 3,000 కోట్ల డాలర్లకు మించిన తొలి భారత పారిశ్రామిక గ్రూప్ కూడా టాటా గ్రూపేనని బ్రాండ్ ఫైనాన్స్ ఇండియా తెలిపింది. బ్రాండ్ వాల్యూపరంగా టాటా గ్రూప్ తర్వాత ఇన్ఫోసిస్ (1,630 కోట్ల డాలర్లు), హెచ్‌డీఎఫ్‌సీ గ్రూప్ (1,420 కోట్ల డాలర్లు), ఎల్ఐసీ (1,360 కోట్ల డాలర్లు), రిలయన్స్ గ్రూప్ (980 కోట్ల డాలర్లు), ఎస్‌బీఐ గ్రూప్ (960 కోట్ల డాలర్లు), హెచ్‌సీఎల్ టెక్ (890 కోట్ల డాలర్లు), ఎయిర్‌టెల్ (770 కోట్ల డాలర్లు), ఎల్ అండ్ టీ గ్రూప్ (740 కోట్ల డాలర్లు), మహీంద్రా గ్రూప్ (720 కోట్ల డాలర్లు) వరుసగా తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

పటిష్ఠమైన టాప్-10 బ్రాండ్ కంపెనీలు

కంపెనీ పేరు	పాయింట్ల వారీగా
తాజ్ హోటల్స్	92.2
ఏషియన్ పెయింట్స్	92.0
అమూల్	91.2
హీరో	91.0
తనిష్క్	90.0
మారుతి సుజుకీ	89.1
రాయల్ ఎన్‌ఫీల్డ్	88.7
ఎల్ఐసీ గ్రూప్	87.6
ఇండిగో	87.6
హెచ్‌డీఎఫ్‌సీ గ్రూప్	86.4

దూకుడుగా అదానీ గ్రూప్

ఇక వేగంగా బ్రాండ్ వాల్యూ పెంచుకుంటున్న పారిశ్రామిక సంస్థల్లో అదానీ గ్రూప్ అగ్రస్థానంలో ఉంది. గత సంవత్సర కాలంలో ఈ గ్రూప్ బ్రాండ్ వాల్యూ 82 శాతం పెరిగింది. కంపెనీల పరంగా చూస్తే తాజ్ హోటల్స్, ఏషియన్ పెయింట్స్, అమూల్ ముందున్నాయి.

హైదరాబాద్‌లో బృహస్పతి టెక్నాలజీస్ ప్లాంట్

రూ.70 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత నిఘా, సెక్యూరిటీ సొల్యూషన్స్ ప్రొవైడర్ బృహస్పతి టెక్నాలజీస్ లిమిటెడ్ రూ.70 కోట్ల పెట్టుబడితో సీసీటీవీ తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. గురువారం నాడిక్కడ కంపెనీ ఎండీ రాజశేఖర్ పాపోలు మాట్లాడుతూ.. హైదరాబాద్ సమీపంలోని తునికి బొల్లారంలో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. నెలకు 2.5 లక్షల యూనిట్ల సామర్థ్యంతో నెలకొల్పుతున్న ఈ ప్లాంట్ వచ్చే మార్చి నాటికి అందుబాటులోకి రానుందన్నారు. కంపెనీ ఇప్పటికే పటాన్‌చెరులో అసెంబ్లింగ్ యూనిట్‌ను నిర్వహిస్తోందని తెలిపారు.

కాగా విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) అయిన కింగ్స్‌మెన్ గ్లోబల్, సిట్రస్ గ్లోబల్ నుంచి రూ.85 కోట్ల నిధులను సమీకరించినట్లు రాజశేఖర్ వెల్లడించారు. అలాగే మహారాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఎంఎస్ఆర్‌టీసీ) నుంచి రూ.102 కోట్ల విలువైన కాంట్రాక్టును దక్కించుకున్నట్లు ఆయన చెప్పారు. కాగా 2026-27 ఆర్థిక సంవత్సరంలో పబ్లిక్ ఇష్యూకి రావాలని చూస్తున్నట్లు ఆయన చెప్పారు. గడిచిన ఆర్థిక సంవత్సరం కంపెనీ టర్నోవర్ రూ.250 కోట్లుగా ఉండగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.450 కోట్ల టర్నోవర్‌ను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాజశేఖర్ తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



27వ తేదీ			
హైదరాబాద్	550	విజయవాడ	575
వరంగల్	552	గోదావరి	560
చిత్తూరు	623	విశాఖపట్నం	575
		దజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	93	విజయవాడ	100
వరంగల్	93	గుంటూరు	105
కరీంనగర్	93	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	93	చిత్తూరు	103
కర్నూలు	93	నెల్లూరు	108
విశాఖపట్నం	89	అనంతపురం	108
గోదావరి	100		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,900 ▼	90,650 ▼	1,18,000 ▼
విజయవాడ	1,00,000 ▲	94,000 ▲	1,10,000 ▲
విశాఖపట్నం	1,00,220 ▲	90,700 ▼	1,18,000 ▼
రాజమండ్రి	98,950 ▼	90,700 ▼	1,08,800 ▼
ప్రొద్దుటూరు	97,700 ▼	89,880 ▼	1,07,500 ▲
ముంబై	97,159 ▼	88,998 ▼	1,07,150 ▲

3 రోజులు.. రూ.9.70 లక్షల కోట్లు

మార్కెట్లో అదే జోరు.. సెన్సెక్స్ 1000 పాయింట్లు అప్

ముంబై: పశ్చిమాసియా ఉద్రిక్తతలు సడలిన నేపథ్యంలో ఈక్విటీ మార్కెట్ వరుసగా మూడో రోజు కూడా ర్యాలీలో పురోగమించింది. ప్రపంచ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు రావడంతో పాటు మార్కెట్ దిగ్గజాలైన హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్, ఐసీఐసీఐ బ్యాంక్ కౌంటర్లలో జరిగిన భారీ కొనుగోళ్లు మార్కెట్‌ను గురువారం ఉరకలెత్తించాయి. అంతర్జాతీయ విపణిలో అదుపులోనే ఉన్న క్రూడాయిల్ ధర (బ్యారెల్ 67.80 డాలర్లు) సైతం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచింది. ఈ నేపథ్యంలో గురువారం సెన్సెక్స్ 1000.36 పాయింట్లు లాభపడి 83,755.87 వద్ద ముగియగా నిఫ్టీ 304.25 పాయింట్లు లాభపడి 25,549 వద్ద క్లోజైంది. మూడు వరుస సెషన్లలో సెన్సెక్స్ 1859.08 పాయింట్లు లాభపడింది. బీఎస్ఈలో లిస్ట్ అయిన కంపెనీల మార్కెట్ విలువ మూడు రోజుల్లో రూ.9.7 లక్షల కోట్లు పెరిగి రూ.457 లక్షల కోట్లకు చేరింది.

ఆర్ఐఎల్ మళ్లీ 20 లక్షల కోట్ల శిఖరం పైకి...

అత్యంత విలువైన దేశీయ కంపెనీ అయిన రిలయన్స్ ఇండస్ట్రీస్ మరోసారి రూ.20 లక్షల కోట్ల మార్కెట్ విలువ గల కంపెనీగా అవతరించింది. గురువారం బీఎస్ఈలో ఆర్ఐఎల్ షేరు 1.90% లాభపడి రూ.1,495.20 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో సైతం అదే శాతం లాభంతో రూ.1,495.30 వద్ద ముగిసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.37,837.9 కోట్లు పెరిగి రూ.20,23,375.31 కోట్లకు చేరింది. ఈ ఏడాది ఇప్పటికి రిలయన్స్ షేరు 23 శాతం లాభపడగా ఫిబ్రవరి 13వ తేదీన ఆర్ఐఎల్ తొలిసారిగా రూ.20 లక్షల కీలకమైన మైలురాయిని చేరింది. మార్కెట్ విలువపరంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (రూ.15,51,218.93 కోట్లు), టీసీఎస్ (రూ.12,45,219.09 కోట్లు), భారతి ఎయిర్‌టెల్ (రూ.11,4,8,518.05 కోట్లు), ఐసీఐసీఐ బ్యాంక్ (రూ.10,27,838.79 కోట్లు)తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

ఎన్ఎస్ఈలో ఎలక్ట్రిసిటీ ఫ్యూచర్స్

రాబోయే రెండు, మూడు వారాల్లో ఎలక్ట్రిసిటీ ఫ్యూచర్స్ కాంట్రాక్టులు ప్రవేశపెట్టనున్నట్టు ఎన్ఎస్ఈ ప్రకటించింది. విద్యుత్ కొనుగోలుదారులు, విక్రేతలు, ట్రేడర్లు, పారిశ్రామిక రంగం, రిటైలర్లు ధరల రిస్క్ తగ్గించుకోవడానికి ఈ చర్య దోహదపడుతుందని తెలిపింది. త్వరలోనే దీని ప్రారంభ తేదీని ప్రకటించనున్నట్టు ఎన్ఎస్ఈ పవర్ విభాగం హెడ్ హరీశ్ అహూజా తెలిపారు.

నెస్లె ఇండియా 1:1 బోనస్ షేరు

ఎఫ్ఎంసీజీ దిగ్గజం నెస్లె ఇండియా డైరెక్టర్ల బోర్డు బోనస్ షేర్ల జారీకి అనుమతించింది. ప్రస్తుత షేర్‌హోల్డర్లందరికీ వారి వద్ద గల రూపాయి ముఖ విలువ గల ఒక్కో షేరుకు అదే ముఖ విలువ గల ఒక షేరు బోనస్‌గా జారీ చేయనున్నట్టు తెలిపింది. ఇందుకు రికార్డు తేదీని త్వరలో ప్రకటించనున్నట్టు వెల్లడించింది. ఈ నిర్ణయం వచ్చే నెల 24వ తేదీన జరుగనున్న కంపెనీ వాటాదారుల అసాధారణ సర్వసభ్య సమావేశం (ఈజీఎం) అనుమతికి లోబడి ఉంటుందని చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సురేశ్ నారాయణన్ తెలిపారు.



చిత్రజ్యోతి

★ SINCE 1965 ★


'కన్నప్ప' కల్పితం కాదు.. మన చరిత్ర!



\- మంచు విష్ణు

'కన్నప్ప అనే శివ భక్తుడు ఉండేవాడు. ఇప్పటికీ ఆయనను ఆరాధిస్తుంటారు. 'కన్నప్ప' సినిమా కథ కల్పితం కాదు.. అది మన చరిత్ర. మన మధ్యలో జీవించిన ఓ వ్యక్తి కథ' అని అన్నారు హీరో మంచు విష్ణు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'కన్నప్ప' ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. కార్యక్రమంలో మంచు విష్ణు మాట్లాడుతూ 'ఈ సినిమాకు ఇప్పటి వరకు లక్షకు పైగా టికెట్లు తెగాయి. ఇదంతా శివ లీల అనిపిస్తోంది. కుటుంబమంతా కలసి ఈ చిత్రాన్ని హాయిగా చూడాలని కోరుకుంటున్నాను. అందుకే నేను టికెట్ రేట్లు పెంచలేదు. ఏపీలో కొన్ని చోట్ల మాత్రమే పెంచాం. నా నలుగురు పిల్లలు ఈ చిత్రంలో నటించారు. ఓ తండ్రిగా నా పిల్లల్ని తెరపై చూడటం ఆనందంగా ఉంది. దేవుడు, భక్తుడికి మధ్యలో ఎవరూ ఉండాల్సిన పని లేదు. మూఢ నమ్మకాలు అవసరం లేదు. దేవుడి మీద మనసారా భక్తి ఉంటే చాలు అని చెప్పాలని అనుకున్నాం. ఈ చిత్రంలో మోహన్‌లాల్ పాత్ర ఎవరూ ఊహించని విధంగా ఉంటుంది. ఆ శివుడి ఆశీస్సులతో ఈ శుక్రవారం నాది అవుతుంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు ముఖేశ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ "కన్నప్ప' చరిత్రను నేటి తరానికి తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఈ సినిమా తీశాం' అని చెప్పారు. నటుడు శివ బాలాజీ మాట్లాడుతూ 'ఇలాంటి సినిమాలు చాలా అరుదుగా వస్తుంటాయి. ఒట్టేసి చెబుతున్నా అద్భుతంగా ఉంటుంది' అని అన్నారు. నటుడు కౌశల్ మాట్లాడుతూ 'ప్రస్తుత తరమంతా 'కన్నప్ప' చిత్రాన్ని చూడాలి' అని కోరారు.

హుషారైన గీతం



రజనీకాంత్ కథానాయకుడిగా లోకేశ్ కనగరాజ్ తెరకెక్కిస్తున్న చిత్రం 'కూలీ'. నాగార్జున, ఆమిర్ ఖాన్, ఉపేంద్ర, శ్రుతి హాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. ఆగస్టు 14న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా తెలుగు థియేట్రికల్ రైట్స్‌ను డి.సురేశ్‌బాబు, సునీల్ నారంగ్, దిల్ రాజు భారీ ధరకు సొంతం చేసుకున్నారు. ఏషియన్ సురేశ్ ఎంటర్టైన్‌మెంట్స్ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో సినిమా విడుదలవుతోంది. తాజాగా చిత్రం నుంచి ఫస్ట్ సింగిల్ 'చికిటు'ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ హుషారైన గీతంలో వింటేజ్ స్టైల్లో అదిరిపోయే స్టెప్పులతో అభిమానుల్ని ఖుషీ చేశారు రజనీకాంత్.









శ్రీశైలం జలాశయంలోకి చేరిన నీరు

శ్రీశైలం జలాశయానికి భారీగా వరద

నంద్యాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాలైన కర్ణాటక, మహారాష్ట్ర పశ్చిమ కనుమల్లో కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం జలాశయానికి భారీగా వరద కొనసాగుతోంది. బుధవారం నుంచి గురువారం సాయంత్రానికి 88,272 క్యూసెక్కుల మేర వరద నీరు వచ్చి చేరింది. జలాశయం బ్యాక్ వాటర్ నుంచి కల్వకుర్తి ఎత్తిపోతలకు 1,144 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జలాశయంలో ప్రస్తుతం 115.7856 టీఎంసీల నీటి లభ్యత ఉండగా.. నీటి మట్టం 863.10 అడుగులకు చేరుకుంది. మరోవైపు, వారం రోజులుగా రెండు పంపు హౌస్‌ల్లోని విద్యుత్ ఉత్పాదన తాత్కాలికంగా నిలిపివేశారు.

నేడు గుంటూరులో జాతీయ స్థాయి 'ఏఐ హ్యాకథాన్'

» సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభం: డీజీపీ హరీశ్ గుప్తా

అమరావతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజా సమస్యలు పరిష్కరించే క్రమంలో వేగంతోపాటు నాణ్యత పెరగాలంటే టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలన్న సీఎం చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా.. జనరేటివ్ ఏఐ, ఏజెంటిక్ ఏఐ ద్వారా సమస్యల్ని అధిగమించి, పోలీసు సేవల్లో నాణ్యత పెంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా చెప్పారు. అందులో భాగంగా సీఎం చేతుల మీదుగా గుంటూరులో 'ఏఐ హ్యాకథాన్'ను శుక్రవారం ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుత సవాళ్లతోపాటు రాబోయేరోజుల్లో ఎదురయ్యే వాటిని ఎదుర్కొనేందుకు వీలుగా ఏఐ నిపుణులు ఇచ్చేటూల్స్‌ను ఎంపిక చేసుకుని రూ.పది లక్షలవరకు బహుమతులు ఇస్తామని డీజీపీ చెప్పారు.

వాచ్‌డాగ్‌లా పిటిషన్ల కమిటీ : డిప్యూటీ స్పీకర్

అమరావతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ పిటిషన్ల కమిటీకి, ప్రభుత్వానికి సంబంధం లేదని అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అన్నారు. ప్రజా సమస్యల స్వీకారం, జనంలో చైతన్యం తీసుకొచ్చే క్రమంలో సర్కారుపై వాచ్‌డాగ్‌లాగా ఈ కమిటీ ఉంటుందని, ఇది లోక్‌పాల్‌వంటిదని తెలిపారు. గురువారం అమరావతి శాసనసభ భవనంలో కమిటీ సభ్యులైన ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజుతో కలిసి రఘురామరాజు మీడియా సమావేశం నిర్వహించారు. బెట్టింగ్ యాప్స్, లోన్ యాప్స్ వల్ల ఎంతో మంది అమాయకులు మోసపోతున్నారని, అటువంటి సైబర్ క్రైమ్స్ నుంచి అమాయకులను కాపాడేందుకు బలమైన చట్టాలు, వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిటిషన్ల కమిటీ అభిప్రాయపడుతున్నట్లు తెలిపారు. ఈ అంశంపై వచ్చే శాసనసభ సమావేశాల్లో చర్చ జరిగే విధంగా చూస్తామనానరు. ఈవిషయాలపై మరింతలోతుగా చర్చ జరిపేందుకు వచ్చే నెల 18వ తేదీన జరిగే పిటిషన్ల కమిటీ సమావేశానికి ఐటీ, హోం శాఖల ఉన్నతాధికారులను కూడా ఆహ్వానిస్తామన్నారు. ఇకనుంచి పిటిషన్ల కమిటీ సమావేశం ప్రతి 15 రోజులకోసారి నిర్వహిస్తామన్నారు. శాసనసభ కనీసం 60 రోజులైనా నడవాలని పిటిషన్ వచ్చిందని, దానిపైనా 18న చర్చిస్తామ ని, ప్రతి 3నెలలకోసారి అసెంబ్లీ సమావేశాలు ఉండేలాచూడాలని అభిప్రాయపడ్డారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనలపై సీఎస్‌కు లేఖ రాస్తా

'సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యేలకు అవమానం జరిగింది. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని సీఎస్‌కు లేఖ రాస్తున్నా' అని శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అన్నారు.

సీఆర్‌డీఏలో 40 పట్టణ ప్రణాళిక అసిస్టెంట్ పోస్టులు

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సీఆర్‌డీఏలో మొత్తం 64 బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ, కొత్తగా 40 పట్టణ ప్రణాళిక అసిస్టెంట్ పోస్టులను సృష్టిస్తూ మున్సిపల్‌శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ప్రణాళిక డివిజన్‌లో ఉన్న ప్లానింగ్ అసిస్టెంట్‌తో సమానమైన పోస్టుగా వీటిని పేర్కొన్నారు. ఈ పట్టణ ప్రణాళిక అసిస్టెంట్ రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకోవడం ద్వారా జోనల్ అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టుకు పదోన్నతి కావొచ్చని పేర్కొన్నారు.

విశాఖ డెయిరీ అక్రమాలపై సభా సంఘం భేటీ

అమరావతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీలో అవకతవకలు, అక్రమాలపై ఏర్పాటైన ప్రత్యేక సభా సంఘం గురువారం శాసనసభ భవనంలో సమావేశమైంది. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అధ్యక్షతన జరిగిన భేటీలో విశాఖ డెయిరీలో అవకతవకలపై అధికారులతో సభా సంఘ చర్చించింది. సభా సంఘ సభ్యులు పల్లా శ్రీనివాసరావు, దాట్ల సుబ్బరాజు, కార్మికశాఖ ప్రత్యేక కార్యదర్శి గంధం చంద్రుడు, శాసనసభ ఉప కార్యదర్శి రాజ్‌కుమార్, విశాఖ డెయిరీ చైర్మన్ అడారి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

114 వార్డ్ సచివాలయాల రీగ్రూపింగ్

అమరావతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల నుంచి వార్డ్ సచివాలయాలుగా మారిన 114 సచివాలయాల్లో ఉద్యోగులను తిరిగి గ్రామ సచివాలయాల మాదిరిగా రీగ్రూపింగ్ చేయాలంటూ గ్రామ, వార్డ్ సచివాలయాలశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

గిరిజన గురుకుల టీచర్ల కాంట్రాక్టు రెన్యువల్

గిరిజన సంక్షేమశాఖ గురుకులాల్లో పనిచేస్తున్న 1659 ఔట్‌సోర్సింగ్ టీచింగ్ సిబ్బందిని రెన్యువల్ చేస్తూ గిరిజన సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది.

ఆమె నా ప్రియురాలు.. పెళ్లాపండి!

» సినీ ఫక్కీలో 'హల్దీ'ని అడ్డుకున్న యువకుడు.. ఆగిపోయిన వివాహం

» జీవితం నాశనం చేశాడంటూ పోలీసులకు యువతి ఫిర్యాదు

నెల్లూరు (క్రైం), జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కల్యాణ మండపంలో బంధుమిత్రులు, పెళ్లి కొడుకు సమక్షంలో వధువుకు సంప్రదాయబద్ధంగా హల్దీ (నలుగు కార్యక్రమం) వేడుక జరుగుతోంది. ఇంతో ఓ యువకుడు సినీ ఫక్కీలో తన స్నేహితులతో వేదిక వద్దకు వచ్చాడు. 'పెళ్లి ఆపండి. నేనూ పెళ్లికూతురు పదేళ్లుగా ప్రేమించుకుంటున్నాం' అంటూ అక్కడే ఉన్న సారెపళ్లెన్ని కాలితో తన్నాడు. ఊహించని ఈ ఘటనతో అందరూ నిర్ఘాంతపోయారు. చివరికి పెళ్లాగిపోయింది. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని నవాబుపేట ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన యువతి లేగుంటపాడులో ఉంటున్న తన సమీప బంధువు ఇంటికి తరచూ వెళుతుండేది. ఈ క్రమంలో 2022లో నందవర్ధన్ అనే యువకుడితో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఇద్దరి పరిచయంపై ఇంట్లో తెలియడంతో ఆమె అతడితో మాట్లాడటం మానేసింది. దీంతో నందవర్ధన్ యువతి వెంటబడుతూ మాట్లాడక పోతే మనం తీసుకున్న ఫొటోలు అందరికీ చూపిస్తానని బెదిరించేవాడు. ఆమెకు పెళ్లి సంబంధాలు వచ్చినా చెడగొట్టేవాడు. దీంతో యువతి కుటుంబ సభ్యులు నవాబుపేట స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు అతడిని పిలిపించి మందలించారు. ఈ క్రమంలో ఈ నెల 22న పెద్దలు యువతికి వివాహం నిశ్చయించారు. నగరంలోని ఓ కల్యాణ మండపంలో బంధువులు, పెళ్లికొడుకు సమక్షంలో హల్దీ కార్యక్రమం జరుగుతుండగా.. నందవర్ధన్ తన స్నేహితులతో అక్కడికి వచ్చాడు. పదేళ్లుగా తామిద్దరం ప్రేమించుకుంటున్నామంటూ యువతిని కాలితో తన్నడానికి ప్రయత్నించి అక్క డే ఉన్న సారెపళ్లెన్ని తన్ని దౌర్జన్యం చేశాడు. చివరికి పెళ్లి ఆగిపోయింది. దీంతో యువతి ఈనెల 25వ తేదీ రాత్రి వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మెరిట్ ఎస్సీ,ఎస్టీలను పరిగణించరాదు

» సచివాలయ పదోన్నతులపై మార్గదర్శకాలు

అమరావతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో సెక్షన్ ఆఫీసర్లు, అసిస్టెంట్ సెక్రటరీలు, జాయింట్ సెక్రటరీలు, అడిషనల్ సెక్రటరీల్లో (నాన్ కేడర్) ఎస్సీ, ఎస్టీ అధికారుల పదోన్నతులపై సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలు రూపొందించింది. అవి ఇలా ఉన్నాయి. మెరిట్, సీనియారిటీ ద్వారా ఎస్సీ,ఎస్టీ ఉద్యోగులు పొందిన పదోన్నతులను వారికిచ్చిన 15శాతం, 6శాతం రిజర్వేషన్లలో లెక్కించరాదు. మెరిట్ పోను మిగిలిన పోస్టుల్లో ఎస్సీ, ఎస్టీలకు వరుసగా 15, 6శాతం రిజర్వేషన్లు కల్పించాలి. ప్యానల్ సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు పూర్తిగా అమలైతే వాటిని సమీక్షించాల్సిన అవసరం లేదు. అయితే ఈ రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదు. ఏదైనా కేటగిరీలో ఎస్సీ,ఎస్టీలు సరిపోయినంత మంది లేకుంటే, జనరల్ సీనియారిటీని పరిగణనలోకి తీసుకోవాలి. వీటితోపాటు మరికొన్ని మార్గదర్శకాలు ఉన్నాయి.

ఫోన్ ట్యాపింగ్‌పై నేడు 'ఆంధ్రజ్యోతి' ఎండీ వాంగ్మూలం

» విచారణకు రావాలని రాధాకృష్ణకు సిట్ నోటీసు

» చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికీ పిలుపు

» అక్రమ ఫోన్ ట్యాపింగ్‌లో బాధితులెందరో!

» ఎస్ఐబీ సీడీఆర్‌లో 615 ఫోన్ నెంబర్లు

» సీడీఆర్ ఆధారంగా బాధితుల వాంగ్మూలాల నమోదు

» పక్కాగా సాక్ష్యాధారాలు సేకరించడానికి సిట్ ప్రయత్నం



హైదరాబాద్,జూన్26(ఆంధ్రజ్యోతి) ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి ఎస్ఐబీ వద్ద ఉన్న కాల్ డిటైల్స్ రికార్డు(సీడీఆర్)లో మీ ఫోన్ నెంబర్ ఉందని, శుక్రవారం ఉదయం 11 గంటలకు సిట్ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణకు సిట్ అధికారులు గురువారం నోటీసు జారీ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో భాగంగా మీ వాంగ్మూలం అవసరం ఉందని నోటీసులో పేర్కొన్నారు. సిట్ అధికారులు ఇచ్చిన నోటీసు మేరకు శుక్రవారం రాధాకృష్ణ విచారణకు హాజరుకానున్నారు. ఇదే విధంగా చేవెళ్ల ఎంపీ, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్ అయ్యిందని, విచారణకు రావాలని ఆయనకు కూడా సిట్ నుంచి పిలుపు అందినట్లు సమాచారం. 2023 నవంబర్ నెలలో కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఫోన్ నెంబర్‌ను ట్యాపింగ్ చేసినట్లు సిట్ గుర్తించింది.

రివ్యూ కమిటీ లేఖలతోనే చిక్కిన ముఠా..

నాటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెద్దలు చెప్పారంటూ వారు, వీరు అనే తేడా లేకుండా సొంత పార్టీ నేతలు మొదలు ప్రతిపక్ష పార్టీల నేతలు, జర్నలిస్టులు, న్యాయమూర్తులు, సినీ ప్రముఖులు, పారిశ్రామికవేత్తల ఫోన్లను అక్రమంగా ట్యాపింగ్ చేసిన ప్రభాకర్‌రావు నేతృత్వంలోని ఎస్ఐబీ బృందం అతి తెలివితో అసలైన ఆధారాలను వదిలివేసి సిట్‌కు చిక్కింది. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి అనధికారికంగా కొండంత చేయగా, అధికారికంగా చేసిన ట్యాపింగ్‌లోనే నాటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు దొరికి పోయారని దర్యాప్తు అధికారులు పేర్కొంటున్నారు. మావోయిస్టుల సమాచారం కోసమంటూ ప్రముఖుల ఫోన్ నెంబర్లను రివ్యూ కమిటీకి పంపిన ప్రభాకర్‌రావు తెలిసే నేరానికి పాల్పడ్డారని, ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చారని దర్యాప్తులో వెల్లడైంది. 2023 నవంబర్ నెలకు సంబంధించి 615 మంది ఫోన్ నెంబర్లనుట్యాపింగ్ చేయడానికి రివ్యూ కమిటీకి తప్పుడు సమాచారం ఇచ్చి అనుమతి పొందిన విషయాన్ని న్యాయస్థానంలో రుజువు చేయడం కోసమే సిట్ అధికారులు ఆయా బాధితుల వాంగ్మూలాలను నమోదు చేస్తున్నారు. ప్రభాకర్‌రావు బృందం తమ టార్గెట్ అయిన వారి ఫోన్ నెంబర్లకు వచ్చిన కాల్స్ వినడమే కాకుండా ఇంటర్నెట్ ప్రొటోకాల్ డేటా రికార్డు(ఐపీడీఆర్)ను కూడా ఉపయోగించారని దర్యాప్తు అధికారులు పేర్కొంటున్నారు. ప్రత్యేక టూల్స్ ద్వారా వాట్సాప్ కాల్స్, వాట్సాప్ చాట్స్ ప్రభాకర్‌రావు ముఠా తెలుసుకుందని, వాటి ఆధారంగా పలు బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులు వచ్చాయి. మావోయిస్టుల పేరుతో అనుమతులు తీసుకుని ట్యాపింగ్ చేసినదే కాకుండా ఇజ్రాయిల్ నుంచి తెప్పించిన పెగాసస్ సాఫ్ట్‌వేర్‌ను ప్రైవేట్ వార్ రూమ్స్‌లో పెట్టి సిగ్నల్, ఫేస్‌బుక్ కాల్స్‌ను సైతం ప్రభాకర్‌రావు ముఠా విన్నారని ఆరోపణలు వస్తున్న సంగతి విదితమే. అయితే, ప్రభాకర్ రావు ముఠా పెగాసస్ స్పైవేర్ ఉపయోగించి విన్న, రికార్డు చేసిన సంభాషణలకు సంబంధించిన డేటాను పూర్తిగా ధ్వంసం చేసినట్లు సిట్ అధికారులు అంతర్గత సంభాషణల్లో పేర్కొంటున్నారు.

మైనింగ్ అక్రమాలపై ఉక్కుపాదం

చిన్నతరహా ఖనిజాల అక్రమ తవ్వకం, రవాణాకు అడ్డుకట్ట.. మైనర్ మినరల్ నిబంధనల్లో కీలక సవరణలు

అమరావతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇసుక, మట్టి, గ్రావెల్, ఇతర చిన్న తరహా ఖనిజాల అక్రమ మైనింగ్, రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చిన్న తరహా ఖనిజాల కన్సెషన్ నిబంధనలకు పదునుపెడుతూ కీలక సవరణలు చేస్తూ గనుల శాఖ కార్యదర్శి ప్రవీణ్ గురువారం ఉత్తర్వులు (జీవో 100) జారీ చేశారు. మేజర్ మినరల్స్ మైనింగ్‌లో అక్రమాలను గుర్తిస్తే కనీసం రూ.5 లక్షల జరిమానాతో పాటు ఖనిజం మార్కెట్ విలువ ఆధారంగా అపరాధ రుసుము వసూలు చేసేందుకు నిబంధనలు ఉన్నాయి. మైనర్ మినరల్స్‌లో ఇది లేదు. తాజాగా వీటిలోనూ భారీ పెనాల్టీలను తీసుకొచ్చారు. ఇసుక, మట్టి, రోడ్‌మెటల్, సున్నపురాయి తదితర ఖనిజాల అక్రమ మైనింగ్, రవాణాను గుర్తిస్తే.. వాటి మార్కెట్ విలువ ఆధారంగా భారీ స్థాయిలో అపరాధ రుసుము విధించనున్నారు. ఖనిజాలపై నేతలు, దళారులు కన్నేసి ముందే దరఖాస్తు చేసి రిజర్వ్ చేసుకోకుండా కఠినమైన నిబంధనలు తీసుకొచ్చారు. నిజంగా మైనింగ్ చేయాలనుకునేవారు మాత్రమే దరఖాస్తు చేసుకునేలా లీజు దరఖాస్తు ఫీజులను భారీగా పెంచారు. ఇంతకు ముందు రూ.వెయ్యి ఫీజు చెల్లించి దరఖాస్తు వేసేవారు. దీంతో భారీసంఖ్యలో వచ్చేవి. ఫలితంగా లీజుల కోసం పోటీ ఉండేది. ఇప్పుడు సగటున ఏ దరఖాస్తు అయినా సరే రూ.10 వేలు ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వ, పట్టా, డీకేటీ భూముల్లో లీజులు కోరుకునేవారు సైతం ఒక్కో దరఖాస్తుకు 10 వేలు కట్టాల్సిందే. మైనింగ్ లీజు దక్కకపోయినా ఆ ఫీజు వెనక్కి ఇవ్వరు. ఈ పెంపుదల వల్ల కేవలం మైనింగ్ చేసేవాళ్లే దరఖాస్తుకు ముందుకొస్తారని ప్రభుత్వం భావిస్తోంది. లీజులకు సంబంధించి గనుల శాఖ నుంచి లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్ఓఐ) తీసుకున్నవారు.. 15 రోజుల వ్యవధిలో ప్రీమియంలో తొలి వాయిదా చెల్లించాలని, మూడు రెట్ల వార్షిక డెడ్‌రెంట్ చెల్లించాలన్న నిబంధన తీసుకొచ్చారు.

ఆ బాధ్యత అధికారులదే..

మైనింగ్ ప్లాన్‌ను ప్రభుత్వం ఆమోదించిన తర్వాత ఆ ఉత్తర్వులను 4 నెలల్లోగా సంబంధిత జిల్లా గనుల అధికారులు లీజుదారులకు పంపించాలి. లేనిపక్షంలో మైనింగ్ ప్లాన్ ఆమోదం పొందినట్లుగానే పరిగణించేలా నిబంధనలు తెచ్చారు. ఆ ప్లాన్‌ను సకాలంలో లీజుదారుడికి ఎందుకు అందించలేకపోయారో జిల్లా అధికారి లిఖితపూర్వకంగా ప్రభుత్వానికి నివేదించాల్సి ఉంటుంది.

ఇకపై ఆన్‌లైన్ పర్మిట్లు

లీజుదారులకు ఇకపై ఆన్‌లైన్ ట్రాన్సిట్ పర్మిట్లు ఇవ్వనున్నారు. ఈ మేరకు నిబంధనల్లో స్పష్టత ఇచ్చారు. ఇప్పటికే ప్రభుత్వం సీనరేజీ వసూళ్ల కాంట్రాక్టును అమల్లోకి తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో ట్రాన్సిట్ పర్మిట్లు కూడా ఆన్‌లైన్ ద్వారానే ఇవ్వాలని తాజాగా పేర్కొంది. కాగా.. సీనరేజీ కాంట్రాక్టులు పొందిన సంస్థలు.. ఇతరులకు వాటిని బదలాయించడానికి వీల్లేదని కూడా నిబంధనల్లో చేర్చారు.

ఇసుక అక్రమాలపై కన్నెర్ర

సవరించిన సమగ్ర ఇసుక విధానాన్ని కూడా మైనర్ మినరల్స్ కన్సెషన్ రూల్స్ పరిధిలోకి తీసుకొచ్చారు. తొలిసారి ఇసుక అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే ట్రాక్టర్‌పై రూ.10 వేలు, 10 టైర్ల లారీపై రూ.25 వేలు, 10 కంటే ఎక్కువ టైర్లు ఉండే లారీపై రూ.50 వేల పెనాల్టీ విధిస్తారు. ఇక అక్రమ మైనింగ్ చేసే యంత్రాలపై రూ.50 వేల చొప్పున జరిమానా విధిస్తారు. ఇవే వాహనాలు రెండోసారి అక్రమ రవాణాలో దొరికితే ట్రాక్టర్‌పై రూ.10-20 వేలు, 10 టైర్ల లారీపై రూ.25-50 వేల వరకు, 10 కంటే ఎక్కువ టైర్లు ఉన్న లారీపై గరిష్ఠంగా రూ.లక్ష వరకు, యంత్రాలకూ రూ.లక్ష జరిమానా విధించనున్నారు. అలాగే పరిమితికి మించి ఇసుక నిల్వ చేసినా.. అక్రమంగా నిల్వచేసినట్లు నిరూపితమైతే రూ.2 లక్షల జరిమానాతోపాటు రెండేళ్ల జైలు శిక్ష విధించాలని రూల్స్‌లో చేర్చారు. అక్రమ మైనింగ్, రవాణాలో వాహనాల సీజ్‌తోపాటు జరిమానాలు అదనంగా ఉంటాయి. ఈ మేరకు జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్‌సీ)కి కీలక అధికారాలు ఇచ్చారు.

2.28 కోట్ల మందితో మెగా పీటీఎం 2.0

» జూలై 5న నిర్వహణకు నిర్ణయం

అమరావతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్(పీటీఎం)-2.0ను జూలై 5న నిర్వహించాలని నిర్ణయించినట్లు సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. 61,135 విద్యాసంస్థల్లో 2,28,21,454 మంది హాజరవుతారని అంచనా వేస్తున్నామని వెల్లడించారు. 74.96 లక్షల మంది విద్యార్థులు, 3.32 లక్షల మంది ఉపాధ్యాయులు, 1.49 కోట్ల మంది తల్లిదండ్రులు, దాతలు, ఇతరులు పాల్గొంటారని పేర్కొన్నారు. దీనిపై గురువారం ఆయన మార్గదర్శకాలు విడుదల చేశారు. పీటీఎం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య బంధాన్ని బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యా పురోగతి, ప్రవర్తన, సామాజిక సమస్యల అవగాహన వంటి అంశాలను టీచర్లు నేరుగా తల్లిదండ్రులకు వివరించే అవకాశం ఏర్పడుతుందన్నారు. గతేడాది మొదటిసారి మెగా పీటీఎం జరిగిందన్నారు. ఈ మెగా పీటీఎంలో విద్యార్థుల హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు అందిస్తారని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాలల పనితీరు, మౌలిక సదుపాయాలు, వాటిలో లోపాలు, కార్యాచరణ ప్రణాళికలను వివరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగా కుటుంబ ఫొటో బూత్‌లు, డ్రీమ్ వాల్స్, పాజిటివ్ పేరెంటింగ్ సెషన్లు, అమ్మ పేరుతో మొక్క నాటడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తారని మార్గదర్శకాల్లో వివరించారు.

పాఠశాలల పనివేళల్లో సమావేశాలొద్దు

» డైరెక్టర్ విజయరామరాజు ఆదేశాలు

పాఠశాలల పనివేళలు ఉదయం 9 నుంచి 4 గంటల వరకు ప్రధానోపాధ్యాయులతో ఎలాంటి సమావేశాలు నిర్వహించొద్దని ఆర్జేడీలు, డీఈవోలు, డీవైఈవోలను పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. ఈ మేరకు ఆ శాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. తరగతులు నిర్వహించే సమయంలో సమావేశాలు పెట్టడం వల్ల బోధనకు అంతరాయం కలుగుతోందన్నారు. ఇది విద్యార్థుల అభ్యసనంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. అందువల్ల ఇకపై పాఠశాలల పనివేళల అనంతరం మాత్రమే సమావేశాలు నిర్వహించాలని స్పష్టం చేశారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

విశాఖపట్నం, అమరావతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్‌ను ఆనుకుని వాయువ్య బంగాళాఖాతంలో గురువారం అల్పపీడనం ఏర్పడింది. ఇది రానున్న 24 గంటల్లో ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్ మీదుగా పయనిస్తుందని వాతావరణ శాఖ తెలిపింది. నైరుతి రుతుపవనాల ప్రవేశం తర్వాత బంగాళాఖాతంలో ఏర్పడిన మొదటి అల్పపీడనం ఇదేనని పేర్కొంది. గురువారం కోస్తాలో పలుచోట్ల, రాయలసీమలో చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. రానున్న మూడు రోజులు రాష్ట్రంలో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. శుక్రవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలిక పాటి జల్లులు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శనివారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. ఈ నెల 29 తరువాత మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది.

దేశంలో వర్షాభావం..

దేశంలో కొన్నిచోట్ల భారీవర్షాలు కురుస్తుండగా, కొన్ని రాష్ట్రాల్లో వర్షాభావం కొనసాగుతోంది. జూన్ ఒకటో తేదీ నుంచి గురువారం వరకూ దేశంలో 134.3 మి.మీ.కు గాను 146.6 మి.మీ. (సాధారణం కంటే 9శాతం ఎక్కువ) వర్షపాతం నమోదైంది.

ఈ-పాస్‌పోర్టుతో నకిలీలకు చెక్... డేటా భద్రం

» పాస్‌పోర్టు సేవలకుగాను రాష్ట్రానికి మూడు అవార్డులు



ఆర్‌పీవో శివహర్ష

విజయవాడ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): 'పాస్‌పోర్ట్ సేవా వెర్షన్ 2.0 కింద ఈ-పాస్‌పోర్టులను జారీ చేస్తున్నాం. వీటిద్వారా పాస్‌పోర్టుల్లో జరిగే అక్రమాలకు అడ్డుకట్ట వేశాం' అని పాస్‌పోర్టు ప్రాంతీయ అధికారి(ఆర్‌పీవో) శివహర్ష వెల్లడించారు. విజయవాడలోని రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడారు. 'ఈ-పాస్‌పోర్టులో ఎలక్ట్రానిక్ చిప్, డిజిటల్ సంతకం ఉంటుంది. వ్యక్తిగత సమాచార భద్రతకు ఉపయోగపడుతుంది. నకిలీ పాస్‌పోర్టుల తయారీని అరికట్టవచ్చు. పాస్‌పోర్టుల విషయంలో దళారీలను నమ్మి మోసపోవద్దు. ఇప్పుడు వారంలోపే పాస్‌పోర్టు జారీ చేస్తున్నాం. ఉన్నవాటి స్థానంలో కొత్తగా ఈ-పాస్‌పోర్టులను జారీ చేస్తున్నాం. కాలపరిమితి ఉన్నంతవరకు పాత వాటిని అనుమతిస్తాం. రెన్యువల్ సమయంలో ఈ-పాస్‌పోర్టులను జారీ చేస్తాం. రాష్ట్రవ్యాప్తంగా జారీ అయ్యే పాస్‌పోర్టుల సంఖ్య పెరిగింది' అని శివహర్ష తెలిపారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

రాష్ట్రంలో పాస్‌పోర్టు సేవల్లో ఉత్తమ సేవలందించినందుకు మూడు విభాగాలకు అవార్డులు వచ్చాయని శివహర్ష తెలిపారు. పాస్‌పోర్టు తనిఖీలో ఉత్తమ పోలీస్‌శాఖ విభాగంలో రాష్ట్ర పోలీసు శాఖకు, ఉత్తమ పోస్ట్ ఆఫీస్ పాస్‌పోర్టు సేవాకేంద్రం విభాగంలో గుంటూరు పోస్టాఫీసుకు, ఉత్తమ పాస్‌పోర్టు అధికారి విభాగంలో తనకూ అవార్డులు వచ్చాయని శివహర్ష వెల్లడించారు.

విధి నిర్వహణలో వెంటాడిన మృత్యువు

» కోదాడలో లారీని వెనుక నుంచి ఢీకొట్టిన కారు

» ఏపీకి చెందిన ఎస్ఐ, కానిస్టేబుల్ దుర్మరణం



ఎస్ఐ ముద్దాల అశోక్



కానిస్టేబుల్ బ్లెస్సన్ జీవన్

కోదాడ, ఆలమూరు, నరసాపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఓ లారీ డ్రైవర్ నిర్లక్ష్యం విధి నిర్వహణలో ఉన్న ఇద్దరు పోలీసులను బలితీసుకుంది. విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై సూర్యాపేట జిల్లా కోదాడ శివారులో ముందున్న లారీని కారు ఢీకొట్టిన ఘటనలో ఏపీకి చెందిన ఓ ఎస్ఐ, కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోయారు. మరో కానిస్టేబుల్, వాహన డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. కోదాడ సీఐ కథనం ప్రకారం.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన గంజాయి కేసుల నిందితుల కోసం ఎస్ఐ ముద్దాల అశోక్(46), ఆత్రేయపురం పోలీసుస్టేషన్ కానిస్టేబుల్ బ్లెస్సన్ జీవన్(32), రావులపాలెం కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యస్వామి ఒక బృందంగా ఏర్పడి ఓ ప్రైవేటు వాహనంలో బుధవారం రాత్రి హైదరాబాద్ బయలుదేరారు. రమేష్ అనే వ్యక్తి వాహనాన్ని నడుపుతుండగా.. ఎస్ఐ డ్రైవర్ పక్క సీటులో, జీవన్, సుబ్రహ్మణ్యస్వామి వెనక సీట్లలో ఉన్నారు. గురువారం తెల్లవారుజాము 2.45 గంటలకు చిల్లకల్లు టోల్‌ప్లాజా వద్ద వాహనాన్ని ఆపి గంట సేపు విశ్రాంతి తీసుకున్నారు. తిరిగి బయలుదేరిన వీరు 4.15 గంటలకు కోదాడ సమీపంలోని దుర్గాపురం వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వీరి ముందు రోడ్డుకు ఎడమ వైపు వేగంగా వెళుతున్న ఓ లారీ ఒక్కసారిగా కుడివైపునకు దూసుకురాగా.. పోలీసు వాహనం ఆ లారీని బలంగా ఢీకొట్టింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. కారులో ఇరుక్కున్న వారిని బయటికి తీశారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ అశోక్, కానిస్టేబుల్ జీవన్ మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా, 2009లో ఎస్ఐగా ఉద్యోగంలో చేరిన అశోక్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కానిస్టేబుల్ జీవన్ అవివాహితుడు. ఎస్ఐ అశోక్ అంత్యక్రియలు పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. ప్రభుత్వ విప్ నాయకర్, కోనసీమ ఎస్పీ కృష్ణారావు, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, డీఎస్పీ మురళీకృష్ణ, అశోక్ పార్థివదేహానికి నివాళులర్పించారు. అశోక్ నివాసం నుంచి గోదావరి ఒడ్డు వరకు నిర్వహించిన అంతిమ యాత్రలో పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఏకపక్ష నిర్ణయంతోనే ఆలస్యం

» డిగ్రీ అడ్మిషన్ల జాప్యంపై ప్రభుత్వం అసంతృప్తి

» చెప్పకుండా 'డ్యూయల్ మేజర్' సబ్జెక్టుల విధానం

» ఉన్నత విద్యామండలి తీరుపై తీవ్ర అసహనం

అమరావతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ అడ్మిషన్లలో జాప్యానికి ఉన్నత విద్యామండలి తీరే కారణమని ప్రభుత్వం భావిస్తోంది. 'డ్యూయల్ మేజర్' సబ్జెక్టు విధానంపై ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం వల్లే ఆలస్యం జరుగుతోందని అభిప్రాయపడుతోంది. గత వైసీపీ ప్రభుత్వం డిగ్రీలో సింగిల్ మేజర్ విధానం ప్రవేశపెట్టింది. ప్రస్తుతం ఆ విధానమే కొనసాగుతోంది. దీన్ని సమీక్షించిన ఉన్నత విద్యామండలి డ్యూయల్ మేజర్ సబ్జెక్టు విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో రెండు మేజర్, ఒక మైనర్ సబ్జెక్టులు ఉంటాయి. అందుకు అనుగుణంగా కాలేజీలన్నీ కోర్సులను మార్చుకోవాలని నెల కిందట నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే దీనిపై ప్రభుత్వానికి మండలి సమాచారం ఇవ్వలేదని తెలిసింది. దీంతో మండలి ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడంతో పాటు కొత్త విధానంలోకి మారడంపై ప్రభుత్వ స్థాయిలో పునరాలోచన జరుగుతోంది. విద్యార్థులు, బోధనా సిబ్బంది నుంచి అభిప్రాయాలు తీసుకుంటున్నారు. సింగిల్ మేజర్ కొనసాగించాలా? డ్యూయల్ మేజర్ ప్రవేశపెట్టాలా? అనే దానిపై ఒకట్రెండు రోజుల్లో నిర్ణయం తీసుకోనున్నారు.

మూడు కంపెనీలతో ఆర్జీయూకేటీ ఒప్పందాలు

అమరావతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉదోగావకాశాలు, నైపుణ్య శిక్షణ కల్పించే లక్ష్యంగా ఆర్జీయూకేటీ మూడు కంపెనీలతో ఒప్పందం చేసుకుంది. ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.మధుమూర్తి సమక్షంలో గురువారం ఈ ఒప్పందాలు జరిగాయి. సెరిమోర్ఫిక్ అనే ఏఐ ఆధారిత కంపెనీ ఉద్యోగావకాశాలు ఇచ్చేందుకు ముందుకొచ్చింది. వీఎల్ఎస్ఐ డిజైన్‌పై సహకారం అందించేందుకు రాష్ట్రంలో సెంటర్ ఏర్పాటు చేస్తుంది. వాధ్వాణి ఫౌండేషన్ ఏఐపై నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనుంది. ప్రతి క్యాంపస్‌లో వంద మందికి శాధిష కంపెనీ గేట్ పరీక్ష శిక్షణ ఇవ్వనుంది.

నా రీఎంట్రీకి ఇదే సరైన చిత్రం

\- లయ



నితిన్ కథానాయకుడిగా నటించిన 'తమ్ముడు' చిత్రంతో రీఎంట్రీ ఇస్తున్నారు నటి లయ. శ్రీరామ్ వేణు తెరకెక్కించిన ఈ చిత్రాన్ని దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. జూలై 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా లయ మీడియాతో మాట్లాడుతూ 'నా రీఎంట్రీకి 'తమ్ముడు' సరైన సినిమా అనిపించింది. క్యారెక్టర్ కోసం కొంచెం లావు కావాలని డైరెక్టర్ చెప్పారు. అందుకని స్వీట్స్ తిని బరువు పెరిగాను. ఈ సినిమాలో ఝాన్సీ కిరణ్మయి అనే పాత్రలో నటించాను. తనొక స్ట్రిక్ట్ ఆఫీసర్. కుటుంబాన్ని చూసుకుంటూనే ఆఫీసర్‌గా నా బాధ్యతలు నిర్వర్తిస్తుంటాను. చాలా బలవంతమైన స్త్రీ పాత్ర అది. తను అనుకున్నది చేస్తుంది. ఏది ఏమైనా భయపడదు. హీరో నితిన్‌కు సోదరి పాత్ర నాది. ఈ చిత్రం కోసం అడవిలో షూటింగ్ చేశాం. కథలో ప్రాధాన్యమున్న పాత్రల్లో నటించాలని అనుకుంటున్నా. ఆ పాత్ర సిస్టర్ అయినా, మదర్ అయినా చేస్తాను' అని అన్నారు.

విజయ్ మేకింగ్ అంటే చాలా ఇష్టం

\- సురేశ్‌బాబు



తమిళ నటుడు విజయ్ ఆంటోని నటిస్తూ, నిర్మించిన తాజా చిత్రం 'మార్గన్'. లియో జాన్ పాల్ దర్శకత్వం వహించారు. తెలుగులో సురేశ్‌బాబు రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమా శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సురేశ్‌బాబు మాట్లాడుతూ 'విజయ్ ఆంటోనికి సినిమా పట్ల చాలా ప్యాషన్ ఉంది. మ్యూజిక్ డైరెక్టర్ నుంచి హీరోగా, నిర్మాతగా, దర్శకుడిగా ఆయన ప్రయాణాన్ని చూస్తున్నాను. ఆయన మేకింగ్ అంటే నాకు చాలా ఇష్టం. అలాంటి వారు తీసే చిత్రాల్ని చూసేందుకు ఇష్టపడుతుంటాను. అందుకే నేను 'మార్గన్' సినిమాని తెలుగులో రిలీజ్ చేస్తున్నాను' అని తెలిపారు. హీరో విజయ్ ఆంటోని మాట్లాడుతూ 'ఇదొక నార్మల్ సీరియల్ కిల్లర్ చిత్రంలా ఉండదు. ఇందులో చాలా లేయర్లు ఉంటాయి. మొదటి ఫ్రేమ్ నుంచి చివరి ఫ్రేమ్ వరకు ప్రేక్షకులను సీట్లకు కట్టిపడేస్తుంది. భాష్యశ్రీ పాటలు, మాటల వల్ల ఇది పూర్తి తెలుగు సినిమాగా అనిపిస్తోంది' అని అన్నారు. కార్యక్రమంలో చిత్ర నటులు అజయ్ ధీషన్, బ్రిగిడ, దీప్షిక, రచయిత భాష్యశ్రీ పాల్గొన్నారు.

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

మళ్లీ హాస్పిటల్‌లో చేరిన పొన్నాంబళం



కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న తమిళ నటుడు పొన్నాంబళం మళ్లీ ఆస్పత్రిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన ఒక ఆడియోను రిలీజ్ చేశారు. ఇందులో తన అనారోగ్యంపై వివరించారు. 'నేను మళ్లీ హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యాను. ఇప్పటివరకు నాకు అనేక మంది పలు విధాలుగా సాయం చేశారు. వారిలో చిరంజీవి, శరత్ కుమార్, ధనుష్, కేఎస్ రవికుమార్, నిళల్‌గల్ రవి, రవి మోహన్, శింబు, కమల్ హాసన్ తదితరులెంతోమంది ఉన్నారు. కొన్నేళ్ళుగా చిత్రాల్లో నటించడం లేదు. ఆదాయం లేదు. ఆర్థికంగా చితికిపోయాను. నాకు ఆర్థిక సాయం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

-చెన్నై, (ఆంధ్రజ్యోతి)

నేడు 3 జిల్లాలకు సీఎం చంద్రబాబు

» ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడులో పర్యటన

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పర్యటించనున్నారు. ఉదయం 10.30కు విజయవాడలో జరిగే జీఎఫ్ఎస్‌టీ టూరిజం కాంక్లేవ్‌లో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం గుంటూరు ఆర్వీఆర్, జేసీ కళాశాలలో జరిగే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫర్ ఏపీ పోలీస్ - హ్యాకథాన్ 2025 కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచి పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొండవీడు గ్రామంలో జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను పరిశీలిస్తారు.

చిన్ననాటి నుంచే జగన్‌లో నేర ప్రవృత్తి

» పోలీసుల మాట వినుంటే దళితుడి ప్రాణం నిలిచేది: వర్ల రామయ్య

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సొంత బాబాయ్‌ని వేసేసిన వాడికి సింగయ్య ఒక లెక్కా? అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య వ్యాఖ్యానించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'సింగయ్య తాను ప్రయాణిస్తున్న కారు కింద పడలేదని, సింగయ్య చావుకు, తన కారుకు సంబంధం లేదని చెప్పే ధైర్యం జగన్‌కు ఉందా? చిన్ననాటి నుంచే జగన్ వ్యక్తిత్వం నేర ప్రవృత్తితో మిళితం అయింది. పోలీసుల ఆంక్షలను ధిక్కరించి వెళ్లి దళిత బిడ్డను కారు కింద తొక్కించి ప్రాణాలు తీయడమే కాకుండా తనకు ఎలాంటి సంబంధం లేదని జగన్ అనడం దారుణం. పోలీసులు చెప్పిన విధంగా జగన్ పర్యటన చేసుంటే సింగయ్య చనిపోయేవాడు కాదు' అని అన్నారు.

వైసీపీ రక్షణకే.. జగన్ ఇంటింటి కార్యక్రమం: మద్దిపట్ల

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రక్తం పంచుకుపుట్టిన చెల్లి ఇంటింటికీ వెళ్లి తన అన్న జగన్ మోసగాడంటుంటే.. జగన్ అండ్ కో ఇంటింటికీ వెళ్లి ఏం చెబుతారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాశ్ ప్రశ్నించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూసివేతకు సిద్ధంగా ఉన్న వైసీపీ కార్యాలయాలను తెరిపించుకోవడానికే రాష్ట్రంలోని ప్రతి ఇంటికి వెళ్లే కార్యక్రమాన్ని జగన్ ప్రారంభిస్తున్నారని అన్నారు. ఇంటింటికీ వెళ్లినప్పుడు తన బాబాయ్‌ని రప్పా రప్పా ఎలా నరికారో కూడా ప్రజలకు చెప్పాలన్నారు.

వ్యవసాయ బడ్జెట్ 48,341 కోట్లు

» వైసీపీ కన్నా 27 లక్షల టన్నుల ధాన్యం ఎక్కువ కొన్నాం: దీపక్‌రెడ్డి

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రైతులకు భరోసానిచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలోనే వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తూ ముందుకుపోతోందని సీడ్ ఏపీ చైర్మన్ దీపక్ రెడ్డి అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'వైసీపీ హయాంలో రైతులకు రూ.1,674 కోట్ల ధాన్యం బకాయిలు చెల్లించకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కుదేలు చేసింది.కూటమి ప్రభుత్వం 2025-26 వ్యవసాయ బడ్జెట్‌లో రూ.48,341 కోట్లు కేటాయించి, రైతు సంక్షేమానికి పెద్దపీట వేసింది. వైసీపీ కన్నా 27 లక్షల టన్నులు ధాన్యం ఎక్కువ కొనుగోలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుంది' అని దీపక్‌రెడ్డి అన్నారు.

కాగ్నిజెంట్ అభివృద్ధి వికేంద్రీకరణకు ప్రతీక

» బాబు దూరదృష్టితోనే పెట్టుబడులు: మంత్రి రామ్మోహన్‌నాయుడు

న్యూఢిల్లీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): 'సీఎం చంద్రబాబు దూరదృష్టి గల నాయకత్వంతోనే రాష్ట్రానికి పెట్టుబడులు, ఉద్యోగాలు వస్తున్నాయి. మౌలిక సదుపాయాల కల్పన జరగడంతో పాటు, ప్రజలకు భవిష్యత్తుపై ఆశ కలుగుతోంది' అని కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. విశాఖపట్నంలో కాగ్నిజెంట్ క్యాంపస్ ఏర్పాటు కేవలం మరో ప్రాజెక్టే కాదని, అభివృద్ధి వికేంద్రీకరణ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రతీక అని గురువారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

సంక్షేమం విషయంలో చర్చకు సిద్ధం: కొలుసు



ఏలూరుసిటీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కన్నా మెరుగైన సంక్షేమం అందించామని ఎవరైనా చెబితే కూటమి నాయకులు చర్చకు సిద్ధమని మంత్రి కొలుసు పార్థసారథి సవాల్ విసిరారు. ఏలూరులోని జడ్పీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'గత ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును, అమరావతిని నిర్వీర్యం చేసింది. ఎన్నో సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసింది' అని పార్థసారథి అన్నారు. సమావేశంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి), ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి పాల్గొన్నారు.

మూడేళ్లలో అమరావతిలో ఎయిర్‌పోర్టు

» హార్బర్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి.. మంత్రి బీసీ జనార్దనరెడ్డి వెల్లడి

అమరావతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడేళ్లలో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశామని మౌలిక సదుపాయాలు, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి వెల్లడించారు. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం మూడేళ్లలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల్లూరులో రూ.280 కోట్లతో నిర్మించిన షిప్పింగ్ హార్బర్‌ను వర్చువల్‌గా ప్రారంభించారన్నారు. గత వైసీపీ సర్కార్ పోర్టులు, షిప్పింగ్ హార్బర్లను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో హార్బర్ల నిర్మాణంపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. భోగాపురం విమానాశ్రయం పనులు 78 శాతం పూర్తయ్యాయని మంత్రి చెప్పారు.

విద్యుత్తు అంతరాయాలపై డ్రోన్లతో పరిశీలన

» ఏపీసీపీడీసీఎల్‌పై సమీక్షలో సీఎస్ విజయానంద్ ఆదేశాలు

అమరావతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు అంతరాయాలపై డ్రోన్లతో పరిశీలన చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయమైన విద్యుత్తును సరఫరా చేయాలని సూచించారు. ఏపీసీపీడీసీఎల్ పరిధిలో విద్యుత్తు సరఫరాపై గురువారం ఆయన సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. విద్యుత్తు శాఖపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని మరింత పెంచే దిశగా పని చేయాలని, గృహ, పరిశ్రమలకు నిరంతర విద్యుత్తు అందించాలని చెప్పారు.

ఉత్తరాంధ్రలో బయోటెక్ పార్క్

» ఏర్పాటుకు అనుమతివ్వండి.. కేంద్రాన్ని కోరిన మంత్రి కొండపల్లి

అమరావతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, ఫంక్షనింగ్ యూనివర్సిటీతో కూడిన బయోటెక్ పార్కును ఏర్పాటు చేయాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల కొండపల్లి శ్రీనివాస్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాపరావు జాదవ్‌ను కలిసి ప్రతిపాదనలు సమర్పించారు. ఈ బయోటెక్ పార్కులో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, ఫంక్షనింగ్ యూనివర్సిటీని స్థాపించడం ద్వారా పరిశ్రమ, పరిశోధన, విద్యార్థుల మధ్య సహకారాన్ని పెంచి, భారతీయ ఆయుర్వేదాన్ని ప్రపంచ స్థాయిలో ప్రాచుర్యంలోకి తీసుకురావాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. దీనిపై కేంద్ర మంత్రి జాదవ్ సానుకూలంగా స్పందించారని మంత్రి కొండపల్లి తెలిపారు.

స్టాంపుల కుంభకోణంపై తనిఖీలకు మంత్రి ఆదేశం

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): నకిలీ స్టాంపుల కుంభకోణంపై రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు చేపట్టాలని, విచారణ నిర్వహించాలని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశించారు. రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీలు, డీఐజీలు ఈ కుంభకోణంపై విచారణ జరపాలని సూచించారు. అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో వెలుగుచూసిన నకిలీ ఈ-స్టాంపుల వ్యవహారంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీకి సవరణలు

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీని ప్రభుత్వం సవరించింది. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ-4.0(2024-29)లో ఆహార శుద్ధి పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, ఆకర్షణీయమైన ప్యాకేజీలను ప్రభుత్వం ప్రకటించింది. అయితే కేంద్రం మార్చిలో ఎంఎస్‌ఎంఈలను కొత్తగా వర్గీకరిస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీలోనూ ఆ మేరకు సవరణలు చేస్తూ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.



అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఎం చంద్రబాబు, వేదికపై కేంద్ర మంత్రి పెమ్మసాని, మంత్రులు అనిత, సంధ్యారాణి తదితరులు



నో'డ్రగ్స్' అని నినదిస్తూ గుంటూరులో నిర్వహించిన ర్యాలీలో చంద్రబాబు

గంజాయి, డ్రగ్స్‌పై ఇక యుద్ధమే!

(మొదటి పేజీ తరువాయి)

ఎవరైనా గంజాయి ముఠాలకు సహకరిస్తే వారినెలా అదుపు చేయాలో, ప్రజలను ఎలా కాపాడుకోవాలో తనకు బాగా తెలుసన్నారు. జగన్ జమానాలో కిళ్లీ బంకుల్లో, కిరాణా షాపుల్లోనూ నిత్యావసర వస్తువు మాదిరిగా గంజాయి లభ్యమైందని చెప్పారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం గుంటూరులో జరిగిన అవగాహన సభలో సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ గంజాయి పండించే వ్యక్తులు, అక్రమ రవాణా చేసేవారు, వాటికి బానిసలైన అందరిపైనా యుద్ధం ప్రకటిస్తున్నానన్నారు. అటువంటి వారు ఇకనైనా మారాలని, లేదంటే రాష్ట్రం వదిలి వెళ్లాలని, వారికి ఇక్కడ ఉండే అర్హతే లేదని స్పష్టంచేశారు. యువతను నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్, గంజాయిని నియంత్రించకపోతే జాతి నిర్వీర్యమవుతుందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో దేశంలోనే ఏపీని గంజాయి సాగులో నంబర్‌వన్‌గా చేశారని.. విశాఖ కేంద్రంగా ఏజెన్సీ ప్రాంతంలో 11 వేల ఎకరాల్లో సాగు చేసి దేశమంతా పంపిణీ చేశారని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే దానిని జీరో శాతానికి తీసుకొచ్చామన్నారు. గంజాయి, డ్రగ్స్‌ను అరికట్టేందుకు ప్రత్యేకంగా 'ఈగల్' విభాగాన్ని ఏర్పాటు చేశామని.. క్యాబినెట్ సబ్ కమిటీ వేసి కఠినంగా వ్యవహరిస్తున్నామని చెప్పారు. 'గూగుల్, శాటిలైట్, డ్రోన్స్ వినియోగించి గంజాయి సాగును పూర్తిగా తుడిచివేశాం. ఇప్పటికే డ్రోన్స్‌తో పెట్రోలింగ్, సీసీ కెమెరాలతో రియల్ టైంలో శాంతి భద్రతలు కాపాడే చర్యలు చేపట్టాం' అని తెలిపారు. వీటి నియంత్రణకు ప్రజా చైతన్యం అవసరమని, తమ పోరాటంలో జనం కూడా భాగస్వాములు కావాలని పిలుపిచ్చారు. 'టోల్ ఫ్రీ నంబరు 1972ని ప్రారంభిస్తున్నాం. మీ ప్రాంతంలో ఎక్కడైనా గంజాయి, డ్రగ్స్ విక్రయిస్తుంటే.. ఈ నంబరుకు ఫోన్ చేసి సమాచారమిస్తే సరిపోతుంది. మీ పేర్లు కూడా చెప్పాల్సిన అవసరం లేదు' అని చెప్పారు. టోల్ ఫ్రీ నంబరుతో పాటు వాట్సాప్ నంబరు 8977781972ను కూడా ఆయన ప్రారంభించారు. ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు సెలెబ్రిటీలు కూడా ముందుకు రావాలన్నారు. 'గంజాయి, డ్రగ్స్‌కు బానిసలైన వారిని కాపాడేందుకు రాష్ట్రవ్యాప్తంగా 56 డీ-ఎడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయబోతున్నాం. వాటితోపాటు మరో మూడు ప్రపంచ స్థాయి ప్రమాణాలు కలిగిన డీ-ఎడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం' అని వెల్లడించారు.



గంజాయి ముఠాలపై కేసులు పెట్టకుంటే వారు ఇష్టానుసారం తయారవుతారు. సాగు, అక్రమ రవాణా దారుల ఆస్తులను సీజ్ చేస్తున్నాం. ఇప్పటికే విశాఖ ఏజెన్సీ పరిధిలో రూ.7 కోట్ల విలువైన ఆస్తులు సీజ్ చేశాం. ఆ సొమ్మును గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు ఉపయోగిస్తాం.

- సీఎం చంద్రబాబు

రౌడీ షీటర్లకు పరామర్శలా?

రాజకీయాల్లో ఉండేవారు ఆదర్శంగా ఉండాలే కానీ చెడును ప్రోత్సహించకూడదని సీఎం అన్నారు. 'తెనాలిలో రౌడీ షీటర్లు, గంజాయి బ్యాచ్.. పోలీసులపైనే దాడిచేస్తే.. వారిని అదుపుచేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తే.. వందల వాహనాలతో వెళ్లి వారిని పరామర్శించడమా...? అటువంటి వారిని ఏం చేయాలి..? వదిలిపెట్టమంటారా...?' అని సభికులను ఆయన ప్రశ్నించగా.. వద్దు వద్దంటూ వారు నినాదాలు చేశారు. తెలిసో తెలియకో ఒకసారి గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితం విచ్ఛిన్నమవుతుందని సీఎం హెచ్చరించారు. 'వాటికి అలవాటు పడితే నిస్సత్తువగా మారి ఏకాగ్రత కోల్పోయి, మనిషి మృగంగా మారతాడు. చివరకు ఆత్మహత్యకు కూడా పాల్పడతారు. మత్తుకు బానిసలైన వారు తల్లి, చెల్లి, కుటుంబ సభ్యులపైనా, చివరకు పసిపిల్లలపై సైతం దాడులకు తెగబడుతున్నారు. ఆడబిడ్డల జోలికొస్తే అదే వారికి చివరి రోజు. శాశ్వతంగా వారిమత్తు ఎలా వదిలించాలో నాకు తెలుసు. ఇతర రాష్ట్రాల నుంచి 34 లక్షల మంది వలస కూలీలు రాష్ట్రానికి వస్తున్నారు. వెంట గంజాయి, డ్రగ్స్‌ను తీసుకొస్తున్నారు. వలస కూలీలతో పనులు చేయించుకునే వారు జాగ్రత్తగా ఉండాలి. డ్రగ్ ఫ్రీ ఏపీగా తీర్చిదిద్దడంలో వారు కూడా బాధ్యత తీసుకోవాలి. జీరో డ్రగ్స్‌కు ప్రతి ఒక్కరూ సహకరిస్తే.. రాష్ట్రంలో 100 శాతం శాంతిభద్రతలను కాపాడే బాధ్యత నేను తీసుకుంటా. ఈగల్ ద్వారా వీటిని సమూలంగా కట్టడి చేస్తుంటే కొత్తగా మందుల దుకాణాల్లో మత్తు పదార్థాలు అమ్ముతున్నారు. ఇటువంటి వాటిపై డేగకన్ను వేశాం. విశాఖ, రాజమహేంద్రవరం, గుంటూరు, తిరుపతిల్లో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేస్తున్నాం. ఈగల్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 4,786 పాఠశాలలు, కళాశాలల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం' అని వివరించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు అనిత, గుమ్మిడి సంధ్యారాణి, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

మూలధన వ్యయానికి ప్రాధాన్యం

అమరావతి: మూలధన వ్యయం మరింత పెంచాలని సీఎం చంద్రబాబు సూచించారు. గురువారం సచివాలయంలో ఆర్థిక శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. కేంద్రం వివిధ పథకాలు, కార్యక్రమాల కోసం ఇచ్చే నిధులను మూలధన వ్యయానికి ఖర్చు చేయాలని అధికారులకు చెప్పారు.

2 నుంచి జనంలోకి టీడీపీ

ఎల్లుండి విస్తృత స్థాయి సమావేశం

» 'ఇంటింటికీ మంచి ప్రభుత్వం'పై సమగ్ర చర్చ

» ప్రజలకు ఏమేం వివరించాలి, ఏడాది విజయాలపై బాబు దిశానిర్దేశం

» జగన్ అరాచక పర్యటనలనూ ఎండగట్టాలని నిర్ణయం?

అమరావతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం (29) జరుగనుంది. వచ్చే నెల 2 నుంచి 'ఇంటింటికీ మంచి ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టి మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు అందరూ ప్రజల్లోకి వెళ్లాలని ఇప్పటికే నిర్ణయించిన విషయం విదితమే. ఈ కార్యక్రమాన్ని ఎలా నిర్వహించాలి.. ప్రజలకు ఏమేం వివరించాలన్న అంశాలను చర్చించడంతోపాటు కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో నమోదు చేసిన విజయాలపై సదరు సమావేశంలో అధినేత చంద్రబాబు దిశానిర్దేశం చేయనున్నారు. ఇందులో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, పొలిట్‌బ్యూరో సభ్యులు పాల్గొననున్నారు. ఏడాది పాలనపై 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో ఇప్పటికే కూటమి పార్టీలతో భారీ సమావేశం ఏర్పాటు చేశారు. మరోవైపు జూలై 2 నుంచి టీడీపీ శ్రేణులన్నీ ఇంటింటికీ తిరిగి ఏడాది పాలనలో ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరిస్తారని అధిష్ఠానం ఇప్పటికే ప్రకటించింది. పింఛన్ల పెంపు, తల్లికి వందనం కింద ఇంట్లోని ప్రతి బిడ్డకూ డబ్బులు వేయడం, అన్నదాతా సుఖీభవ, దీపం-2 కింద మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూనే.. వైసీపీ హయాంలో విధ్వంసానికి గురైన రాజధాని అమరావతిని గాడినపెట్టడం, పోలవరం పనులను వేగవంతం చేయడం, ఏడాదిలోనే రాష్ట్రానికి సుమారు 9.50 లక్షల కోట్లు పెట్టుబడులను తీసుకురావడం వంటి అభివృద్ధి కార్యక్రమాలనూ చేపట్టిన ఘనత కూటమి ప్రభుత్వానిదని, ఈ విషయాలన్నింటినీ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని టీడీపీ శ్రేణులకు చంద్రబాబు మార్గనిర్దేశం చేస్తారు. మరోవైపు.. కూటమి ఏడాది పాలనపై వైసీపీ కూడా ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించింది. 'చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ..' పేరుతో కార్యక్రమం చేపట్టనుంది. ఈ నేపథ్యంలో వైసీపీని ప్రజలు ఛీకొట్టినా ఆ పార్టీ నేతలు చేస్తున్న అరాచకాలనూ ప్రజలకు వివరించాలని టీడీపీ అధిష్ఠానం భావిస్తోంది. తెనాలిలో గంజాయి బ్యాచ్‌కు జగన్ పరామర్శ, పొదిలిలో పొగాకు రైతుల పరామర్శ పేరుతో వేల మందితో జనంపైనే దండయాత్ర చేయడం, మహిళలపై రాళ్ల దాడులు, సత్తెనపల్లిలో బెట్టింగ్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి విగ్రహావిష్కరణకు వెళ్లి ముగ్గురి ప్రాణాలు పోవడానికి కారణమైన మాజీ సీఎం తీరును ఎండగట్టాలని యోచిస్తోంది. ఈ అంశాలపై విస్తృతస్థాయి భేటీలో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశముంది.

గోదావరి కుర్రాళ్ల బైకుల్లా.. ఏపీలో అభివృద్ధి పరుగులు

రాజమహేంద్రవరం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): 'గోదావరి కుర్రాళ్ల బైక్‌ల వేగం మాదిరిగా.. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయకత్వంలో కేంద్రం, రాష్ట్రంలో అభివృద్ధి వేగవంతమైంది. ఇంజన్‌లో సీసీ పవర్ ఎంత ఎక్కువగా ఉంటే.. బైక్ కూడా అంత వేగంగా ముందుకెళ్తుంది. ఆ వేగం మనల్ని గమ్యం చేర్చేలా ఉండాలి. అటు కేంద్రంలో.. ఇటు రాష్ట్రంలో.. శక్తిమంతమైన నాయకులు ఉండడం వల్లే అభివృద్ధి వేగవంతం అవుతుంది. అది డబుల్ ఇంజన్ ప్రభుత్వం వల్లే సాధ్యమవుతుంది' అని ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో గురువారం ఆయన కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి, మంత్రులు కందుల దుర్గేశ్, నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. సైన్స్ మ్యూజియం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. దివాన్‌చెరువులో ఫారెస్ట్ అకాడమీ భవన సముదాయానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పుష్కరఘాట్‌లో ఏర్పాటు చేసిన సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... ఈ రోజు ఇక్కడ రూ.430 కోట్లతో ఏడు టూరిజం ప్రాజెక్టులను ప్రారంభిస్తున్నామని, వీటిలో కొన్నింటికి ప్రణాళికలు పూర్తయ్యాయని, మరికొన్ని పనులు పూర్తిచేశామని చెప్పారు. ఏపీని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేయాలని 2024 ఎన్నికల్లో ఎన్డీఏ సర్కారు నిర్ణయించిందని, అందులో భాగంగానే అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టును అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టు వల్ల వేలాది మందికి ఉపాధి దొరుకుతుందని, టూరిజం ప్రాజెక్టులు పూర్తయితే 4 లక్షల కంటే ఎక్కువ మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయని అన్నారు. ఏపీకి ఎల్లప్పుడూ సహకారం అందిస్తున్న కేంద్రమంత్రి గజేంద్రసింగ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కాగా, బొమ్మూరులో రూ.15.20 కోట్లతో నిర్మించిన రాజమహేంద్రవరం విజ్ఞాన కేంద్రానికి ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త శ్రీస్వామి జ్ఞానానంద పేరును ఈ కేంద్రానికి పెట్టాలనే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు.



అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తున్న కేంద్ర మంత్రి షెకావత్, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి దుర్గేశ్, ఎంపీ పురందేశ్వరి

భారత్‌లో వేగంగా పర్యాటకం

ప్రఖ్యాత టూరిజం స్పాట్‌గా 'అఖండ గోదావరి'

బుద్ధిస్ట్ సర్క్యూట్, ఏకో టూరిజం ఇస్తాం: షెకావత్

రాజమహేంద్రవరం, అమరావతి, జూన్26 (ఆంధ్రజ్యోతి): భారత్‌లో పర్యాటకుల శాతం వేగంగా పెరుగుతోందని, అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు దేశంలోనే ప్రఖ్యాత టూరిజం స్పాట్ అవుతుందని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అన్నారు. గురువారం ఆయన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎంపీ పురందేశ్వరి తదితరులతో కలిసి అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. అనంతరం బొమ్మూరులోని సైన్స్ మ్యూజియంను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో షెకావత్ మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అభ్యర్థన మేరకు ప్రధాని మోదీ సహకారంతో అనేక ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తున్నామన్నారు. 'భారత్‌ను పర్యాటకుల గమ్యస్థానంగా తీర్చిదిద్దనున్నాం. ఏపీలో పర్యాటక రంగ అభివృద్ధికి అవకాశాలు, వనరులు మెండుగా ఉన్నాయి. వాటిని వినియోగించుకోవడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఏపీలో బుద్ధిస్ట్ సర్క్యూట్, కోస్టల్‌లో ఎకో టూరిజం ఏర్పాటు చేస్తున్నాం. పుట్టపర్తి, అరకు లోయలో లైట్స్ అండ్ సౌండ్ షో ఏర్పాటు చేయనున్నాం. విశాఖ పోర్ట్‌లో క్రూయిజ్ అండ్ కార్గో టెర్మినల్, తిరుపతి రైల్వేస్టేషన్ ఆధునికీకరించనున్నాం. స్వదేశీ దర్శన్ 2.0 ద్వారా అరకు, బొర్రా గుహలు, లంబసింగి ప్రాంతాలతోపాటు, సూర్యలంక బీచ్‌నూ అభివృద్ధి చేస్తున్నాం. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎంపీ పురందేశ్వరి, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేశ్ చొరవతో ఏపీలో రూ.450 కోట్లతో పర్యాటక రంగ అభివృద్ధి జరుగుతోంది' అని వివరించారు. ఈ ప్రాజెక్టును త్వరగా పూర్తిచేసి 2035 నాటికి 35 లక్షల మంది పర్యాటకులు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

మోదీ విజన్.. బాబు ప్లానింగ్‌తో ఏపీ అభివృద్ధి

ప్రధాని మోదీ విజన్.. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్లానింగ్‌తో ఏపీ డబుల్ వేగంతో అభివృద్ధి చెందుతోందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. విజయవాడలోని ఒక హోటల్లో ఏపీ బీజేపీ ఏర్పాటు చేసిన 'ఎమర్జెన్సీకి యాభై ఏళ్లు' ప్రదర్శనను ఆయన తిలకించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఏపీలో ఇరిగేషన్, టూరిజమ్ అభివృద్ధికి కేంద్రం పూర్తిగా సహకరిస్తోందన్నారు. యాభై ఏళ్ల క్రితం ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని అన్నారు.

పవన్.. కొత్త లుక్‌లో!



ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చాలా కాలం తర్వాత కొత్త లుక్‌లో కనిపించారు. ఎన్నికల ముందు నుంచి తెల్ల లాల్చీ పైజామా, లేదంటే దీక్షా వస్త్రాలతో కనిపించిన ఆయన.. అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు శంకుస్థాపన నిమిత్తం రాజమహేంద్రవరం పర్యటనలో ఇన్‌షర్ట్ చేసుకుని.. స్టైలిష్‌గా కనిపించారు.

- రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్!

వెంటనే సవరించుకున్న ఎంపీ పురందేశ్వరి

అఖండ గోదావరి టూరిజం ప్రాజెక్టు శంకుస్థాపన అనంతరం జరిగిన సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి మాట్లాడుతూ.. పవన్ కల్యాణ్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి అని అన్నారు. వెంటనే పక్కనే ఉన్న బీజేపీ నేత గుర్తుచేయడంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అని సవరించుకున్నారు. వేదిక మీద ముఖ్యుల పేర్ల పరిచయం సమయంలో పొరపాటున ఇలా అనేసి సరిచేసుకున్నారు. సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్‌గా మారింది.

'లిక్కర్' బాసులకే ఆగ్రోస్ టెండర్లు!

(మొదటి పేజీ తరువాయి)

మార్చినట్టు సమాచారం. దీనికోసమే ఎంప్యానెల్‌మెంట్ విధానం స్థానంలో ఎల్1 టెండర్ల ప్రక్రియ తీసుకొచ్చినట్టుగా చెబుతున్నారు. ఎందుకంటే ఏపీ ఆగ్రోస్ ఏప్రిల్‌లో టెండర్లు పిలిచి, ఎంప్యానెల్‌మెంట్ పూర్తయి, రైతులు కూడా కంపెనీలను ఎంచుకున్న తర్వాత ఆగమేఘాలపై దానిని నిలిపివేసింది. కొత్త నిబంధనలు పెట్టి ఈ నెల 5న మరోసారి టెండర్ పిలిచారు. కేవలం సుజల పైప్స్, నందిపైప్స్ కంపెనీలకు మాత్రమే అర్హత ఉండేలా వాటిని రూపొందించారని తెలుస్తోంది. ఓ సీనియర్ అధికారి వ్యూహంలో భాగంగానే ఈ అడ్డగోలు వ్యవహారమంతా సాగినట్టు ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

నిధులు పంచాయతీరాజ్‌వి.. అమలు వ్యవసాయ శాఖది

రైతుల పథకానికి నిధులు పంచాయతీరాజ్ శాఖ ఇస్తుంది. కంపెనీల ఎంప్యానెల్‌మెంట్ లేదా డీఎస్‌సీ ద్వారా నిధులు ఖర్చుపెట్టాలన్న స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయి. ఇప్పటివరకు ఆ నిబంధనలకు అనుగుణంగానే ఈ పథకం అమలైంది. ఈ నిబంధనల ప్రకారమే ఏప్రిల్‌లో ఏపీ ఆగ్రోస్ టెండర్లు కూడా పిలిచింది. కానీ, అకస్మాతుగా వాటిని నిలిపేశారు. ఈ వాటర్ షెడ్ పథకంలో రైతులకు వ్యవసాయ పరికరాలు ఇస్తారు. ఈ ఏడాది ఏప్రిల్ 16వ తేదీన ఏపీ ఆగ్రోస్ ఎంప్యానెల్‌మెంట్ కోసం టెండర్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఇందులో పరికరాల వారీగా వేరు వేరు కంపెనీలు టెండర్లు వేసుకొని వారి రేట్ల ప్రకారం ఎమ్‌ప్యానెల్ అయ్యాయి. ఇలా ఎమ్‌ప్యానెల్ అయిన కంపెనీల జాబితాను తెలియజేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు అన్ని జిల్లాల వారికి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతులు ఏ కంపెనీ పరికరం కోరుకుంటే ఆ కంపెనీ పరికరాలు తీసుకొనే వెసులుబాటు ఈ పథకంలో ఉంది. ఆ ప్రకారం, రైతులే స్వయంగా వివిధ పరికరాలకు సంబంధించి వివిధ కంపెనీలకు ఎన్నుకొన్నారు. రైతులు ఎంపిక చేసుకోవడం పూర్తయిన తర్వాత ఏపీ ఆగ్రోస్ ఆ టెండర్‌ను అర్థంతరంగా నిలిపివేయడం చర్చనీయాంశంగా మారింది. .

ఆ రెండు కంపెనీల కోసమే...

నిబంధనలు మార్చి మరోసారి అదే పథకానికి ఏపీ ఆగ్రోస్ ఈ నెల 5న టెండర్లు పిలిచింది. కానీ విచిత్రంగా ముందు టెండర్లలో ఎంపికైన ఏ ఒక్క కంపెనీకీ ఈసారి అర్హత లేకుండాపోయింది. ఈ టెండర్లలో పాల్గొనాలంటే కంపెనీ పెట్టి 15 ఏళ్లు పూర్తికావాలన్న నిబంధన కొత్తగా పెట్టారు. దీంతో ఎస్వీవై రెడ్డికి సంబంధించిన సుజల పైప్స్, నంది పైప్స్ కంపెనీలు, కర్ణాటకకు చెందిన మరో కంపెనీ అర్హత సాధించాయి. ఏపీలోనే తయారీ ప్లాంటు ఉండాలన్న మరో నిబంధన తీసుకొచ్చి... ఆ కర్ణాటక కంపెనీని కూడా రేసులో లేకుండా చేశారు. ఏప్రిల్‌లో పిలిచిన టెండర్ల ప్రకారం ఒక్క నాగలికే 24 కంపెనీలు టెండర్లు వేశాయి. '9 టైన్ కల్టివేటర్' కోసం 29 కంపెనీలు టెండర్లు వేశాయి. నిబంధనలు మార్చిన తర్వాత ఇందులో ఏ ఒక్క కంపెనీకి కూడా అవకాశం లేకుండా పోయింది. వైస్వీవై రెడ్డికి చెందిన 2కంపెనీల కోసమే టెండరు నిబంధనలు మార్చినట్టు స్పష్టమవుతోంది.



రాజధానిలో టవర్లకు రైట్ రైట్..

- ఎల్-1 బిడ్డర్లకు ఎల్‌వోఏల అందజేత
- రూ.3,673 కోట్లతో పనులు అప్పగింత

అమరావతి/విజయవాడ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): అమరావతి ప్రభుత్వ కాంప్లెక్స్‌లో ఇంటిగ్రేటెడ్ రాష్ట్ర సచివాలయం, హెచ్‌వోడీ టవర్ల నిర్మాణానికి రూ.3,673.43 కోట్లతో ఎల్-1 బిడ్డర్లకు లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్సీ(ఎల్‌వోఏ)ని ఆమోదిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పనుల అప్పగింతకు సంబంధించి సీఆర్‌డీఏ అథారిటీ సమావేశం ఇప్పటికే ఆమోదం తెలిపింది. రూ.882.47 కోట్లతో జీఏడీ టవర్ (జీ+49) నిర్మాణ పనులను ఎన్‌సీసీ లిమిటెడ్‌కు, రూ.1,487.11 కోట్లతో టవర్స్-1, 2 (జీ+39) పనులు షాపూర్జీ అండ్ పల్లోంజీ సంస్థకు, రూ.1,303.85 కోట్లతో టవర్స్- 3, 4 (జీ+39) పనులను ఎల్ అండ్ టీ సంస్థకు అప్పగించింది. కాగా, సెక్రటేరియట్, హెచ్‌వోడీ టవర్లకు సంబంధించిన ఎల్‌వోఏలను నిర్మాణ సంస్థలకు గురువారం సీఆర్డీఏ కార్యాలయంలో అందజేశారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు అనుసరిస్తూ నిర్మాణ పనులు చేపట్టాలని ఆయా సంస్థలకు సీఆర్డీఏ కమిషనర్ కె.కన్నబాబు సూచించారు. నిబంధనలు అతిక్రమించినా, కార్మికుల భద్రత విషయంలో లోపాలు ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, అమరావతి రాజధాని ప్రాంతంలో రోడ్ల నిర్మాణాలు, డ్రైన్లు, తాగునీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ, పునర్వినియోగ నీటి లైన్, అవెన్యూ ప్లాంటేషన్ తదితర మౌలిక సదుపాయాల కల్పనకు రూ.1,052.67 కోట్లతో పనులు చేపట్టేందుకు మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

ఏపీ భవనాల రూల్స్ సవరణపై తుది నోటిఫికేషన్

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ భవనాల రూల్స్-2017కు సవరణలపై మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ తుది నోటిఫికేషన్ (జీవో .114) జారీచేసింది. భవన, లేఅవుట్ల అనుమతుల జారీ నిబంధనల్లో సవరణలకు రాష్ట్ర క్యాబినెట్ మంగళవారం ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో తుది నోటిఫికేషన్ విడుదల చేసింది. చిన్న భవనాలకు అనుమతుల విషయంలో వెసులుబాటు కల్పించారు. 50 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించే జీ, జీప్లస్ భవనాలకు కేవలం ఒక్క రూపాయి ఫీజు చెల్లించి అనుమతి తీసుకోవచ్చు. అన్ని రకాల భవనాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, హోటల్స్, గవర్నమెంట్ కాంప్లెక్స్‌లకు సీసీ టీవీలను తప్పనిసరి చేశారు. ఇంకా ప్లాట్ల సెట్ బ్యాక్ ఏరియా విషయంలోనూ పలు వెసులుబాట్లు కల్పించారు.

గ్రామీణ ప్రాంతాల్లో 7 అన్న క్యాంటీన్లు

పట్టణాభివృద్ధి అథారిటీ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో రూ.4.47 కోట్లతో ఏడు అన్న క్యాంటీన్లు మంజూరు చేస్తూ మున్సిపల్‌శాఖ ఉత్తర్వులు జారీచేసింది. అథారిటీ పరిధిలో కోటబొమ్మాళి, దుగ్గిరాల, శాంతిపురం, గుడిపల్లి, రామకుప్పం, కుప్పం (రూరల్), ఉప్పాడ కొత్తపల్లి ఉన్నాయి.

లేపాక్షి, తిరుపతిలో స్పేస్ సిటీలు

- 8 ఏళ్లలో 25 వేల కోట్ల పెట్టుబడులు లక్ష్యం: సీఎం

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని లేపాక్షి, తిరుపతిల్లో అంతరిక్ష నగరాలు (స్పేస్ సిటీలు) నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం ఉండవల్లి నివాసంలో స్పేస్ సిటీ పాలసీ-2025-35పై సమీక్ష జరిగింది. పరిశ్రమల మంత్రి టీజీ భరత్, ఆ శాఖ కార్యదర్శి యువరాజ్, సీఎంవో కార్యదర్శి కార్తికేయ మిశ్రా తదితరులు పాల్గొన్నారు. టెక్నాలజీకి లేపాక్షి, తయారీ రంగానికి తిరుపతి ప్రత్యేకంగా ఉండాలని సీఎం ఈ సందర్భంగా స్పష్టం చేశారు. స్పేస్ సిటీ రంగంలో 2033నాటికి రూ.25 వేల కోట్ల పెట్టుబడుల లక్ష్యంతో 4.0 పాలసీని రూపొందించాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. 35 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి దక్కేలా విధానం ఉండాలన్నారు. 'కమ్యూనికేషన్ రంగంలో అగ్రస్థానంలో ఉన్న సంస్థలను పెట్టుబడులు పెట్టేందుకు ఆహ్వానించాలి. ముందుకొచ్చే సంస్థలకు 25 నుంచి 45 శాతం దాకా పెట్టుబడి రాయితీ ఇచ్చేలా పాలసీలో ప్రతిపాదించాలి. రూ.కోటి నుంచి రెండున్నర కోట్ల దాకా మైక్రో పెట్టుబడులుగా, రూ.2.5 కోట్ల నుంచి రూ.25 కోట్ల దాకా చిన్నతరహా, రూ.25 కోట్ల నుంచి రూ.125 కోట్ల దాకా మధ్య తరహా, రూ.125 కోట్ల నుంచి రూ.500 కోట్ల దాకా భారీ పెట్టుబడులుగా ప్రకటించాలి. రూ.500 కోట్ల కన్నా ఎక్కువ పెట్టుబడులు పెడితే మెగా పరిశ్రమగా పరిగణించాలి. ఈ రంగంలోనూ మహిళలు, బీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలి. అంతరిక్ష యానంపై అవగాహన కలిగించేందుకు వీలుగా విద్యార్థులనూ భాగస్వాములను చేసేలా కార్యాచరణను సిద్ధం చేయాలి. పెట్టుబడులను ఆకర్షించేలా పాలసీకి రూపకల్పన చేయాలి. శాస్త్ర సాంకేతిక రంగంలో ఆసక్తి కలిగిన విద్యార్థులను, ప్రత్యేక బోధన చేసే విద్యాసంస్థలను కూడా భాగస్వాములను చేస్తే స్పేస్ సిటీ ముఖ్య ఉద్దేశాలు, ప్రభుత్వ ఆలోచనలు ప్రజలకు తెలుస్తాయి' అని స్పష్టం చేశారు. భవిష్యత్ అంతరిక్ష రంగానిదేనని రాష్ట్ర స్పేస్ టెక్నాలజీ గౌరవ సలహాదారు, ఇస్రో మాజీ చైర్మన్ సోమనాథ్ వెల్లడించారు. సమీక్షలో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఆయన పాల్గొన్నారు. స్పేస్ విజన్ పాలసీ-2047 కింద కేంద్రం కీలక ప్రాజెక్టులు చేపడుతోందని, స్టార్ లింక్, స్పేస్ఎక్స్, బ్లూ ఆరిజన్ వంటి ప్రైవేటు ఆపరేటర్లు ఈ రంగంలో సంచలనాలు సృష్టిస్తున్నారని వెల్లడించారు. కాగా.. విజన్-2047 కింద ఉపగ్రహాల తయారీ, రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాల ప్రయోగం, చంద్రయాన్-4, వీనస్ ఆర్బిటరీ మిషన్, మార్స్ ల్యాండర్ మిషన్, హ్యూమన్ స్పేస్ ఫ్లయిట్, స్పేస్ స్టేషన్, నెక్స్ట్ జనరేషన్ లాంచ్ వెహికల్, శ్రీహరికోటలో మూడో లాంచ్ ప్యాడ్ నిర్మాణం వంటివి లక్ష్యాలుగా నిర్దేశించుకోవాలని సమావేశం నిర్ణయించింది.

గుంటూరు కోర్టులో పీఎస్ఆర్‌కు ఎదురుదెబ్బ

- రఘురామ టార్చర్ కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత

గుంటూరు, అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, ప్రస్తుత అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజును సీఐడీ కస్టడీలో చిత్రహింసలకు గురిచేసిన కేసులో నిందితుడైన సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులుకు గుంటూరు కోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. ముందస్తు బెయిల్ కోసం ఆయన దాఖలు చేసుకున్న పిటిషన్‌ను గుంటూరు రెండో అదనపు జిల్లా జడ్జి కోర్టు కొట్టివేసింది. రఘురామను చిత్రహింసలకు గురిచేసిన సమయంలో అప్పటి సీఐడీ డీఐజీ మేకావత్ సునీల్ కుమార్‌నాయక్ కూడా అక్కడ ఉన్నట్లు పోలీసు దర్యాప్తులో తేలింది. దీంతో ఆయన పేరును సీడీ ఫైల్లో చేర్చారు. సునీల్ నాయక్‌ను జగన్ ప్రభుత్వం ఒడిసా నుంచి డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి తీసుకొచ్చి సీఐడీ డీఐజీగా నియమించింది. డిప్యుటేషన్ పూర్తయ్యాక ఆయన అక్కడకు వెళ్లిపోయారు. రఘురామ టార్చర్‌లో తన పాత్ర ఉందని పోలీసులు గుర్తించడంతో ఆయన ఒడిసా హైకోర్టు(కటక్)లో పిటిషన్ దాఖలు చేసి.. గతనెల 9న ప్రొటెక్షన్ ఆర్డర్ తీసుకున్నారు. ఈ కేసులో సునీల్ నాయక్ పాత్ర ఉందని.. ఆయనను విచారించాల్సిన అవసరం ఉందని, అందువల్ల ప్రొటెక్షన్ ఆర్డర్‌ను రద్దుచేయాలని దర్యాప్తు అధికారి అయిన ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఇప్పటికే ఆ హైకోర్టులో పిటిషన్ వేశారు. మరోవైపు.. ముందస్తు బెయిల్ కోసం పీఎస్ఆర్ గుంటూరు కోర్టును ఆశ్రయించారు. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం న్యాయాధికారి గురువారం పీఎస్ఆర్ ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేస్తూ ఆదేశాలిచ్చారు.

గ్రూప్-1 కేసులో బెయిల్ పొడిగింపు

ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష మూల్యాంకనంలో అక్రమాలకు పాల్పడడంతో పాటు నిధుల దుర్వినియోగం చేశారనే ఆరోపణలతో నమోదైన కేసులో సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు మధ్యంతర బెయిల్‌ను హైకోర్టు మరో రెండు నెలలు పొడిగించింది. కాగా, ఇదే కేసులో బెయిల్ కోరుతూ క్యామ్‌సైన్ సంస్థ డైరెక్టర్ మధుసూదన్ (ఏ2) వేసిన పిటిషన్ హైకోర్టులో విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్ వాదనలు వినిపించారు. పిటిషనర్ గాల్ బ్లాడర్, కిడ్నీ సంబంధ వ్యాధితో బాధపడుతున్నారన్నారు. జైలు అధికారులు ఎలాంటి వైద్యం అందించడం లేదన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు పిటిషనర్‌కు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించి, నివేదికను కోర్టు ముందు ఉంచాలని విజయవాడ జిల్లా జైలు సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. విచారణను జూలై 1కి వాయిదా వేశారు.

విశాఖకు వస్తున్నాం

- ప్రకటించిన సాఫ్ట్‌వేర్ సంస్థ కాగ్నిజెంట్
- కాపులుప్పాడలో 22 ఎకరాల్లో 'స్టేట్ ఆఫ్ ఆర్ట్ క్యాంపస్' నిర్మాణం
- 2026 తొలినాళ్లలో కార్యకలాపాలు మొదలు
- 8 వేల మందికి కొత్తగా ఉద్యోగాలు
- సన్‌రైజ్ రాష్ట్రానికి స్వాగతం: లోకేశ్



అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో మరో దిగ్గజ సాఫ్ట్‌వేర్ సంస్థ అడుగుపెడుతోంది. తాము విశాఖకు వస్తున్నాం అంటూ ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ కాగ్నిజెంట్ ఎక్స్ వేదికగా ఆంధ్రప్రదేశ్‌కు గురువారం పెద్ద శుభవార్త చెప్పింది. విశాఖపట్నానికి తమ కార్యకలాపాలు విస్తరిస్తున్నామని ఆపోస్టులో ప్రకటించింది. విశాఖలో కొత్త 'స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ క్యాంపస్' (అత్యంత ఆధునికమైన, నూతన సాంకేతికతతో కూడిన సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు కలిగిన క్యాంపస్)ను ప్రారంభిస్తున్నామని వెల్లడించింది. "విశాఖపట్నంలో కొత్త అత్యాధునిక క్యాంపస్‌ను ఏర్పాటు చేస్తున్నాం. అది కాపులుప్పాడలోని ఐటీ హిల్స్‌లో 22 ఎకరాల్లో విస్తరించి ఉంటుంది. ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రధానంగా కొత్తగా 8,000 ఉద్యోగాలు కల్పిస్తున్నాం. 2026 ప్రారంభంలో కార్యకలాపాలు మొదలవుతాయి. 2029 ప్రారంభం నాటికి తొలిదశ పూర్తవుతుంది" అని ఆ పోస్టులో వెల్లడించింది. ఇది ప్రాంతీయ టెక్ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేస్తుందని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్లయింట్లకు ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ డెలివరీలో తమ అధునాతన సామర్థ్యాలను పెంచుతుందని కాగ్నిజెంట్ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని అత్యున్నత నైపుణ్యం కలిగిన యువతను ఎంపిక చేసుకుంటున్నామని పేర్కొంది. తమ విస్తరణలో భాగస్వాములైన సీఎం చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపింది.

కాగ్నిజెంట్‌కు ధన్యవాదాలు: లోకేశ్

సన్‌రైజ్ రాష్ట్రానికి కాగ్నిజెంట్‌కు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి లోకేశ్ స్వాగతం పలికారు. భవిష్యత్తు కార్యకలాపాల కోసం విశాఖను ఎంచుకున్నందుకు ఆ సంస్థకు ఎక్స్ వేదికగా ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర యువతలో విశ్వాసాన్ని పెంచేలా అత్యాధునిక క్యాంపస్ ఏర్పాటవుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచస్థాయి ఆవిష్కరణ, ఉపాధిశక్తి కేంద్రంగా మార్చడానికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. మెరుగైన అవకాశాలు కల్పిస్తూ, వృద్ధిని పెంచుతూ ప్రజలకు మంచి భవిష్యత్తును రూపొందిస్తున్నామని తెలిపారు. మరిన్ని మెరుగైన ఫలితాలు కోసం వేచి చూస్తున్నామని చెప్పారు.

జగన్ బలప్రదర్శనలపై నిషేధం విధించాలి


- కాంగ్రెస్ బలోపేతం రాజకీయ అవసరం: షర్మిల



విజయవాడ, నరసరావుపేట టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పర్యటనల పేరుతో జగన్ చేస్తున్న బలప్రదర్శనలపై నిషేధం విధించాలని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జగన్ చేసిన బలప్రదర్శనలకు ఇప్పటి వరకు ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. మరో దుర్ఘటన జరగకుండా జగన్ బల ప్రదర్శనలను నిషేధించాలని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా కమిటీ సమావేశం విజయవాడలో, పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో విస్తృత స్థాయి సమావేశం గురువారం జరిగాయి. ఆయా సందర్భాల్లో ఆమె మాట్లాడారు. 'జగన్‌కు ప్రజాసమస్యలపై దృష్టి లేదు. ఆయనకు కావాల్సినవి బల ప్రదర్శనలు మాత్రమే. చంపినోళ్లు, చంపించినోళ్లు నేరం ఒప్పుకుంటారా? సొంత బాబాయిని చంపించి ఆ నేరాన్ని ఆయన కుమార్తె మీదకు తోశారు. అటువంటి వ్యక్తికి సింగయ్య మృతిపై ఏఐ వీడియో అంటూ అబద్ధాలు చెప్పడం ఒక లెక్కా..! బీజేపీ మోసాలపై చంద్రబాబు, పవన్ స్పందించడం లేదు. వాళ్లంతా బీజేపీకి ఊడిగం చేస్తున్నారు' అని మండిపడ్డారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలపడటం రాజకీయంగా చాలా అవసరం. గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టాం' అని పేర్కొన్నారు.

సిగ్నల్ ట్యాంపరింగ్.. రైల్లో దోపిడీ

- చిత్తూరు జిల్లా సిద్ధంపల్లెలో ఘటన


కత్తిరించిన సిగ్నల్ వైరు

చిత్తూరు రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి రైల్లోకి చొరబడిన దొంగల ముఠా నలుగురు మహిళల మెడలో ఉన్న 50 గ్రాములకుపైగా బంగారు ఆభరణాలను దోచుకొని పరారైంది. చిత్తూరు జిల్లా సిద్ధంపల్లె రైల్వేస్టేషన్ వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిందీ దోపిడీ. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మైసూరు నుంచి తిరుపతికి వస్తున్న చామరాజునగర్ ఎక్స్‌ప్రెస్(16219) గురువారం తెల్లవారుజామున 2.20 గంటలకు చిత్తూరు- కాట్పాడి మధ్య సిద్ధంపల్లె రైల్వే స్టేషన్‌కు కిలోమీటరు దూరంలో ఉండగా రెడ్ సిగ్నల్ పడడంతో లోకో పైలట్ రైలును ఆపేశారు. అప్పటికే అక్కడ మాటువేసిన దొంగల ముఠా ఒక రైలుపెట్టెలోకి చొరబడి, లైట్లు ఆపేసి, మహిళల మెడల్లోని బంగారు గొలుసులు దోచేసింది. మహిళలు కేకలు వేయడంతో లైట్లు వేసి చూడగా.. అప్పటికే దొంగలు పరారయ్యారు. రైలు తిరుపతికి చేరుకున్నాక బాధితులు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పథకం ప్రకారం సిగ్నల్ వైర్ కట్‌చేయడం ద్వారా రెడ్ సిగ్నల్ పడేలా చేసి, సిద్ధంపల్లె రైల్వేస్టేషన్‌కు కిలోమీటరు ముందుగానే రైలు ఆగేలా చేశారని తెలుస్తోంది. ఈ నెలలోనే ఇలా జరిగిన మూడో ఘటన ఇది. గత రెండు దోపిడీలు ముంగిలిపట్టు వద్ద జరిగాయి.

లిక్కర్ నిందితులకు నార్కో టెస్ట్?

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటి వరకూ తొమ్మిది మంది అరెస్టైన ఈ కేసులో నిందితుల జాబితా 39కి చేరింది. ఈ కేసులో కీలక వ్యక్తులైన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దనుంజయ్ రెడ్డి(ఏ-31), మాజీ సీఎం జగన్ ఓఎస్‌డీ కృష్ణ మోహన్ రెడ్డి(ఏ-32), భారతీ సిమెంట్స్ శాశ్వత డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప(ఏ-33) తమకు ఏమీ తెలియదని విచారణలో చెప్పారు. అయితే ఆ ముగ్గురి పాత్రపై టెక్నికల్ ఎవిడెన్స్ సేకరించిన సిట్ వాటిని ముందుంచి ప్రశ్నించినా ఫలితం లేకపోయింది. తాజాగా మరో కీలక నిందితుడు, వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని(ఏ-38) సిట్ అరెస్టు చేసింది. మద్యం ముడుపుల డబ్బులు గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులకు పంచినట్లు వాహనాల నంబర్లు, టోల్ గేట్లలో ఫుటేజీ, హైదరాబాద్‌లో డబ్బు తీసుకుని ఏపీకి తీసుకొచ్చిన వ్యక్తుల వాంగ్మూలాలు, వారి టవర్ లొకేషన్లన్నీ చూపించి చెవిరెడ్డిని ప్రశ్నించినా ఆయన నిజాలు వెల్లడించలేదు. పైగా తనను మానసికంగా ఇబ్బంది పెట్టి తాను చెప్పని విషయాలు రిమాండ్ రిపోర్టులో రాశారంటూ సిట్ అధికారులపై కోర్టులో నిందలేశారు. ఇవన్నీ సమీక్షించుకున్న సిట్ అధికారులు, న్యాయస్థానం అనుమతి తీసుకుని నార్కో అనాలసిస్ పరీక్షలు చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచనకు వచ్చినట్లు తెలిసింది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి సూచన మేరకు కోర్టులో అనుమతి పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

పాలిగ్రాఫ్ టెస్ట్ అంటే..

సెన్సార్లతో కూడిన ఎలక్ట్రానిక్ పరికరాలను శరీరానికి అమర్చి, నిందితుడి బీపీ, పల్స్ శ్వాసక్రియ, ఇతర భావోద్వేగాలను జాగ్రత్తగా నిపుణుడు పర్యవేక్షిస్తాడు. సదరు వ్యక్తిని దర్యాప్తు అధికారి ప్రశ్నించినప్పుడు... వాటిలో కనిపించే మార్పు ఆధారంగా అతడు చెప్పేది నిజమా.?లేక అబద్ధమా.? అనేది నిర్ధారణకు వస్తారు. ఈ పద్ధతినే 'లై డిటెక్టర్ టెస్ట్' అని కూడా పిలుస్తారు.

నార్కో-విశ్లేషణ..: గ్రీకు భాషలో నార్క్ అంటే తిమ్మిరి. ఈ పరీక్షలో వ్యక్తి శరీరంలోకి ట్రూత్ సీరమ్ (సోడియం పెంటోథాల్, స్కోపోలమైన్, సోడియం అమిటల్) అనే మిశ్రమంతో కూడిన మందును నిందితుడికి ఇంజెక్షన్ ద్వారా ఇచ్చి మెదడు నిగ్రహం కోల్పోయే స్థితికి తీసుకొస్తారు. సగం నిద్రలోకి వెళ్లిన నిందితుడు ఆ ఇంజెక్షన్ ప్రభావంతో ఎలాంటి అదుపు లేకుండా తనకు తెలిసిన విషయాలను దర్యాప్తు అధికారికి వెల్లడిస్తాడు.

బ్రెయిన్ మ్యాపింగ్..: ముఖం, మెడ ప్రాంతాల్లో ఎలక్ట్రికల్ వైర్లతో కూడిన కప్స్ అమర్చి మెదడు కార్యకలాపాలను అంచనా వేస్తారు. ఎదుటి వ్యక్తి చెప్పేది నిజమా లేదా అబద్ధమా అనేది ఈ విధానంలో తెలుసుకోవచ్చు.

మీ కుమార్తె ఖాతాకు రూ.70 లక్షలు

- నిరంజన్‌రెడ్డి అకౌంట్ నుంచి ఎందుకొచ్చాయి?.. కాకాణికి సిట్ ప్రశ్నలు

నెల్లూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): గ్రావెల్ కుంభకోణం కేసుకు సంబంధించి రెండో రోజు గురువారం విచారణలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై సిట్ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. బ్యాంక్ స్టేట్‌మెంట్లు కాకాణి ముందుంచి వీటికి ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. తొలిరోజు జరిగిన విచారణలో ఈ కేసులోని ఇతర నిందితులతో తనకెలాంటి సంబంధం లేదని కాకాణి గట్టిగా వాదించినట్లు తెలిసింది. దీంతో రెండోరోజు విచారణలో నిందితుల అకౌంట్ల నుంచి మీ కుటుంబ సభ్యులకు లక్షల రూపాయలు ఎందుకు బదిలీ అయ్యాయని బ్యాంక్ రికార్డులు చూపించి కాకాణిని ప్రశ్నించినట్లు సమాచారం. ఈ కేసులో కీలక నిందితుడైన నిరంజన్‌రెడ్డి అనే వ్యక్తి బ్యాంక్ అకౌంట్ స్టేట్‌మెంట్ల ఆధారంగా గురువారం కాకాణిని ఊపిరి సలపకుండా ప్రశ్నించారని తెలిసింది. నిరంజన్‌రెడ్డి బ్యాంక్ అకౌంట్ నుంచి కాకాణి కుమార్తె అకౌంట్‌కు రూ.70 లక్షలు ట్రాన్స్‌ఫర్ అయిన స్టేట్‌మెంట్లను చూపి దీనికి సమాధానం చెప్పాలని నిలదీశారు. తన కుమార్తెకు పెళ్లి చేసి పంపేశానని, ఆమెకు తనకు ఎలాంటి సంబంధం లేదని కాకాణి సమాధానం చెప్పినట్లు తెలిసింది. సింగ్‌పూర్ నుంచి నిరంజన్‌రెడ్డి హౌస్ ఇంటీరియర్ మెటీరియల్ చాలా కొనుగోలు చేశారు. అవన్నీ మీ ఇంటికే ఇచ్చినట్లు చెబుతున్నాడని కాకాణిని అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ విధంగా ఆర్థిక పరమైన అంశాలపై ఆధారాలతో సహా సుమారు 5గంటల సేపు కాకాణిని విచారించారు.

సింగయ్య మృతి కేసులో.. జగన్ క్వాష్ పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా

- ఆయన పీఏ, వైవీ, పేర్ని, రజని వ్యాజ్యాలపైనా..

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సింగయ్య మృతి కేసులో తమపై నల్లపాడు పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ వైసీపీ అధినేత జగన్, ఆ పార్టీ నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను హైకోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది. గురువారం ఇవి కోర్టు ముందుకు రాగా.. అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.. మొదటిసారి విచారణకు వచ్చాయని.. తనతోపాటు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూత్రా వాదనలు వినిపిస్తారని.. కేసు డైరీ, ఇతర వివరాలు తెప్పించుకోవలసి ఉందని తెలిపారు. వ్యాజ్యాలపై సోమవారం లేదా మంగళవారం విచారణ చేపట్టాలని కోరారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, సి.రఘు, న్యాయవాదులు వై.నాగిరెడ్డి, దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.... పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు పిటిషనర్లకు వర్తించవన్నారు. పోలీసులు తొందరపాటు చర్యలు తీసుకుంటారనే ఆందోళన ఉందని తెలిపారు. వివరాలు తెప్పించుకునేందుకు ఏజీ సమయం కోరుతున్నందున అరెస్టు నుంచి పిటిషనర్లకు రక్షణ కల్పించాలని కోరారు. తొందరపాటు చర్యలు తీసుకోబోమని ఏజీ హామీ ఇచ్చినా అభ్యంతరం లేదన్నారు. దమ్మాలపాటి జోక్యం చేసుకుంటూ.. క్వాష్ పిటిషన్ ద్వారా అరెస్టు నుంచి రక్షణ కోరలేరని, ఈ విషయంలో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పులు ఇచ్చిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు తొందరపాటు చర్యలు తీసుకుంటారని పిటిషనర్లకు ఆందోళన ఉంటే ముందస్తు బెయిల్ పిటిషన్లు వేసుకుని ఉండాల్సిందన్నారు. ఇరుపక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు. అప్పటివరకు పోలీసులు తొందరపాటు చర్యలు తీసుకోబోరని భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

జగన్‌కు జెడ్‌ప్లస్ కాగితాలకే పరిమితం

- గవర్నర్‌కు వైసీపీ బృందం ఫిర్యాదు

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు జెడ్‌ప్లస్ కేటగిరి కాగితాలకే ప్రభుత్వం పరిమితం చేసిందని గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వైసీపీ బృందం ఫిర్యాదు చేసింది. జగన్‌కు పూర్తిస్థాయిలో భద్రతను అమలు చేయడం లేదని, రోప్ పార్టీ జనాలను నియంత్రించడం లేదని ఫిర్యాదు చేశారు. గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్ నజీర్‌ను 15మంది సభ్యుల వైసీపీ బృందం కలిసింది. జగన్‌ను ప్రజల మధ్య తిరగకుండా దొంగ కేసులు పెడుతున్నారని చెప్పారు. జగన్‌పై పెడుతున్న కేసులపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని వైసీపీ నేతలు కోరారు. కాగా, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం యెలహంకకు వెళ్లారు. సోమవారం తాడేపల్లికి చేరుకుంటారు.

టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా కేసులో.. 'బోలేబాబా' డైరెక్టర్ల బెయిల్‌పై తీర్పు రిజర్వు

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన వ్యవహారంలో బోలేబాబా డెయిరీ డైరెక్టర్లు పోమిల్ జైన్, విపిన్ జైన్ బెయిల్ పిటిషన్లపై హైకోర్టులో గురువారం వాదనలు ముగిశాయి. తీర్పును రిజర్వు చేస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. టీటీడీకి నకిలీ నెయ్యి సరఫరా చేసిన వ్యవహారంలో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న పోమిల్ జైన్ (ఏ3), విపిన్ జైన్(ఏ4) హైకోర్టులో బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు ఇటీవల విచారణకు రాగా పిటిషనర్లు సాక్షులను బెదిరించారనేందుకు ఆధారాలను కోర్టు ముందుంచాలని సిట్‌ను న్యాయస్థానం ఆదేశించింది. ఈ వ్యాజ్యాలు గురువారం మరోసారి విచారణకు రాగా సీబీఐ తరఫు స్టాండింగ్ కౌన్సిల్ పీఎస్‌పీ సురేష్‌కుమార్, పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు.

నాపై కేసు కొట్టేయండి.. హైకోర్టుకు మోహిత్‌రెడ్డి

అమరావతి, విజయవాడ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం వ్యవహారంలో మంగళగిరి సీఐడీ పోలీసులు తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు, తుడా మాజీ చైర్మన్ మోహిత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. నిందితుల జాబితా నుంచి తన పేరును తొలగించేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. ఎన్నికల ముందు వివిధ మార్గాల నుంచి మద్యం ముడుపుల ద్వారా వచ్చిన సొమ్మును చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పొందారని, తుడా చైర్మన్‌గా మోహిత్‌రెడ్డికి ప్రభుత్వం అధికారికంగా కేటాయించిన వాహనంలో ఆ డబ్బును తరలించామని, ఆ సొమ్మును ఎన్నికల్లో పంచారని ఆయన గన్‌మెన్ ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మోహిత్‌రెడ్డిని ఈ కేసులో నిందితులుగా చేర్చారు. కాగా, మోహిత్‌రెడ్డి బెయిల్ పిటిషన్లపై విజయవాడలోని ఏసీబీ కోర్టు ఈ నెల 30న తీర్పు వెల్లడించనుంది. సిట్ నమోదు చేసిన మద్యం కేసులో మోహిత్‌రెడ్డి ఏ39గా ఉన్నారు. ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిని అరెస్టు చేయగానే మోహిత్‌రెడ్డి ముందస్తు బెయిల్ కోసం ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తర్వాత మధ్యంతర బెయిల్ కోరుతూ మరో పిటిషన్ వేశారు. ఈ రెండు పిటిషన్లపై వాదనలు గురువారం ముగిశాయి. దీంతో న్యాయాధికారి పి.భాస్కరరావు తీర్పును ఈనెల 30వ తేదీకి వాయిదా వేశారు. అదేవిధంగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెరుకూరి వెంకటేష్ నాయుడు కస్టడీ పిటిషన్‌పై తీర్పును కూడా 30 తేదీకి వాయిదా వేశారు. వెంకటేష్‌నాయుడుకు ఇంటి భోజనం అనుమతి, బెయిల్ మంజూరు అభ్యర్థనలపైనా తీర్పును అదే రోజుకు వాయిదా వేశారు. ఇదే కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న పైలా దిలీప్ బెయిల్ పిటిషన్‌పైనా వాదనలు ముగిశాయి. ఆ తీర్పును జూలై 3వ తేదీకి వాయిదా వేశారు.

హనీమూన్ మర్డర్‌లా దొరికిపోవద్దు!

- మేఘాలయలో నిందితుల్లా కాకుండా.. మనం పక్కాగా చేయాలి
- తేజేశ్వర్ హత్యకు ముందు ఐశ్వర్య, తిరుమలరావు ప్రణాళిక
- గద్వాల కేసును ఛేధించిన పోలీసులు.. 8 మంది అరెస్టు

గద్వాల క్రైం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): 'అనుకున్నట్లుగానే హత్య చేయాలి.. అయితే మేఘాలయలో జరిగిన హనీమూన్ మర్డర్ ఘటనలో దుండగుల మాదిరిగా దొరికిపోకూడదు. ఆ ఘటనలో హంతకులు ఏదో పొరపాటు చేసి పట్టుబడ్డారు. మనం మాత్రం ఎలాంటి పొరపాటు జరగకుండా పక్కాగా పని కానిచ్చేద్దాం' తేజేశ్వర్ హత్యకు ఆయన భార్య ఐశ్వర్య, ఆమె ప్రియుడు తిరుమలరావు వేసుకున్న ప్రణాళిక ఇది!! తేజేశ్వర్‌ను చంపిన తర్వాత ఇద్దరూ లద్దాఖ్‌కు హనీమూన్ వెళ్లాలనీ అనుకున్నారు. ఒకవేళ అనుకోని కారణాల వల్ల హత్య ఆలస్యమైతే ఆషాఢమాసంలో అండమాన్ లేదా మరే ప్రాంతానికైనా విహారానికి వెళ్లాలని ప్లాన్ చేసుకున్నారు. అనుకున్నట్లుగానే తేజేశ్వర్‌ను చంపించినా పోలీసులకు దొరికిపోయి కటకటాలపాలయ్యారు. తెలంగాణలోని గద్వాలకు చెందిన తేజేశ్వర్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. 8 మందిని అరెస్టు చేశారు. వివాహేతర సంబంధమే హత్యకు కారణమని గద్వాల జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు గురువారం విలేకరులకు వెల్లడించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.